PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 285 | విజయవాడ, సోమవారం 20 మే 2024 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Monday 20 May 2024 | Rs

నేడు ఐదో దశ పోలింగ్

- 8 రాష్ట్రాల్లో 49 లోక్‌సభ స్థానాలు
- 8.95 కోట్ల మంది ఓటర్లు..

• లోపలి పేజీలో..•

సూపర్ సన్‌రైజర్స్

- పంజాబ్ కింగ్స్‌పై అదిరే విజయం
- ఛేదనలో అభిషేక్, క్లాసెన్, నితీశ్ జోరు
- హైదరాబాద్‌కు రెండో స్థానం

6



నికోబార్ దీవులను తాకిన నైరుతి రుతు పవనాలు

22 నాటికి బంగాళాఖాతంలో అల్పపీడనం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో, న్యూఢిల్లీ

దక్షిణ అండమాన్ సముద్రం, నికోబార్ దీవులు, మాల్దీవులు, కొమొరిన్ ప్రాంతంలోని కొన్ని ప్రాంతాల్లో నైరుతి రుతు పవనాలు ఆదివారం విస్తరించాయి. ఈ మేరకు భారత వాతావరణ శాఖ (ఐఎండి), అమరావతి వాతావరణ కేంద్రం ఆదివారం వేర్వేరు ప్రకటనలు విడుదల చేశాయి. 'మాల్దీవుల్లో కొన్ని ప్రాంతాలు, కొమొరిన్ ప్రాంతం, దక్షిణ బంగాళాఖాతం, నికోబార్ దీవులు, దక్షిణ అండమాన్ సముద్రంలో కొన్ని ప్రాంతాలకు ఆదివారానికి నైరుతి రుతుపవనాలు చేరుకున్నాయి' అని ఐఎండి తెలిపింది. ఈ నెల 22 నాటికి నైరుతి బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని, ఇది క్రమంగా ఈశాన్య దిశగా కదిలే అవకాశం ఉందని అమరావతి వాతావరణ కేంద్రం పేర్కొంది. మే 24 నాటికి మధ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని వెల్లడించింది.

దక్షిణ ఛత్తీస్‌గఢ్ నుంచి దక్షిణ అంతర్గత కర్ణాటక వరకు తెలంగాణ, రాయలసీమ మీదుగా సగటు సముద్ర మట్టానికి 31 కిలోమీటర్ల ఎత్తులో ఉన్న ద్రోణి బలహీనపడిందని, ఆంధ్రప్రదేశ్, యానాంలలో దిగువ ట్రోపో ఆవరణంలో ఆగ్నేయ, నైరుతి దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతి వాతావరణ కేంద్రం పేర్కొంది. రానున్న మూడు రోజుల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, ఉరుములతో కూడిన మెరుపులు ఒకట్రెండు చోట్ల సంభవించే అవకాశముంది. బలమైన ఈదురుగాలులు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో వీచే అవకాశం ఉందని అమరావతి వాతావరణ కేంద్రం పేర్కొంది.

పసిఫిక్ మహా సముద్రంలో లా నినా పరిస్థితుల కారణంగా ఈ ఏడాది రుతుపవనాల సీజన్‌లో సాధారణం కంటే ఎక్కువ వర్షం కురుస్తుందని గత నెలలోనే ఐఎండి అంచనా వేసింది. ప్రస్తుతం దేశంలోని అనేక పట్టణాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు 48 డిగ్రీల సెల్సియస్ కంటే ఎక్కువగా నమోదవుతున్నాయి. అనేక ప్రాంతాలు కరువు వంటి పరిస్థితులను ఎదుర్కొంటున్నాయి. ఇలాంటి సమయంలో సాధారణ వర్షపాతం కంటే ఎక్కువ వర్షపాతం నమోదవుతుందన్న అంచనా దేశానికి భారీ ఉపశమనం కలిగిస్తుంది.

సిట్ దర్యాప్తు ముమ్మరం

- పల్నాడు, అనంతపురం జిల్లాల్లో కొనసాగింపు
- తిరుపతి జిల్లాలో ప్రారంభం
- నేడు ఇసికి నివేదిక

తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గం కూచువారిపల్లిలో స్థానికులను విచారిస్తున్న సిట్ బృందం

ప్రజాశక్తి- యంత్రాంగం

సార్వత్రిక ఎన్నికల సమయంలోనూ, ఆ తర్వాతా రాష్ట్రంలో జరిగి హింసాత్మక ఘటనలపై ఏర్పాటైన ప్రత్యే దర్యాప్తు బృందం (సిట్) విచారణను వేగవంతం చేసింది. పల్నాడు, అనంతపురం జిల్లాల్లో శనివారమే విచారణ ప్రారంభం కాగా, తిరుపతిలో ఆదివారం ప్రారంభమైంది. వినీత్ బ్రిజ్‌లాల్ నేతృత్వంలో 13 మంది అధికారులతో ఏర్పాటైన సిట్ బృందం తన నివేదికను ఎన్నికల కమిషన్‌కు సోమవారం ఇవ్వనుంది. ఈ నేపథ్యంలో ఎవరెవరిపై వేటు పడనుందో, ఎవరెవరిని బాధ్యులు చేయనుందో అనే ఉత్కంఠ నెలకొంది. దాడులతో సంబంధం ఉన్న వారు కొందరు ఇప్పటికే అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. అనంతపురం జిల్లా తాడిపత్రికి శనివారం రాత్రి చేరుకున్న సిట్ బృందం సభ్యులు డిఎస్‌పి శ్రీనివాసులు, ఎసిబి డిఎస్‌పి భూషణం, ఎసిబి ఇన్‌స్పెక్టర్ జిఎల్.శ్రీనివాస్ ఆదివారం సాయంత్రం వరకు దర్యాప్తు కొనసాగించారు. తాడిపత్రిలో రాళ్ల దాడులు జరిగిన ప్రాంతాలను శనివారం రాత్రి పరిశీలించారు. ఓంశాంతి నగర్, పాతకోట, గానుగ వీధిలో పర్యటించి స్థానికులతో మాట్లాడారు. ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్ ఇళ్ల పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఇరువర్గాలూ గొడవపడిన తాడిపత్రిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో కలియతిరిగారు. రాళ్ల దాడి ఏ విధంగా జరిగిందో ఆరా తీశారు. ఆదివారం పట్టణ పోలీస్ స్టేషనలో పలు రికార్డులను పరిశీలించారు. డిఐజి షిమోషీతో సమావేశమయ్యారు. తాడిపత్రిలో జరిగిన రాళ్ల దాడులు, ఎమ్మెల్యే పెద్దారెడ్డి, మున్సిపల్ చైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి ఇళ్ల వద్ద జరిగిన హింసాత్మక ఘటనలు, పోలీసు అధికారులు వ్యవహరించిన తీరుపై ఆరా తీశారు. అనంతరం రూరల్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. అక్కడ రికార్డులను పరిశీలించారు. బందోబస్తు సిబ్బందితో మాట్లాడారు. సిట్ అధికారులు ప్రతి విషయాన్నీ క్షుణ్ణంగా పరిశీలించి, వివరాలు నమోదు చేసుకున్నారు.

సిట్ అధికారులకు ఎమ్మెల్యే భార్య వినతి

పోలింగ్ అనంతరం మే 14న జరిగిన ఘర్షణలో ఎమ్మెల్యే నివాసం, కార్యాలయంలో పలు వస్తువులను ధ్వంసం చేశారని, దీనిపై సమగ్ర విచారణ జరిపించాలని కోరుతూ తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి భార్య రమాదేవి సిట్ మిగతా 2లో



ప్రమాదానికి గురైన హెలికాప్టర్ (ఇన్‌సెట్‌లో) ఘటనాస్థలి మ్యాప్

కూలిన ఇరాన్ అధ్యక్షుడి హెలికాప్టర్

రైసీ పరిస్థితిపై ఆందోళన

- ప్రమాదానికి దట్టమైన పొగ మంచే కారణమన్న అధికార్లు
- ఘటనా స్థలానికి హుటాహుటిన సహాయక బృందాలు
- గాలింపు చర్యలకు ఆటంకంగా మారిన వాతావరణం

టెహ్రాన్ : ఇరాన్ అధ్యక్షుడు ఇబ్రహీం రైసీని తీసుకుని వెళ్తున్న హెలికాప్టర్ ఆదివారం అజర్‌బైజాన్ రిపబ్లిక్ సరిహద్దుల్లోని ఓ మారుమూల ప్రాంతంలో కూలిపోయింది. అయితే, ఈ ప్రమాదం నుంచి రైసీ బయటపడ్డారా లేదా అనేది ఇంకా స్పష్టం కాలేదు. దట్టమైన పొగ మంచు వల్ల హెలికాప్టర్‌ను అత్యవసర ల్యాండింగ్‌కు యత్నించగా ఈ ప్రమాదం చోటచేసుకున్నట్లు ఇరాన్ ఆంతరంగిక భద్రతా మంత్రి అహ్మద్ వహిదీని ఉటంకిస్తూ జాతీయ టెలివిజన్ తెలిపింది. ఇరాన్ మిగతా 2లో

మద్దతుదారులను ఉద్దేశించి మాట్లాడుతున్న కేజ్రీవాల్

ఆప్‌ను నాశనం చేసేందుకే

'ఆపరేషన్ ఝాడూ'

- మోడీ కుట్ర పన్నారన్న కేజ్రీవాల్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఆమాద్మీ పార్టీని పూర్తిగా నాశనం చేయాలన్న దుర్బుద్ధితోనే బిజెపి 'ఆపరేషన్ ఝాడూ'ను చేపట్టిందని ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ విమర్శించారు. ఆప్ నేతలను అరెస్టు చేసి జైలుపాలు చేసేందుకు ప్రధాని నరేంద్ర మోడీ, బిజెపి ఆపరేషన్ ఝాదూ చేపట్టాయని అన్నారు.. స్వాతి మలివాల్‌పై దాడి కేసులో అరవింద్ కేజ్రీవాల్ పిఎ బిభవ్ కుమార్ అరెస్టుకు నిరసనగా ఢిల్లీలో బిజెపి ప్రధాన కార్యాలయానికి ఆప్ శ్రేణులు ప్రదర్శన నిర్వహించారు. అయితే ప్రదర్శనను ఢిల్లీ పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా కేజ్రీవాల్ మాట్లాడుతూ.. బిజెపికి ధీటుగా ఆప్ ఎదగకుండా నిరోధించేందుకు బిజెపి, ప్రధాని మోడీ కుట్రపూరితంగా ఆపరేషన్ మిగతా 2లో

గుబులు రేపుతున్న పోస్టల్ బ్యాలెట్

- ఓట్లు చెల్లకపోతే ఎలా?
- ఉద్యోగుల్లో ఆందోళన

ముగిసిన 'కొలంపురి' నాటిక పోటీలు

- ఉత్తమ ప్రదర్శనగా ఇంద్రప్రస్థం

సింగపూర్‌లో కోవిడ్ కేసులు రెట్టింపు

రోజుకో అబద్ధం గంటకో విద్వేష బీజం

- ప్రధాని మోడీపై స్టాలిన్ ఆగ్రహం

• లోపలి పేజీలో..•

భావితరాలకు సుందరయ్య మార్గదర్శి

- మతోన్మాదంతో నియంతృత్వ ముప్పు : శ్రీనివాసరావు
- 'మతోన్మాదం - రాజ్యాంగం- సవాళ్లు'పై స్మారకోపన్యాసం

మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

కమ్యూనిస్టు యోధులు పుచ్చలపల్లి సుందరయ్య భావితరాలకు మార్గదర్శి అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. ప్రజాస్వామ్యానికి, లౌకికవాదానికి, సామాజిక న్యాయానికి, స్వావలంబనకు, ఫెడరలిజానికి విఘాతం కలిగిస్తూ దేశంలో ప్రధాని మోడీ పదేళ్లుగా పాలన సాగిస్తున్నారని వివరించారు. ఈ క్రమంలో నేటి యువతరానికి సుందరయ్య జీవిత ఆదర్శాలు, ఆయన చేసిన రచనలు ఎంతో అవసరమని చెప్పారు. సుందరయ్యకు నిజమైన నివాళి అంటే రాజ్యాంగ హక్కుల రక్షణ, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు పాటుపడడమేనన్నారు. పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి సభ విశాఖలోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో ఆదివారం నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా హాజరైన వి.శ్రీనివాసరావు... 'మతోన్మాదం - రాజ్యాంగం - ప్రస్తుత సవాళ్లు' అనే అంశంపై స్మారకోపన్యాసం చేశారు. పాతాళానికి తొక్కినా తిరిగి ఆకాశానికి ఎగరగలిగిన శక్తి కమ్యూనిజానికి ఉందన్నారు. కారల్ మార్క్స్ కమ్యూనిస్టు ప్రణాళికను రాసినప్పుడు ప్రపంచాన్ని కమ్యూనిజం భూతం ఆవహించిందంటూ అమెరికా వ్యంగ్యంగా మాట్లాడిందని గుర్తు చేశారు. వాస్తవానికి అమెరికాకు ఇప్పుడు కమ్యూనిజం భయం అలముకుందన్నారు. అమెరికా తన శత్రువుగా చైనాను నేటికీ చెబుతోందని, అమెరికాకు పెద్ద సవాలుగా కమ్యూనిజం ఉందని తెలిపారు. భారత ప్రధాని మోడీ ఎక్కడ పర్యటించినా చైనాను తిట్టకుండా ఉండడం లేదన్నారు. ప్రపంచ వ్యాపారంలో చైనా అగ్రగామిగా ఉందని గుర్తు చేశారు. మన దేశ పాలకులకు చైనాతో వేల కోట్ల వ్యాపారం కావాలిగానీ, ఆ దేశ కమ్యూనిజం వద్దని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. 1920-29 మధ్య భారత్‌లో కమ్యూనిజాన్ని బ్రిటిష్ వారు అణచివేయాలని చూసినా సాధ్యం కాలేదన్నారు. ఆ కాలంలోనే ప్రపంచ వ్యాప్తంగా కమ్యూనిస్టు భావజాలం మరింత ఉధృతంగా ముందుకొచ్చిందని తెలిపారు. ప్రస్తుతం మన దేశ రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి, సామాజిక న్యాయానికి మతోన్మాదంతో ప్రమాదం దాపురించిందని శ్రీనివాసరావు ఆందోళన వ్యక్తం చేశారు. దేశ ప్రజలు మత స్వేచ్ఛను కోల్పోతున్నారని తెలిపారు. మతోన్మాదంతో నియంతృత్వ ప్రమాదం పొంచి ఉందన్నారు. ఒక్కో రాష్ట్రంలో మిగతా 2లో

అడుగంటిన బొగ్గు నిల్వలు

- రెండు రోజులకు కూడా సరిపోని పరిస్థితి
- అధిక ధరకు ప్రైవేట్ విద్యుత్ కొనుగోలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో థర్మల్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ల పరిస్థితి దినదినగండంగా మారింది. ప్లాంట్లకు ఒక్కరోజు బొగ్గు ఆగినా అక్కడ విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయే ప్రమాదం ఉండగా, రాష్ట్రంలో ప్రస్తుతం అదే పరిస్థితి నెలకొంది. రాష్ట్రంలో థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో బొగ్గు నిల్వలు అడుగంటాయి. ఎపిజెన్‌కో ఆధ్వర్యంలో మూడు విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు నడుస్తున్నాయి. వీటిల్లో ఒక్క దానిలో కూడా రెండు రోజులకు సరిపడ బొగ్గు నిల్వలు కూడా లేని పరిస్థితి. శ్రీదామోదరం సంజీవయ్య థర్మల్ ప్లాంట్‌లో ఒక్కరోజుకు కూడా సరిపడ నిల్వలు లేవు. బొగ్గు అందుబాటులో లేకపోవడంతో విద్యుత్ ఉత్పత్తిని తగ్గించాల్సిన పరిస్థితి నెలకొంది. దామోదరం సంజీవయ్య ప్లాంట్ నడవాలంటే రోజుకు సరాసరి 29 వేల మెట్రిక్ టన్నుల (ఎంటి) బొగ్గు అవసరంగా కాగా, ప్రస్తుతం అక్కడ 25,003 ఎంటిలు మాత్రమే అందుబాటులో ఉంది. దీంతో రోజుకు 22,458 ఎంటిల బొగ్గుతోనే ప్లాంట్‌ను నడుపుతున్నారు. విజయవాడ ప్లాంట్ రోజువారీ నడిచేందుకు 41,500 ఎంటిల బొగ్గు అవసరం. ఇక్కడ 53,487 ఎంటిలు మాత్రమే అందుబాటులో ఉంది. దీంతో 29,689 ఎంటిలతో నడుపుతున్నారు. రాయలసీమ థర్మల్ ప్లాంట్ రోజువారీ నడిచేందుకు 21 వేల ఎంటిల బొగ్గు అవసరం. ఇక్కడ 30,309 ఎంటిలు మాత్రమే అందుబాటులో ఉండటంతో 20,897 ఎంటిల బొగ్గుతోనే ప్లాంట్‌ను నడుపుతున్నారు.

రాష్ట్రంలో వాతావరణం మార్పులతో విద్యుత్ వినియోగం తగ్గింది. అయినా ప్రైవేట్ నుంచి అధిక ధరకు విద్యుత్ పంపిణీ సంస్థలు విద్యుత్ కొనుగోలు చేస్తున్నాయి. యూనిట్‌కు సరాసరి రూ.8.237 పెట్టి సంస్థలు కొంటున్నాయి. శనివారం 21.290 ఎంయుల విద్యుత్‌ను రూ.17.537 కోట్లతో పంపిణీ సంస్థలు కొనుగోలు చేశాయి. శుక్రవారం రూ.8.433లతో 21.324 ఎంయులను రూ.17.983 కోట్లతో ప్రైవేట్ నుంచి తీసుకున్నాయి. వినియోగం తగ్గిన రోజుల్లో కూడా అధిక ధరకు కొనుగోలు చేయడం గమనార్హం. రాష్ట్రంలో రెండు వారాల నుంచి వాతావరణం చల్లగా ఉండటం, కొన్నిచోట్ల వర్షాలు పడటంతో రోజువారీ విద్యుత్ డిమాండ్ పడిపోయింది. మేలో రోజువారీ డిమాండ్ సాధారణంగా 240 మిలియన్ యూనిట్లు (ఎంయు)లకు పైనే ఉంటుంది. ఈ నెల 6వ తేదీన 255.8 ఎంయుల డిమాండ్ నమోదైంది. ఆ మరుసటి రోజు నుంచి విద్యుత్ వినియోగం పడిపోయింది. గడిచిన రెండు వారాల్లో 15వ తేదీ మాత్రమే 226.236 ఎంయుల డిమాండ్ నమోదైంది. గతేడాది మే 18వ తేదీన విద్యుత్ డిమాండ్ 251 ఎంయులు నమోదవ్వగా, ఈ ఏడాది అదే రోజు (శనివారం) 210.35 ఎంయులు మాత్రమే నమోదైంది.

ముగ్గురు మహిళలు అనుమానాస్పద మృతి

- ఇద్దరి వివరాలే లభ్యం

ప్రజాశక్తి- కర్నూలు క్రైమ్

కర్నూలు తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని ముగ్గురు మహిళలు అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. వారిలో ఇద్దరి మృతదేహాలు చెరువులో ఉన్నాయి. మరో మహిళ మృతదేహం చెరువు గట్టుపై ఉంది. ప్రమాదవశాత్తు వీరు మృతి చెందారా? లేక ఎవరైనా హత్య చేశారా? అనే కోణంలో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. శనివారం సాయంత్రం ఈ ఘటన జరిగి ఉండవచ్చని అంచనా వేస్తున్నారు.

మృతి చెందిన మహిళల్లో ఇద్దరి వివరాలే తెలిశాయి. మరో మహిళ వివరాలు తెలుసుకోవడానికి పోలీసులు ప్రయత్నిస్తున్నారు. పోలీసుల కథనం ప్రకారం... కర్నూలు మండలం గార్గేయపురం సమీపంలోని నగరవనం వద్ద చెరువులో ఇద్దరి మహిళల మృతదేహాలు నీటిపై తేలియాడుతూ ఉండడాన్ని స్థానికులు గుర్తించారు. అదే చెరువు గట్టుపై గాయాలతో మరొక మహిళ మృతదేహం కనిపించింది. ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలికి చేరుకున్నారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీములను రప్పించి ఆనవాళ్లను సేకరించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కర్నూలు జిల్లా సర్వజన వైద్యశాలకు తరలించారు. మృతుల్లో తెలంగాణ రాష్ట్రం వనపర్తికి చెందిన ఇద్దరు ఉన్నారు. వారిని జానకి (35), కరుణ (40)గా గుర్తించారు. ఈ ఘటన ప్రమాదవశాస్తు జరిగిందా? లేక ఎక్కడో హత్య చేసి మృతదేహాలను ఇక్కడ ఇలా పడేశారా? లేదా? ఇక్కడే హత్య చేశారా? అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఇతర జిల్లాలకు కూడా సమాచారం ఇచ్చారు. ఈ మధ్య ఎక్కడైనా మహిళల మిస్సింగు కేసులు ఉన్నాయా? అనే వివరాలు సేకరిస్తున్నారు.

ఘటనా స్థలాన్ని పరిశీలించిన కర్నూలు రేంజ్ డిఐజి, ఎస్‌పి

ఘటనా స్థలాన్ని కర్నూలు రేంజ్ డిఐజి సిహెచ్.విజయరావు, జిల్లా ఎస్‌పి జి.కృష్ణకాంత్ పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ, ముగ్గురు మహిళల మృతదేహాలు ఒకేసారి బయటపడడంతో లోతైన దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాలకు జిల్లా అడిషనల్ ఎస్‌పి, డిఎస్‌పి ర్యాంకు అధికారుల సమక్షంలో పోస్టుమార్టం నిర్వహిస్తామని, ఈ నివేదిక, సాంకేతిక అంశాల ఆధారంగా ఈ కేసు నిగ్గు తెలుస్తామని చెప్పారు. వారి వెంట అడిషనల్ ఎస్‌పి నాగరాజు, డిఎస్‌పి విజయ్ శేఖర్, తాలూకా సిఐ శ్రీధర్, నాలుగో పట్టణ సిఐ శంకరయ్య ఉన్నారు.

భయాందోళనలో స్థానికులు

ఒకేసారి మూడు మృతదేహాలు బయటపడడంతో స్థానికులు భయాందోళనలకు గురవుతున్నారు. నిత్యం ప్రజల రాకపోకలతో రద్దీగా ఉండే జాతీయ రహదారి పక్కన ఇలాంటి ఘటన చోటు చేసుకోవడం పట్ల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నూతన క్రిమినల్ చట్టాలకు వ్యతిరేకంగా

పిటిషన్‌పై నేడు సుప్రీం విచారణ

న్యూఢిల్లీ : నూతన క్రిమినల్ చట్టాలను వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్‌ను సోమవారం సుప్రీంకోర్టు విచారించనుంది. జస్టిస్ బేల ఎం త్రివేది, జస్టిస్ పంకజ్ మిథల్ ఈ పిటీషన్‌ను విచారించే అవకాశం ఉందని సమాచారం. ఇప్పటి వరకూ ఉన్న క్రిమినల్ చట్టాల్లో లోపాలు, వ్యత్యాసాలు ఉన్నాయని చెబుతూ గత ఏడాది డిసెంబర్ 21న భారతీయ న్యాయ (రెండో) సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష (రెండో) సంహిత, భారతీయ సాక్ష్య (రెండో) అనే మూడు బిల్లులను లోక్‌సభ ఆమోదించగా, డిసెంబర్ 25న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలిపారు. పార్లమెంట్‌లో ప్రతిపక్ష సభ్యులు సస్పెన్షన్‌లో ఉన్న సమయంలో, ఎలాంటి చర్చలు లేకుండానే కొత్త చట్టాలను ఆమోదించారని, కాబట్టి వీటి అమలుపై స్టే విధించాలని న్యాయవాది విశాల్ తివారీ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ చట్టాల సమర్ధత పరిశీలనకు నిపుణుల కమిటీని తక్షణమే ఏర్పాటు చేయాలని కోర్టును కోరారు. కొత్త చట్టాలు బ్రిటీష్ వలసవాద చట్టాల కంటే క్రూరంగా ఉన్నాయని పేర్కొన్నారు.

ధూషించిన వారిపై కేసు నమోదు చేయాలి

- వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వ్యవసాయ కార్మికులను కులం పేరుతో ధూషించి దౌర్జన్యానికి పాల్పడిన పెత్తందార్లపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేసి బాధితులకు న్యాయం చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం ప్రధాన కార్యదర్శి వి వెంకటేశ్వర్లు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. బాపట్ల జిల్లా సంతమాగలూరుకు చెందిన 26 మంది వ్యవసాయ కార్మికులు ప్రకాశం జిల్లా కొండెపి మండలంలోని పొగాకు బ్యారెన్‌లో పనికి వెళ్లారని తెలిపారు. పని పూర్తయిన తర్వాత వారికి ఇవ్వాల్సిన వేతనాన్ని ఇవ్వకుండా పెత్తందార్లు ఇబ్బంది పెట్టారని వివరించారు. చేసిన పనికి వేతనం ఇవ్వాలని నిలదీసినందుకు కులం పేరుతో ధూషించారని పేర్కొన్నారు.

ఈ విషయంపై వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కొండెపి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారని తెలిపారు. పోలీసులు పెత్తందార్లకు తలొగ్గి దళితులకు న్యాయం చేయలేదని పేర్కొన్నారు. అధికారులు స్పందించకపోవడంతో రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సిఇఒ)ను కలిసినట్లు తెలిపారు. సిఇఒ ఆదేశించినా ప్రభుత్వ అధికారులు స్పందించకపోవడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఏళ్ల తరబడి డిమాండ్ చేస్తున్న వలస కార్మికుల చట్టాన్ని చేయాలని కోరారు.

ఇసుక అక్రమ తవ్వకాలపై తూర్పుగోదావరిలో క్షేత్రస్థాయి పరిశీలన

- టిప్పర్లు, ప్రొక్లెయినర్లు సీజ్

ప్రజాశక్తి - తూర్పుగోదావరి

హైకోర్టు ఆదేశాల మేరకు ఇసుక అక్రమ తవ్వకాలపై తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్, అధికారుల బృందం క్షేత్రస్థాయిలో విస్తృత పర్యటన చేపట్టింది. ఆదివారం సాయంత్రం సుమారు నాలుగు గంటల పాటు కడియం, పెరవలి, నిడదవోలు, తాళ్లపూడి, కొవ్వూరు మండలాల్లోని ఇసుక రీచ్‌ల్లో తనిఖీలు నిర్వహించారు. కొవ్వూరు డివిజన్‌లో సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ్, ఇతర అధికారులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కోర్టు ఆదేశాల మేరకు క్షేత్ర స్థాయిలో పర్యటించామని, ఓపెన్ రీచేస్ వద్ద గోదావరి నది ప్రాంతంలో వాహనాలను వాడకూడదు అనే అంశం అమల్లో ఉందని తెలిపారు. టిప్పర్లు, ప్రొక్లెయినర్లు ఉపయోగిస్తున్నట్లు గుర్తించామని, వాటిని సీజ్ చేశామన్నారు. ఇసుక అక్రమ తవ్వకాలపై క్షేత్రస్థాయిలో పర్యటించి, హైకోర్టుకు నివేదిక అందజేస్తామని కలెక్టర్ మాధవీలత తెలిపారు. కలెక్టర్ వెంట జెసి ఎస్.తేజ్‌భరత్, ఆర్‌డిఒ ఎ.చైత్ర వర్షిణి, మైన్స్ ఎడి ఎం.సుబ్రహ్మణ్యం, సెబ్ అధికారి వి.సోమశేఖర్, గ్రౌండ్ వాటర్ డిడి వై.శ్రీనివాస్, జిల్లా పంచాయతీ అధికారి డి.రాంబాబు, ఇరిగేషన్ అధికారి ఆర్.కాశీవిశ్వేశ్వరరావు ఉన్నారు.

కూలిన ఇరాన్ అధ్యక్షుడి హెలికాప్టర్ రైసీ పరిస్థితిపై ఆందోళన

(మొదటి పేజీ తరువాయి)

అధ్యక్షుడు అజర్ బైజాన్ అధ్యక్షుడు ఇల్హామ్ అలియెవ్‌తో కలసి తూర్పు అజర్ బైజాన్‌లో ఒక డ్యామ్‌ను ఆదివారం ప్రారంభించాల్సి ఉంది. ఇందుకోసం ప్రత్యేక హెలికాప్టర్‌లో రైసీ బయల్దేరి వెళ్తుండగా వాయువ్య ప్రాంతంలో ఈ ప్రమాదం చోటు చేసుకున్నట్లు జాతీయ టెలివిజన్ తెలిపింది. హెలికాప్టర్‌లో . ఆయన వెంట ఇరాన్ , విదేశాంగ మంత్రి హుస్సేని అమీర్ అబ్దుల్లాహియాన్, తూర్పు అజర్ బైజాన్ రాష్ట్ర గవర్నరు, తబ్రిజ్ మత పెద్ద ఉన్నట్లు అధికారిక మీడియా తెలిపింది.

హెలికాప్టర్ కూలిపోయిన ప్రాంతం అజర్ బైజాన్ సరిహద్దుల్లోని జోల్ఫా పట్టణానికి సమీపంలో ఉంది. ఇడి ఇరాన్ రాజధాని టెహ్రాన్‌కు 600 కి.మీ దూరంలో ఉంది. వార్త తెలియగానే ఘటనా స్థలానికి హుటా హుటిన సహాయక బృందాలు, ఎయిర్ అంబులెన్స్‌లను పంపారు. కానీ, వాతావరణం అనుకూలించని కారణంగా సహాయక బృందాలు అక్కడికి చేరుకోవడం, కష్టంగా ఉందని అధికారులు తెలిపారు. ప్రమాదంలో చిక్కుకున్న అధ్యక్షుడు రైసీ సురక్షితంగా బయటపడాలని కోరుతూ కొందరు ప్రార్ధనలు నిర్వహించారు.

భావితరాలకు సుందరయ్య మార్గదర్శి

(మొదటి పేజీ తరువాయి)

ఒక్కో విధంగా మతోన్మాదాన్ని బిజెపి సాగిస్తూ భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను తుంగలోకి తొక్కుతోందని తెలిపారు. ఒకే మతం, ఒకే దేవుడు, ఒకే దేశం, ఒకే పన్ను వంటి బలవంతపు చట్టాలను రుద్దాలని చూస్తోందన్నారు. ఇలాంటి నిరంకుశ చట్టాలపై సుందరయ్య తన జీవితకాలం పోరాడారని గుర్తు చేశారు. అల్లూరి విజ్ఞాన కేంద్రం కార్యదర్శి డాక్టర్ బి.గంగారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ, సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్, బొట్టా ఈశ్వరమ్మ, బి.జగన్, నాయకులు రెడ్డి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు. తొలుత సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు. ప్రజానాట్య మండలి కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

బిజెపికి మద్దతు మానండి

- టిడిపి, వైసిపిలకు శ్రీనివాసరావు హితవు

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

ఎన్నికల వరకూ బిజెపితో రాష్ట్రంలోని టిడిపి, వైసిపి కుమ్మక్కై మతోన్మాద ప్రమాదాన్ని రాష్ట్రానికి తెచ్చాయని శ్రీనివాసరావు విమర్శించారు. ఎన్నికల తర్వాతైనా బిజెపికి మద్దతివ్వకుండా లౌకికవాదాన్ని కాపాడేందుకు ముందుకు రావాలన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థను, రాష్ట్ర స్వయంప్రతిపత్తిని కాపాడాలని కోరారు. స్మారకోపన్యాసం అనంతరం విశాఖలోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో మీడియాతో ఆదివారం ఆయన మాట్లాడుతూ వైసిపి, టిడిపిలు రాష్ట్రం అశాంతిపాలు కాకుండా చూడాలన్నారు. ఎన్నికలనంతర హింసకు, ప్రజల్లో అభద్రత, అస్థిరతకు ఈ పార్టీల వైఖరులే కారణమని విమర్శించారు. ఎప్పుడు ఎక్కడ ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొందని వివరించారు. ఎన్నికల సంఘం కూడా తరుచూ అధికారులను మార్చడంతో వారు ఏమీ చేయలేకపోతున్నారన్నారు. అధికారంలో ఉన్నాం కాబట్టి ఏం చేసినా చెల్లుతుందని వైసిపి... బిజెపి మద్దతుంది కాబట్టి దేనికైనా తెగించి తేల్చుకుంటామన్నట్టుగా టిడిపి నేతలు హింసకు పాల్పడుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలో పోలీస్ వ్యవస్థ, అధికార యంత్రాంగం రెండూ రాజకీయ ప్రయోజనాల కోసం పనిచేయడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఐఎఎస్, ఐపిఎస్‌ల వ్యవస్థ ఒత్తిళ్లకు లొంగకుండా వ్యవహరించాలని కోరారు.

స్టీల్‌ప్లాంట్ గొంతు నులిమే కుట్ర

ఉక్కు కార్మికులు వారి జీతాల కోసం స్టీల్ సిఎండి ఇంటినే కాదు అవసరమైతే రాష్ట్ర ముఖ్యమంత్రి ఇంటినైనా ముట్టడిస్తారని వి.శ్రీనివాసరావు అన్నారు. కేంద్రంలోని బిజెపి కావాలనే స్టీల్‌ప్లాంట్‌ను గొంతునులిమి హత్య చేసేందుకు కుట్రలు పన్నుతోందని తెలిపారు. అందుకే ఉద్యోగులకు జీతాలివ్వడం లేదన్నారు. గతంలో లాభాలొచ్చినప్పుడు ఖజానాలో వేసుకున్నారని, ఇప్పుడు నష్టాలు వస్తున్నాయి కాబట్టి చావండి అంటే ఎలా? అని ప్రశ్నించారు. మూడున్నరేళ్లుగా కార్మికవర్గం స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా ఉధృతంగా పోరాడుతున్నందున మోడీ సర్కారు కక్ష సాధింపునకు పాల్పడుతోందన్నారు. ఇప్పటికే కేంద్రానికి పన్నులు, జిఎస్‌టిల రూపంలో కోట్ల రూపాయలను స్టీల్‌ప్లాంట్ కట్టిందని, కనీసం ఆ డబ్బు వెనక్కి ఇచ్చినా కార్మికులకు జీతాలు వస్తాయని వివరించారు.

విఓఎలను నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వాలు

- సభ్యులు మరణిస్తే రూ.50 వేలు ఆర్థిక సాయం
- ఎపి వెలుగు విఓఎ ఉద్యోగ సంఘం నిర్ణయం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎపి వెలుగు విఓఎ ఉద్యోగ సంఘం (సిఐటియు)లో సభ్యులుగా ఉండి సహజ, లేదా ప్రమాదవశాత్తూ మరణించిన సభ్యులకు యూనియన్ ద్వారా రూ.50 వేల సాయం (ఇన్సూరెన్స్) అందించాలని నిర్ణయించినట్లు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ధనలక్ష్మి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ప్రకటన విడుదల చేశారు. కార్మికులతో పనిచేయించుకుంటున్న ప్రభుత్వాలు సిబ్బంది ప్రమాదాలకు గురైన సమయంలో పట్టించుకోకుండా వదిలేస్తున్నాయని, అందువల్లే యూనియన్ ఆధ్వర్యంలో సభ్యులను ఆదుకునేందుకు ఇన్సూరెన్స్‌ను అమలు చేయాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. 2024 జనవరి నుంచి ఇది అమల్లోకి వస్తుందని వివరించారు. తిరుపతి జిల్లా వడమాల పంచాయతీలోని హేమలత విఓఎగా పనిచేస్తూ మరణించారని, ఆమె కుమారుడుకు రాష్ట్ర కమిటీ, తిరుపతి జిల్లా కమిటీ సభ్యుల సమక్షంలో ఈ నెల 26న సిఐటియు రాష్ట్ర కార్యాలయంలో రూ.50 వేల సాయం అందించనున్నట్లు పేర్కొన్నారు. పొదుపు మహిళలను ప్రభుత్వాలు ఓటు బ్యాంకుగా ఉపయోగించుకుంటూ రకరకాల పథకాలతో వారిని ఆకర్షిస్తున్నాయని, వారి కోసం నిరంతరం శ్రమిస్తున్న విఓఎల బాగోగులు మాత్రం ప్రభుత్వాలకు పట్టడం లేదని అన్నారు. పోరాటాల సమయంలో ఎపి వెలుగు విఓఎ ఉద్యోగ సంఘం (సిఐటియు)తో చర్చలు జరుపుతున్న ప్రభుత్వం అనంతరం వాటిని అమలు చేయడం లేదని పేర్కొన్నారు. విఓఎలను ఆధారం చేసుకుని లక్షల రూపాయల రుణాలు ఇప్పించడం, తిరిగి వాటిని వడ్డీతో సహా కట్టించడం వంటి పనులు యానిమేటర్స్ చేస్తున్నారని తెలిపారు. మహిళల అభ్యున్నతి కోసం ప్రభుత్వ పథకాలను మహిళలకు అమలు చేస్తున్నారని అన్నారు. వారి సంక్షేమంపై ఎన్నిసార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా ఉపాధికి గ్యారంటీ గానీ, ఇన్సూరెన్స్ పథకం అమలు చేసే విషయంలో గానీ తీవ్ర అలసత్వం వహిస్తున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో యూనియన్ తరపున వారిని ఆదుకోవాలని నిర్ణయించామని వివరించారు.

ఎన్నికల విధులకు వెళ్తుండగా ఎఎస్‌ఐ దుర్మరణం

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం :

ఎన్నికల బందోబస్తు విధులకు వెళ్తుండగా ఎఎస్‌ఐను కారు రూపంలో మృత్యువు కబళించింది. పోలీసుల కథనం ప్రకారం... విజయవాడ పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాలకు చెందిన ఇవిఎంలను ఇబ్రహీంపట్నంలోని నోవా, నిమ్రా కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరిచారు. ఈ నేపథ్యంలో పోలీసులు అక్కడ భద్రతను కట్టుదిట్టం చేశారు. దీనిలో భాగంగా జూపూడి వద్ద, ఖిల్లా రోడ్డు వద్ద రెండు పోలీసు పికెట్లను ఏర్పాటు చేశారు.

ఇవిఎంల భద్రతా విధులు నిర్వహించేందుకు శనివారం రాత్రి జూపూడి పోలీసు చెక్‌పోస్ట్ వద్దకు వెళుతూ రోడ్డు దాటుతున్న విజయవాడ సిసిఎస్ పోలీస్‌స్టేషన్ ఎఎస్‌ఐ ఎన్.వి.వి.రమణ (62)ను కారు ఢీకొట్టింది. చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతదేహాన్ని జిల్లా పోలీసు కమిషనర్ రామకృష్ణ సందర్శించి నివాళు లర్పించారు. అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు.

సమసమాజ స్థాపన ఎర్రజెండాతోనే సాధ్యం

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు
- విజయవాడలో మానికొండ సుబ్బారావు గ్రంథాలయం, తుర్లపాటి రామయ్య సాంస్కృతిక కళావేదిక ప్రారంభం

ప్రజాశక్తి - విజయవాడ

దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, పీడిత ప్రజల ముద్దుబిడ్డ పుచ్చలపల్లి సుందరయ్య కలలు కన్న సమ సమాజ నిర్మాణం సిపిఎం, ఎర్రజెండాతోనే సాధ్యమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. విజయవాడ కృష్ణలంక భ్రమరాంభపురంలో పునర్నిర్మాణం జరిగిన మానికొండ సుబ్బారావు గ్రంథాలయాన్ని వి. శ్రీనివాసరావు, తుర్లపాటి రామయ్య సాంస్కృతిక కళావేదికను విజయవాడ నగర పాలక సంస్థ స్థాయీ సంఘం మాజీ చైర్మన్ చిగురుపాటి బాబూరావు ఆదివారం ప్రారంభించారు. ముందుగా సుందరయ్య చిత్రపటానికి మాజీ కార్పొరేటర్ దోనేపూడి కాశీనాథ్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మానికొండ సుబ్బారావు గ్రంథాలయం కమిటీ కన్వీనర్ బత్తుల చిన్నారావు అధ్యక్షతన జరిగిన సభలో వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. అమెరికాకు కమ్యూనిజం ఓ భూతంలా ఆవరించిందని, సోవియట్ యూనియన్ పతనమైన సమయంలో కమ్యూనిజాన్ని పాతాళానికి తొక్కేయొచ్చని అమెరికాలాంటి పెట్టుబడిదారీ దేశాలు సంబరపడ్డాయని, కానీ అది ఎంతో కాలం నిలబడలేదని అన్నారు. నేడు సోషలిస్టు దేశం చైనా అన్ని రంగాల్లో పురోగమిస్తూ అమెరికాను ఢీ అంటే ఢీ అనే స్థితికి చేరిందన్నారు. పెట్టుబడిదారీ దేశాల్లో జరుగుతున్న పోరాటాలు, మన దేశంలో రైతాంగ ఉద్యమాలు, రాష్ట్రంలో విశాఖ ఉక్కును కాపాడుకునేందుకు మూడేళ్ల నుండి కార్మికులు, ఉద్యోగులు జరుపుతున్న ఉద్యమం, కృష్ణపట్నం పోర్టును అదానీకి అప్పగించొద్దని నెల రోజులు పాటు కార్మికులు జరిపిన పోరాటాలే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. గత పదేళ్ల బిజెపి- మోడీ పాలనలో దేశం అన్ని రకాలుగా నష్టపోయిందన్నారు. ఎన్నికల్లో లబ్ధిపొందాలని మతాన్ని, చివరికి అయోధ్య రాముడిని కూడా రాజకీయాల్లోకి లాగి ప్రధాని మోడీ అత్యంత నీచమైన రాజకీయాలు నడుపుతున్నారని విమర్శించారు. రైతులకు అత్యంత నష్టదాయకమైన, ప్రమాదకరమైన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను మొట్టమొదట వ్యతిరేకించింది, నిరసనలు తెలిపింది సిపిఎం మాత్రమేనన్నారు. మోడీ సంస్కరణల నేపథ్యంలో నీతి ఆయోగ్ చేసిన సూచనల మేరకు ఈ యాక్ట్‌ను రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. దానిని అసెంబ్లీలో టిడిపి బలపరిచిందని, కానీ ఓట్ల రాజకీయాల కోసం ఈ యాక్ట్‌పై బిజెపి, టిడిపి, వైసిపి నేతలు ఒకరిపై ఒకరు దుమ్మెత్తిపోసుకున్నారని అన్నారు. యుపిఎ ప్రభుత్వ హయాంలో వామపక్షాల ఒత్తిడి మేరకు మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టం, అటవీ సంరక్షణ చట్టం, విద్యాహక్కు చట్టం ఇలా అనేక ప్రజోపయోగ చట్టాలు అమలులోకి వచ్చాయన్నారు. కానీ వాటన్నింటినీ కేంద్రంలోని మోడీ, రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వాలు నిర్వీర్యం చేశాయని విమర్శించారు.

బాబూరావు మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసేవిధంగా కోట్లాది రూపాయలు వెచ్చించి బిజెపి, వైసిపి, టిడిపిలు ఓట్లు కొనుగోలు చేశాయని విమర్శించారు. ఇటువంటి కార్పొరేట్, ధన రాజకీయాలకు వ్యతిరేకంగా నీతి వంతమైన రాజకీయాల కోసం ప్రజల్లో చైతన్యం రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కాశీనాథ్ మాట్లాడుతూ.. ప్రజాసమస్యల పరిష్కార వేదికగా ఈ భవనం నిలవాలని ఆకాంక్షించారు. డివైఎఫ్ఐ ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్షులు పుప్పాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కళావేదికను ప్రారంభిస్తున్న విజయవాడ నగర పాలక సంస్థ స్థాయీ సంఘం మాజీ చైర్మన్ సిహెచ్.బాబూరావు, చిత్రంలో రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ తదితరులు

ఆప్‌ను నాశనం చేసేందుకే 'ఆపరేషన్ ఝాడూ'

(మొదటి పేజీ తరువాయి)

ఝాడూను తెరపైకి తీసుకొచ్చాయని అన్నారు. ఈ ఆపరేషన్‌లో భాగంగా ఆప్ నేతలను అరెస్ట్ చేసేందుకు సిద్ధమయ్యారని, వారిని రాబోయే రోజుల్లో అరెస్ట్ చేయడంతో ఆప్ బ్యాంక్ ఖాతాలను స్తంభింపజేస్తారని విమర్శించారు. ఎన్నికలు ముగిసిన అనంతరం ఆప్ బ్యాంక్ ఖాతాలను ఫ్రీజ్ చేస్తామని ఇడి న్యాయవాది ఇప్పటికే కోర్టులో స్టేట్‌మెంట్ ఇచ్చారని కేజ్రీవాల్ పేర్కొన్నారు. ఆప్ ఖాతాలను ఇప్పుడే ఫ్రీజ్ చేస్తే ఆప్‌నకు సానుభూతి లభిస్తుందనే ఉద్దేశంతో మన ఖాతాలను లోక్‌సభ ఎన్నికల అనంతరం ఫ్రీజ్ చేసేందుకు కాషాయ పాలకులు స్కెచ్ వేశారని విమర్శించారు. 'ఎన్నికల అనంతరం మన కార్యాలయాన్ని దిగ్బంధించి మనల్ని రోడ్డు మీదకి తీసుకొసారు. బిజెపి ఈ ప్రణాళికలతో ముందుకెళు తున్నంది' అని కేజ్రీవాల్ పార్టీ శ్రేణులకు తెలిపారు.

ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) శ్రేణుల ఆందోళనలతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. కేజ్రీవాల్ పిలుపు మేరకు కార్యకర్తలు, నాయకులు పార్టీ కార్యాలయానికి పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. కేంద్రంలోని బిజెపి సర్కారుకు వ్యతిరేకంగా నినదించారు.. ఆప్ కార్యాలయం నుంచి ఢిల్లీ బిజెపి ప్రధాన కార్యాలయానికి ప్రదర్శన బయల్దేరగానే పోలీసులు అడ్డుకున్నారు. ఇక్కడ 144 సెక్షన్ ఉన్నదని, గుంపులుగా వెళ్లడానికి వీల్లేదని పోలీసులు అనుమతి నిరాకరించారు. దాంతో పోలీసులకు ఆప్ శ్రేణులకు మధ్య వాగ్వాదం జరిగింది. ఈ కార్యక్రమంలో ఢిల్లీ మంత్రులు, ఆప్ ఎంపిలు, ఎమ్మెల్యేలు, ఆప్ నేతలు భారీ స్థాయిలో కార్యకర్తలు పాల్గొన్నారు.

సిట్ దర్యాప్తు ముమ్మరం

(మొదటి పేజీ తరువాయి)

అధికారులకు వినతిపత్రం అందజేశారు. పోలీసులు తమ కార్యాలయంలోకి ప్రవేశించి సిసి కెమెరాలు, కంప్యూటర్ హార్డ్‌డిస్క్‌లను ధ్వంసం చేశారని, ఫర్నిచర్‌ను విరగొట్టారని, అక్కడున్న వారిపై అకారణంగా దాడి చేశారని ఈ ఫిర్యాదులో పేర్కొన్నారు. వీటిన్నింటిపై సమగ్ర విచారణ చేపట్టాలని సిట్ అధికారులను కోరారు.

చంద్రబాబు, లోకేష్, జెసి ప్రభాకర్‌రెడ్డి కారణం : వైసిపి జిల్లా లీగల్ సెల్ ఫిర్యాదు

తాడిపత్రిలో జరిగిన ఘర్షణలకు టిడిపి నాయకులు చంద్రబాబు, లోకేష్, తాడిపత్రి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి తండ్రి జెసి ప్రభాకర్‌రెడ్డి కారణమని, దీనిపై సమగ్ర విచారణ జరిపి వారిపై చర్యలు తీసుకోవాలని వైసిపి జిల్లా లీగల్ సెల్ అధ్యక్షులు ఉమాపతి సిట్ అధికారులను కోరారు.

చంద్రగిరిలో గొడవలపై ఆరా

శనివారం రాత్రి తిరుపతికి చేరుకొన్న సిట్ బృందం ఆదివారం ఉదయాన్నే విచారణ ప్రారంభించింది. డిఎస్‌పి రవి మనోహరాచారి నేతృత్వంలో సిఐ ప్రభాకర్‌రెడ్డి, మరి కొంతమంది సిబ్బందితో కూడిన బందం తిరుపతిలోని ఎస్‌వియు క్యాంపస్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లింది. మహిళ యూనివర్సిటీలో జరిగిన గొడవలపై పోలీసుల వద్ద ఉన్న సమాచారాన్ని సేకరించింది. ఈ ఘటనపై పోలీసులు నమోదు చేసిన కేసులు, సెక్షన్ల వివరాలను పరిశీలించింది. అనంతరం చంద్రగిరి నియోజకవర్గంలోనికూచువారిపల్లికి వెళ్లింది. పంచాయతీ కార్యాలయాన్ని పరిశీలించి, అక్కడి సిబ్బందిని ప్రశ్నించింది. అక్కడి నుంచి కూచువారుపల్లి రామిరెడ్డిపల్లికి వెళ్లి ఆ రోజు జరిగిన అల్లర్లపై స్థానికులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకుంది. మరికొన్ని ప్రాంతాలను సందర్శించి, ఇంకొన్ని వివరాలు సేకరించింది.

పల్నాడులో పూర్తయిన విచారణ -సత్తెనపల్లి సిఐపై మంత్రి అంబటి రాంబాబు ఫిర్యాదు

పల్నాడు జిల్లాలో సిట్ తన ప్రాథమిక విచారణను పూర్తి చేసింది. నరసరావుపేటలో శనివారం అర్ధరాత్రి వరకు ఎస్‌పి సౌమ్యలత విచారణ చేసి తిరిగి ఆదివారం రెండో రోజూ కొనసాగించారు. నరసరావుపేట రూరల్ పోలీసు స్టేషన్‌లో ముగ్గురు సిఐలు, ఎస్‌ఐలను ఆమె విచారించారు. ఘటనలు జరిగిన ప్రదేశాలను పరిశీలించారు. వీడియోలను చూశారు. ఘర్షణలకు సంబంధించి నమోదైన ఎఫ్ఐఆర్‌లు పరిశీలించి ఇంకా మార్పులు ఏమైనా చేయాలా? కొత్త నిందితులను ఎవరినైనా చేర్చారా? అని అడిగారు. నమోదైన కేసుల్లో ఇప్పటివరకు అరెస్టు చేసిన వారి వివరాలు, దాడులు, ప్రతిదాడులు, వాహనాల ధ్వంసం, దగ్ధం ఘటనల వివరాలు తెలుసుకున్నారు. ఘర్షణల్లో పాల్గొన్న వ్యక్తులు, వారి గతం, ఆస్తి నష్టం, శాంతిభద్రతల సమస్య ఏర్పడితే తీసుకున్న చర్యల వివరాలను నమోదు చేశారు. నరసరావుపేటలో విచారణ జరుపుతున్న సమయంలో ఎఎస్‌పి సౌమ్యలతను మంత్రి అంబటి రాంబాబు కలిసి సత్తెనపల్లి రూరల్ సిఐపై ఫిర్యాదు చేశారు. టిడిపి వారికి అనుకూలంగా వ్యవహరించి పక్షపాత ధోరణి ప్రదర్శించారని ఈ ఫిర్యాదులో పేర్కొన్నారు. అలసత్వం వహించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని సిట్ అధికారులను కోరినట్లు మీడియాకు చెప్పారు. సత్తెనపల్లి మండలం తొండపి గ్రామంలో క్షీణించిన శాంతిభద్రతలను పునరుద్ధరించి ప్రశాంత వాతావరణం కల్పించి ప్రజాజీవనం సాఫీగా జరిగేలా చూడాలని పోలీస్ అధికారులను కోరారు. కారంపూడిలో సిట్ అధికారి డిఎస్‌పి రమణమూర్తి రికార్డులను పరిశీలించారు. సిఐ నారాయణస్వామి నుంచి వివరాలు సేకరించారు. ఈ నెల 14న జరిగిన ఘర్షణల వీడియోలను పరిశీలించారు. ఇప్పటి వరకు నమోదైన కేసులు, అరెస్టులు, ఇంకా ఎంతమందిని అరెస్టు చేయాలన్న అంశంపై చర్చించారు. మాచర్ల, గురజాల నియోజకవర్గాల్లో జరిగిన ఘర్షణలపై విచారణ చేశారు. దాచేపల్లి, మాచవరం మండలంలో పోలింగ్ రోజు జరిగిన అల్లర్లపై దాచేపల్లి పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసు వివరాలను దాచేపల్లి సిఐ సురేంద్రబాబు నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. టిడిపి, వైసిపి వారు ఇచ్చిన వేర్వేరు ఫిర్యాదులు, ఎఫ్ఐఆర్‌లను పరిశీలించారు.

ప్రభుత్వ రంగాన్ని రక్షించుకుందాం

- స్టీల్‌ప్లాంట్ ఎస్‌సి, ఎస్‌టి ఎంప్లాయీస్ అసోసియేషన్

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

దేశాభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన ప్రభుత్వ రంగ సంస్థలను రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని స్టీల్‌ప్లాంట్ ఎస్‌సి, ఎస్‌టి ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు బొండా తొడన్న, భయ్యా మల్లయ్య అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు ఆదివారానికి 1193వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో స్టీల్‌ప్లాంట్ ఎస్‌సి, ఎస్‌టి ఎంప్లాయీస్ అసోసియేషన్ సభ్యులు, కార్మికులు కూర్చున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వ రంగ సంస్థలు ప్రయివేటుపరమైతే రిజర్వేషన్లకు విఘాతం కలుగుతుందన్నారు. రిజర్వేషన్ల తొలగింపునకు బిజెపి కుట్రలు పన్నుతోందని విమర్శించారు. వీటిని ఐక్య పోరాటాలతో తిప్పికొట్టాలని కోరారు. రాజ్యాంగ హక్కుల పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ఎంతగానో దోహదపడిందని గుర్తుచేశారు.

పలు జిల్లాల్లో ఉరుముల వర్షం

- ఈదురుగాలులకు నేలకొరిగిన చెట్లు
- పిడుగుపాటుకు ఒకరు మృతి

ప్రజాశక్తి - యంత్రాంగం

ఉపరితల ఆవర్తనం ప్రభావంతో పార్వతీపురం మన్యం, తూర్పుగోదారి, ఏలూరు, తిరుపతిలో భారీ వర్షం కురిసింది. ఉరుములతో కూడిన వర్షం గంటపాటు కురిసింది. బలమైన ఈదురుగాలులకు పలు చెట్లు నెలకొరిగాయి. విద్యుత్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. రహదారులపై వర్షపునీరు నిలిచిపోవడంతో పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తిరుపతిలో పిడుగుపాటుకు ఒకరు మరణించారు.

పార్వతీపురం మన్యం జిల్లాలో పలుచోట్ల ఉరుములకు కూడిన వర్షం కురిసింది. వీరఘట్టం మండలంలో భారీ ఈదురుగాలులు వీశాయి. విజయనగరం జిల్లా వేపాడ, ఎస్.కోట మండలాల్లో చిరుజల్లులు కురిశాయి. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్, రాజానగరం, కడియం, ఆలమూరు, కొవ్వూరు, నిడదవోలు, రామచంద్రపురం, రావులపాలెం, కొత్తపేట మండలాల్లో గంటపాటు వర్షం పడింది. ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలం వ్యాప్తంగా ఉరుములతో కూడిన వర్షం కురిసింది. రహదారులన్నీ జలమయమయ్యాయి. రామన్నపాలెం గ్రామంలోని కరెంట్ స్తంభం నెలకొరగడంతో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. తిరుపతిలోపలు మండలల్లో చిరు జల్లులు పడ్డాయి. కృష్ణా జిల్లాలో 25 మండలాలకుగాను 19 మండలాల్లో వర్షం కురిసింది. గత 24 గంటల్లో (శనివారం ఉదయం 8.30 గంటల నుంచి ఆదివారం ఉదయం 8.30 గంటల వరకు) జిల్లావ్యాప్తంగా 278.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. సగటున ఒక్కో మండలంలో 11.1 మిల్లీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది. అత్యధికంగా ఉంగుటూరు మండలంలో 36.2 మిల్లీమీటర్లు, 15.2, గుడివాడలో 15.2 మిల్లీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది.

తిరుపతి జిల్లా పుత్తూరు రూరల్ మండలం కృష్ణసముద్రం గ్రామానికి చెందిన సి.అన్బుకుమార్ (45) తమ ఆవులను గ్రామ సమీపంలోని చెరువు వద్ద మేపుతుండగా ఆయనకు సమీపంలో పిడుగుపడింది. దీంతో అన్బుకుమార్ ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. గమనించిన తోటి కాపరులు వెంటనే ఆయనను నగరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు పరీక్షించిన వైద్యులు తెలిపారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఉత్తమ నటుడి పురస్కారం అందుకుంటున్న రవీంద్రారెడ్డి

ముగిసిన 'కొలంపురి' నాటిక పోటీలు

- ఉత్తమ ప్రదర్శనగా ఇంద్రప్రస్థం,
- ఉత్తమ నటీనటులుగా జ్యోతిరాజ్, రవీంద్రారెడ్డి
- గోపరాజు వెంకట శివరామ సుబ్రహ్మణ్య శర్మ జీవిత సాఫల్య పురస్కారం ప్రదానం

ప్రజాశక్తి-తెనాలి (గుంటూరు జిల్లా)

ఉత్తమ నటి పురస్కారం అందుకుంటున్న జ్యోతిరాజ్

కళాకారులను, కళాభిమానులను ఉర్రూతలూగించిన కొలంకపురి నాటక కళాపరిషత్ దశమ ఆహ్వాన నాటిక పోటీలు ఆదివారంతో ముగిశాయి. గ్రామీణ వాతావరణంలో సమాజంలో నెలకొన్న పరిస్థితులకు అత్యంత దగ్గరగా నాటికల కథా కథనం సాగింది. నటీనటులు ప్రతి పాత్రకూ జీవం పోశారు. గుంటూరు జిల్లా తెనాలి మండలం కొలకలూరులో వల్లేపల్లి వెంకట్రామయ్య వేదికపై ఈ నెల 16 నుంచి కొలంకపురి నాటక కళాపరిషత్, వైకె నాటక కళాపరిషత్ సంయుక్తంగా నిర్వహించిన దశమ ఆహ్వాన నాటిక పోటీల్లో విజేతలకు ఆదివారం రాత్రి బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభకు ప్రముఖ రంగస్థల నటులు చలసాని కృష్ణప్రసాద్, తాళ్లూరి సత్యనారాయణ జ్యోతి ప్రజ్వలన చేశారు. నాటక రచయిత, నంది పురస్కార గ్రహీత పిన్నమనేని మృత్యుంజయరావు అధ్యక్షతన జరిగిన సభలో నాటక రంగ విశ్లేషకులు కందిమళ్ల సాంబశివరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గోపరాజు వెంకట శివరామ సుబ్రహ్మణ్య శర్మ జీవిత సాఫల్య పురస్కారాన్ని సత్తెనపల్లికి చెందిన ప్రముఖ రంగస్థల నటులు నూతలపాటి సాంబయ్యకు అందించి సత్కరించారు. కార్యక్రమంలో నిర్వాహకులు గోపరాజు విజయ్, సినీ మాటల రచయిత బుర్రా సాయిమాధవ్, ఆకురాతి భాస్కరచంద్ర, కెవి బలరామమూర్తి, నాటక విశ్లేషకులు పురుషోత్తమరావు, షేక్ నజీర్, గోపరాజు రమణ, భారతుల ఫణి, లోకం సూర్యనారాయణరావు, సుద్దపల్లి మురళీధర్, ఎస్.శరత్ వెంకయ్య, వి.వరప్రసాదరావు, కాంతారావు పాల్గొన్నారు.

పోటీల్లో విజేతలు ....

నాటిక పోటీల్లో విజేతల వివరాలను న్యాయనిర్ణేతలు బి.నరసయ్య, వి.లక్ష్మీకాంతారావు, వైఎస్‌కెఎన్ స్వామి వెల్లడించారు. నాటిక పోటీల్లో ఎంపిక చేసిన 8 నాటికలను ప్రదర్శించారు. వాటిలో ఉత్తమ ప్రదర్శనగా 'ఇంద్రప్రస్థం', ద్వితీయ ఉత్తమ ప్రదర్శనగా 'మూల్యం', ఉత్తమ తృతీయ ప్రదర్శనగా 'కొత్త పరిమళం' నిలిచింది. ఉత్తమ నటుడిగా ఇంద్రప్రస్థం నాటికలో ఎన్.రవీంద్రారెడ్డి, ఉత్తమ నటిగా మూల్యం నాటికలో జయంతి పాత్రధారి జ్యోతిరాజ్ భీశెట్టి, ఉత్తమ రచయితగా నోట్ దిస్ పాయింట్ రచయిత గంధం నాగరాజు, ఉత్తమ దర్శకులుగా ఇంద్రప్రస్థం నాటికలకు దర్శకత్వం వహించిన ఎన్.రవీంద్రారెడ్డి దక్కించుకున్నారు.

ప్రత్యేక ప్రదర్శన 'కౌశల్య సుప్రజా రామా'

నాటిక పోటీల ముగింపు సందర్భంగా ప్రత్యేక ప్రదర్శనగా శ్రీసాయి ఆర్ట్స్ కొలకలూరు వారు 'కౌశల్య సుప్రజా రామా' నాటికను ప్రదర్శించారు. నాటికకు మూలకథ ఆకెళ్ళ శివప్రసాద్ అందించారు. నాటకీకరణ స్నిగ్ధ కాగా, గోపరాజు విజయ్ దర్శకత్వం వహించారు.

రెంటచింతల మండలంలో 34 మంది అరెస్టు

ప్రజాశక్తి - రెంటచింతల (పల్నాడు)

పోలింగ్ రోజు పల్నాడు జిల్లా రెంటచింతల మండల రెంటాల, తుమ్మరకోట, పాల్వాయి గేటు, జెట్టిపాలెం, గోలి తదితర గ్రామాల్లో జరిగిన అల్లర్లకు సంబంధించి ఇప్పటివరకు 34 మందిని అరెస్టు చేశామని, మరో 36 మంది కోసం గాలింపు చర్యలు చేపట్టామని, వారిపై వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశామని అడిషనల్ ఎస్‌పి (అడ్మిన్) జివి రమణమూర్తి తెలిపారు. పోలింగ్ రోజున జరిగిన సంఘటనలు సిసి కెమెరాలు నిక్షిప్తమయ్యాయని, రెంటాలలో కార్టన్ సెర్చ్ నిర్వహించగా ముళ్ళ పొదల్లో కర్రలు లభ్యమైనట్లు చెప్పారు. సరైన పత్రాలు లేని ఐదు వాహనాలు, మోటార్ సైకిల్, ఒక ఆటోను సీజ్ చేశామన్నాం. కార్టన్ సెర్చ్ ప్రతిరోజు ఉంటుందన్నారు. రెండు లేదా మూడు కేసుల్లో నిందితులుగా ఉంటే రౌడీ షీట్ ఓపెన్ చేయనున్నట్లు ప్రకటించారు. సమావేశంలో గురజాల డిఎస్‌పి పి.వెంకటేశ్వరరావు ఎస్‌ఐ ఎం. ఆంజనేయులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com
3

అమలుకాని క్యాట్ ఉత్తర్వులు!

- ఎబి వెంకటేశ్వరరావు పోస్టింగుపై చర్చ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కేంద్ర పరిపాలనా ట్రిబ్యునల్ (క్యాట్) ఆదేశాలిచ్చి పది రోజులైనా ఉత్తర్వులు అమలుకు నోచుకోలేదు. 1989 బ్యాచ్‌కు చెందిన డిజి క్యాడర్ ఐపిఎస్ అధికారి ఎబి వెంకటేశ్వరరావును రాష్ట్ర ప్రభుత్వం కక్ష సాధింపు చర్యతో శాఖాపరమైన కారణాలను చూపుతూ సస్పెండ్ చేసిన సంగతి తెలిసిందే. ఇటీవల క్యాట్ తక్షణమే ఆయనను విధుల్లోకి తీసుకోవాలని స్పష్టం చేసింది. అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఆయనకు పోస్టింగ్ ఇవ్వకుండా కాలయాపన చేస్తుండటం పట్ల ఐపిఎస్‌లతోపాటు పోలీస్‌శాఖలో చర్చ నడుస్తోంది. ఎబి వెంకటేశ్వరరావు సర్వీస్ కేవలం 13 రోజులు మాత్రమే ఉండటంతో పోస్టింగ్ ఇవ్వనివ్వకుండా ఉద్యోగ విరమణ చేస్తారా లేక విధుల్లో చేరకుండానే ఉద్యోగ విరమణ చేయాల్సి వస్తుందా అనే ప్రశ్న నెలకొంది. ఆయనకు మద్దతుగా జస్టిస్ ఫర్ ఎబివి పేరిట ప్రధాని, సుప్రీంకోర్టు న్యాయమూర్తికి పలువురు ఉత్తరాలు రాసే పనిలో నిమగ్నమయ్యారు. తనకు పోస్టింగ్ ఇచ్చే విధంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ ఎన్నికల సంఘానికి ఆయన విజ్ఞప్తి చేశారు.

లారీని ఢీకొన్న ఆర్‌టిసి బస్సు

- ఇద్దరు ప్రయాణికులు మృతి
- పది మందికి గాయాలు

ప్రజాశక్తి -బుచ్చిరెడ్డిపాలెం (నెల్లూరు జిల్లా)

ఆర్‌టిసి బస్సు లారీని ఢీకొన్న సంఘటనలో ఇద్దరు మృతి చెందారు. మరో పది మందికి గాయాలయ్యాయి. ఈ సంఘటన నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డి పాలెం మండలం దామరమడుగు వద్ద శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ప్రకాశం జిల్లా కనిగిరి డిపోకు చెందిన ఆర్‌టిసి బస్సు కనిగిరి నుంచి నెల్లూరు వైపు వెళ్తోంది. బుచ్చిరెడ్డిపాలెం మండలం దామరమడుగు వద్దకు రాగానే ముందు వెళ్తున్న లారీని వెనుక నుంచి బలంగా ఢీకొంది. ఈ సంఘటనలో బస్సులో ప్రయాణిస్తున్న ప్రకాశం జిల్లా వెలిగండ్ల మండలం గన్నవరం గ్రామానికి చెందిన మరియమ్మ (46), కంకణంపాడుకు చెందిన వేమవరపు డేవిడ్ (50) అక్కడికక్కడే మృతి చెందారు. పది మందికి తీవ్ర గాయాలయ్యాయి. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం నెల్లూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రమాద సమయంలో బస్సులో 47 మంది ప్రయాణికులు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

సుందరయ్య స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు

- వర్ధంతి సభల్లో వక్తలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సిపిఎం అగ్రనేత పుచ్చలపల్లి సుందరయ్య స్ఫూర్తితో మరిన్ని ప్రజా ఉద్యమాలు నిర్మించడం, ప్రజా సమీకరణలు చేసి ప్రజలను చైతన్యం చేయడమే ఆయనకు అందించే ఘన నివాళి అని పలువురు వక్తలు పేర్కొన్నారు. పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి ఆదివారం ఉదయం సిపిఎం రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. సుందరయ్య చిత్రపటానికి మాజీ ఎంపి పి.మధు పూలమాలవేసి నివాళి అర్పించారు.

ఈ సందర్భంగా పి.మధు మాట్లాడుతూ సుందరయ్య తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి నాయకత్వం వహించడంతోపాటు ఎన్నో ఉద్యమాలు, పోరాటాల్లో పాల్గొన్నారని పేర్కొన్నారు. దళితులు, మహిళలు న్యాయం చేయాలని, దేశానికి స్వాతంత్ర్యం అవసరమని చిన్నతనంలోనే పోరాడారన్నారు. ప్రతి ఒక్కరూ ఆయన జీవితాన్ని మననం చేసుకుని పునరంకితం అవ్వాలన్నారు. కమ్యూనిస్టు ఉద్యమ పురోగమనానికి పోరాటాలు, ఉద్యమాలే కీలమని, నిరంతరం శ్రమచేసే, సంపద సృష్టించే ప్రజల కోసం పనిచేయడం ద్వారానే పార్టీ ముందుకు పోతుందని సుందరయ్య చెప్పారన్నారు. ప్రస్తుతం దేశానికి బిజెపి రూపంలో పెనుప్రమాదం ముందుకు వచ్చిందని అన్నారు. వారు అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మార్చేస్తారని తెలిపారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ దేశభక్తి, నిరాడంబరత, త్యాగం సుందరయ్య సొంతమన్నారు. ఆయన నిర్వహించిన పోరాటాలను లోతుగా అధ్యయనం చేయాల్సి ఉందని తెలిపారు. సభకు అధ్యక్షత వహించిన పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రజా ఉద్యమాల్లో సుందరయ్య పాత్ర ఎనలేనిదని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.రమాదేవి, కె.సుబ్బరావమ్మ, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ.వి.నాగేశ్వరరావు, కె.ధనలక్ష్మి, కె.ఉమామహేశ్వరరావు, పి.మురళీకృష్ణ, డి.సుబ్బారావు, రైతు సంఘం సీనియర్ నాయకులు వై.కేశవరావు, వృత్తిదారుల సంఘం నాయకులు భాస్కరయ్య తదితరులు పాల్గొన్నారు. ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి అనిల్, నాయకులు హనీఫ్ విప్లవ గేయాలు ఆలపించారు.

సిపిఎం రాష్ట్ర కార్యాలయంలో మాట్లాడుతున్న పి.మధు

ప్రజా సమీకరణ ద్వారానే మార్పు

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్

ప్రజలను చైతన్యపర్చి పోరాటాల్లో సమీకరించడం ద్వారానే కమ్యూనిస్టు ఉద్యమం బలపడుతుందని, మార్పు వస్తుందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్ అన్నారు. వడ్డేశ్వరంలోని సుందరయ్య స్మిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో సుందరయ్య చిత్రపటానికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్, వి.వెంకటేశ్వర్లు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం తాడేపల్లి మండల కార్యదర్శి డి.వెంకటరెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో తులసీదాస్ మాట్లాడుతూ కమ్యూనిస్టుగా నిరాడంబర జీవితం గడిపిన సుందరయ్య ఆదర్శనీయులని అన్నారు. జాతీయోద్యమ సమయం నుండే ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడాలని నినాదం తీసుకుందని, దాని అనుగుణంగా ప్రజలను కదిలించడంలో సుందరయ్య రాసిన విశాలాంధ్రలో ప్రజారాజ్యం పుస్తకం ఎంతో తోడ్పడిందని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా పాలస్తీనాకు సంఘీభావంగా విద్యార్థి ఉద్యమాలు జరుగుతున్నాయని, వామపక్షాలకు అనుకూల ఉద్యమాలు ముందుకు వస్తున్నాయని తెలిపారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు, సిపిఎం మంగళగిరి నియోజకవర్గ సభ్యులు జొన్నా శివశంకర్ మాట్లాడారు. తొలుత వక్తలను పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు కె.హరికిషోర్ ఆహ్వానించారు.

నిత్య చైతన్య స్ఫూర్తి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు

సుందరయ్య నిత్య చైతన్య స్ఫూర్తని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.సుబ్బారావు, వి.వెంకటేశ్వర్లు అన్నారు. వడ్డేశ్వరంలోని ప్రజా సంఘాల భవనంలో జరిగిన కార్యక్రమంలో సుందరయ్య చిత్రపటానికి వారు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ రైతు కూలీలు, రైతాంగ ఉద్యమాల్లో సుందరయ్య చేసిన కృషి మరువలేనిదని తెలిపారు.

భూదాన్ భూములపై యాజమాన్య హక్కులు కల్పించొద్దు

- నిబంధనలు ఉల్లంఘించిన అధికారులపై కొరడా

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

భూదాన్ భూములకు ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులెవరికీ భూ యాజమాన్య హక్కులు కల్పించొద్దని ప్రభుత్వం ఘంటాపథంగా చెబుతోంది. ఒకట్రెండు చోట్ల కొందరికి లబ్ధి చేకూర్చేందుకు లోపాయికారిగా భూ యాజమాన్య హక్కులు కల్పిస్తే అవి చెల్లవని స్పష్టం చేస్తోంది. నిబంధనలను అతిక్రమించి భూ యాజమాన్య హక్కులు కల్పించిన తహశీల్దారు, ఆర్‌డిఒలపై శాఖాపరమైన చర్యలు తీసుకునేందుకు కూడా వెనుకాడేది లేదని పేర్కొంది. ఇందుకు సంబంధించి తాజాగా ఈ నెల 16న సిసిఎల్ఎ అన్ని జిల్లాల కలెక్టర్లకు దిశా నిర్దేశం చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఎపి అసైన్డ్ ల్యాండ్స్ (ప్రొహిబిషన్ ఆఫ్ ట్రాన్స్‌ఫర్స్) అమెండ్‌మెంట్ యాక్ట్ నెంబరు 35/2023 ప్రొవిజన్స్ నాట్ అప్లికేబుల్ టూ భూదాన్ ల్యాండ్స్ అని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఇదే విషయంపై ప్రభుత్వం, రెవెన్యూశాఖలు హైకోర్టు నుంచి స్పష్టత తీసుకున్నట్లు కూడా అందులో తెలిపారు. భూములకు ధరలు రావడంతో చట్టంలోని లొసుగులను ఉపయోగించుకుని ఆయా భూములు దక్కించుకునేందుకు అనేకమంది పావులు కదుపుతున్నారు. భూదాన్ బోర్డు రద్దయిన కాలంలో జారీచేసినట్లు నకిలీ సంతకాలతో కూడిన పత్రాలతో ఆయా భూములు దక్కించుకునేందుకు ప్రొసీడింగ్స్‌తో దరఖాస్తులు చేసుకునే వారి సంఖ్య బాగానే ఉన్నట్లు రెవెన్యూశాఖ పేర్కొంది. రాష్ట్ర వ్యాప్తంగా భూదాన్ యజ్ఞబోర్డుకు సంబంధించిన భూములు సుమారు 30 వేల ఎకరాలున్నట్లు గుర్తించింది.

Utkarsh Small Finance Bank
Aapki Ummeed Ka Khaata
(A Scheduled Commercial Bank)
జోనల్ ఆఫీసు: 07-01-58, కాన్‌కోర్స్ హౌస్, లాల్‌బంగ్లా ఎదురుగా, అమీర్‌పేట్, హైదరాబాద్, తెలంగాణ-500 012.
రిజిస్టర్డు ఆఫీసు: ఉత్కర్ష్ టవర్, ఎన్‌హెచ్-31 (ఏయిర్‌పోర్టు రోడ్), సెహమల్‌పూర్, కాజీసరాయి, హర్‌హువా, వారణాసి, యు.పి.-221 105.

స్థిరాస్తి కొరకు స్వాధీనతా ప్రకటన

ఇందుమూలంగా ప్రకటన ఇవ్వడమేమనగా, ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ (సెక్యూరిటీ) ఇంటెరెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్, 2002 యొక్క రూల్ 3తో చదువబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని, అధీకృత అధికారి, ప్రతి ఖాతాకు ఎదురుగా పేర్కొన్న తేదీలలో డిమాండ్ నోటీసు జారీచేసి, రుణగ్రహీతలను సదరు నోటీసులు స్వీకరణ తేదీ నుండి 60 రోజుల్లోగా మొత్తాలను తిరిగి చెల్లించవలసిందిగా కోరినారు.
రుణగ్రహీతలు మొత్తాలను తిరిగి చెల్లించుటలో విఫలం చెందియున్నందున, ఇందుమూలంగా దిగువ పేర్కొన్న రుణగ్రహీతలు మరియు సర్వజనులకు ప్రకటన ఇవ్వడమేమనగా, క్రింది సంతకందారు ప్రతి ఖాతాకు ఎదురుగా పేర్కొన్న తేదీలలో సదరు రూల్స్ యొక్క రూల్ 8తో చదువబడే సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద అతనికి/ఆమెకు సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని, ఇందు దిగువ వివరించిన ఆస్తులను స్వాధీనంచేసుకున్నారు.
ప్రత్యేకించి రుణగ్రహీతలు మరియు సర్వజనులను ఇందుమూలంగా హెచ్చరించడమేమనగా, ఆస్తులతో లావాదేవీలు జరుపరాదని మరియు ఆస్తులతో ఏవేని లావాదేవీలు జరుపుట అనునది, **ఉత్కర్ష్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్** కు ప్రతి ఖాతాకు ఎదురుగా పేర్కొన్న మొత్తాలను మరియు దానిపై వడ్డీని చెల్లించుటకులోబడి ఉంటుంది.
సెక్యూర్డ్ అసెట్స్ విడిపించుకొనుటకు, అందుబాటులోగల సమయంకు సంబంధించి, చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (8) పై దిగువ వివరించిన రుణగ్రహీతలు శ్రద్ధవహించవలసిందిగా కోరబడుచున్నది.

క్ర. సం.	బ్రాంచి పేరు	ఖాతా పేరు	రుణగ్రహీత/హామీదారు (ఆస్తి యజమాని) పేరు	డిమాండ్ నోటీసు తేది	స్వాధీనతా తేది	డిమాండ్ నోటీసు తేదీ నాటికి బకాయి మొత్తాలు
1	హైదరాబాద్	1542140000006596	1.పులవర్తి జీవనాథం తండ్రి రమేష్ పులవర్తి (తాకట్టుదారు/రుణగ్రహీత), 2-పులవర్తి కరుణ భర్త రమేష్ పులవర్తి (సహ-రుణగ్రహీత)	05/02/2024	16/05/2024	₹ 3,44,572/-

ఆస్తుల వివరణ: గురజ గ్రామం, ముదినెపల్లి మండలం, కృష్ణా జిల్లా-521325 వద్ద ఆర్.ఎస్.నం.215/1, డోర్ నం.9-79 వద్ద 121చ.గ.ల విస్తీర్ణంతో ఆస్తి యొక్క మొత్తం భాగం. ఆస్తి సరిహద్దులు: తూర్పు: పులవర్తి నాగేశ్వర రావు ఆస్తి, పడమర: పంచాయతి రోడ్, ఉత్తరం: ఆర్,.సి.ఎం. చర్చి సైటు, దక్షిణం: పంచాయతి రోడ్.

తేది: 20.05.2024,
ప్రదేశం: హైదరాబాద్

సం/-
(అధీకృత అధికారి)
ఉత్కర్ష్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్.

నైపుణ్యాభివృద్ధిలో రాష్ట్రానికి 13 అవార్డులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

జాతీయ స్థాయిలో జరిగిన నైపుణ్యాభివృద్ధి (స్కిల్ డెవలప్‌మెంటు) పోటీల్లో రాష్ట్రం 13 అవార్డులు దక్కించుకుంది. ఈ మేరకు ఆదివారం స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఒక ప్రకటన విడుదల చేసింది. పోటీల్లో 37 మంది పాల్గొన్నారని తెలిపింది. ఇందులో ఒక గోల్డ్, ఒక రజతంతో పాటు మరో 11 ఎక్సలెన్సీ అవార్డులు సొంతం చేసుకున్నట్లు కార్పొరేషన్ పేర్కొంది. పోటీలు ఢిల్లీలో ఈ నెల 15 నుంచి 19 వరకు జరిగాయని తెలిపింది. ప్రపంచ నైపుణ్యాల పోటీ ప్రతి రెండేళ్లకోసారి నిర్వహిస్తారని పేర్కొంది. 60 విభాగాల్లో 900 మంది పాల్గొనగా, మన రాష్ట్రం నుంచి 37 మంది, ట్రేడ్‌ల నుంచి 42 మంది పాల్గొన్నారు.

కిర్గిజిస్తాన్‌లో భారతీయులు అప్రమత్తంగా ఉండాలి

- ఎపిఎన్ఆర్‌టిఎస్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కిర్గిజ్‌స్తాన్‌లో ఉంటున్న భారతీయ పౌరులు, విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని భారత విదేశాంగశాఖ మార్గదర్శకాలు జారీ చేసిందని ఎపిఎన్ఆర్‌టిఎస్ వెల్లడించింది. అత్యవసరమైతే ఆ దేశంలోని భారత రాయబార కార్యాలయం ఏర్పాటుచేసిన హెల్ప్‌లైన్ నెంబర్ 0555710041ను సంప్రదించాలని ఎపిఎన్ఆర్‌టిఎస్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొంది. కేంద్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షిస్తోందని తెలిపింది. విద్యార్థులు వసతి గృహాల్లోనే ఉండాలని, రాయబార కార్యాలయంతో నిత్యం అందుబాటులో ఉండాలని సూచించింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశానుసారం ఎప్పటికప్పుడు కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలను అనుసరిస్తూ పరిస్థితిని తెలుసుకుంటున్నామని పేర్కొంది. శనివారం నలుగురు తెలుగు విద్యార్థులు తమ హెల్ప్‌లైన్‌ను సంప్రదించారని తెలిపింది. అల్లర్లు జరుగుతున్న ప్రదేశాల నుంచి దేశ, తెలుగు విద్యార్థులందరూ సురక్షిత ప్రదేశాల్లో ఉన్నారని వివరించింది. ఎపికి చెందిన ప్రజలు, విద్యార్థులు 918632340678, 918500027678 తమ హెల్ప్‌లైన్ నెంబర్లను, ingo@apnrts.com, helpline@apnrts.com మెయిల్స్ ద్వారా సంప్రదించాలని వెల్లడించింది.

గుబులు రేపుతున్న పోస్టల్ బ్యాలెట్

- ఓట్లు చెల్లకపోతే ఎలా?
- ఉద్యోగుల్లో ఆందోళన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పోస్టల్ బ్యాలెట్ ఉద్యోగుల్లో గుబులు రేపుతోంది. ఎన్నికల విధులు నిర్వహించిన ఉద్యోగులు ఉపయోగించుకున్న పోస్టల్ బ్యాలెట్లలో ఎన్ని చెల్లకుండా పోతాయోననే ఆందోళన కనబడుతోంది. ఫారమ్12/12డి దాఖలు చేసే సమయంలో ఉద్యోగులు ఇచ్చే డిక్లరేషన్‌పై గెజిటెడ్ ఆఫీసరు ధ్రువీకరించాల్సి ఉంటుంది. కొన్ని ఫెసిలిటేషన్ కేంద్రాల్లో డిక్లరేషన్లపై గెజిటెడ్ అధికారులు సంతకం, డిజిగ్నేషన్ స్టాంప్‌తోపాటు అఫీషియల్ సీల్ వేయాల్సి ఉండగా, అనేకచోట్ల అలా జరగకపోవడమే ఉద్యోగుల ఆందోళనకు కారణమవుతోంది. 4.44 లక్షల మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ అవకాశాన్ని వినియోగించుకున్నారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా 56 వేల పోస్టల్ బ్యాలెట్లను ఎన్నికల కమిషన్ తిరస్కరించింది. అప్పటి ఎన్నికల్లో 2.62 లక్షల మంది పోస్టల్ బ్యాలెట్స్‌ను వినియోగించుకోగా, ఈ దఫా ఎన్నికల్లో అన్ని విభాగాలు కలుపుకుని 4.97 లక్షల మంది పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని వినియోగించుకున్నారు. పోస్టల్ బ్యాలెట్స్‌లో ఓటర్ల ప్రమేయం లేకుండా జరిగిన లోపాల నేపథ్యంలో గెజిటెడ్ సంతకం, అఫీషియల్ సీల్, డిజిగ్నేషన్ స్టాంప్ లేని ఓట్లను పరిగణనలోకి తీసుకోవాలంటూ టిడిపి ఈ నెల 10, 17 తేదీల్లో ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లింది. అయితే ఇప్పటి వరకు ఇసి నుంచి దీనికి సంబంధించి ఎటువంటి ప్రకటన వెలువడలేదు.

తెలుగు ప్రజలకు మొదటి శత్రువు మోడీ

- ఎన్‌డిఎ, వైసిపి ప్రభుత్వాలు మారతాయి
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె నారాయణ



ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

తెలుగు ప్రజలకు మొదటి శత్రువు మోడీయేనని సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ అన్నారు. ప్రజా వ్యతిరేక పాలన చేసిన ఎన్‌డిఎ, వైసిపి ప్రభుత్వాలు మారడం ఖాయమని తెలిపారు. గుంటూరులోని సిపిఐ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్రంలో, రాష్ట్రంలో కొత్త ప్రభుత్వాలు ఏర్పడతాయని తెలిపారు. కేంద్రంలో బిజెపికి 400 సీట్లు వస్తాయని ప్రధాని మోడీ మైండ్ గేమ్ ఆడుతున్నారని అన్నారు. బిజెపికి ముస్లిములు, దళితులు, వెనుకబడిన తరగుతుల వారు పూర్తిగా వ్యతిరేకంగా ఉన్నారని చెప్పారు. దేశంలో నల్లధనం వెలికి తీస్తామని మోడీ చెప్పినవన్నీ అబద్ధాలేనని, ఈసారి ఎన్నికల్లో రూ.8600 కోట్లు ఎన్నికల అధికారులు పట్టుకోవడమే దీనికి నిదర్శనమని పేర్కొన్నారు.

గుజరాత్‌లోని ముందనార్ పోర్టు నుంచి గంజాయి, డ్రగ్స్ సరఫరా అవుతున్నాయన్నారు. అవినీతిని ఎన్ని రకాలుగా చేయవచ్చో జగన్‌మోహన్ రెడ్డి వద్ద నేర్చుకోవాలని తెలిపారు. చంద్రబాబు నాయుడు బతుకు తెరువు రాజకీయాల కోసమే బిజెపితో పొత్తు పెట్టుకున్నారని విమర్శించారు. రాష్ట్రంలో ఎన్నికలకు ముందు డిజిపిని మార్చకపోతే రాష్ట్రం వల్లకాడు అయ్యేదన్నారు. ఎన్నికల తరువాత పోలీసుల వైఫల్యం వల్లే దాడులు జరిగాయన్నారు. ఓటమి దిశగా ఉన్న వైసిపి నేతలు దాడులకు పాల్పడుతున్నారని విమర్శించారు. సమావేశంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు, సిపిఐ గుంటూరు లోక్‌సభ అభ్యర్థి జంగాల అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

Chola
Enter a better life
చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్
కార్పొరేట్ ఆఫీసు: చోళా క్రెస్ట్, సూపర్ బి, సి54 & సి 55, 4, తిరు వికా ఇండస్ట్రీయల్ ఎస్టేట్, గిండీ, చెన్నై-600032, తమిళనాడు.

డిమాండ్ నోటీసు

సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 ("ది ఆక్ట్") మరియు ది సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 ("ది రూల్స్")లోని నియమాల క్రింద.
క్రింది సంతకందారులు చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ (ది సెక్యూర్డు క్రెడిటార్) యొక్క అధీకృత అధికారిగా, చట్టంలోని సెక్షన్ [illegible]

[illegible]

ప్రదేశం: విజయవాడ, ఆంధ్రప్రదేశ్
తేది: 15-05-2024

సం/- అధీకృత అధికారి
చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ తరఫున

KVB Karur Vysya Bank
Smart way to bank
ది కరూర్ వైశ్యా బ్యాంక్ లిమిటెడ్ | లక్ష్మీపురం బ్రాంచ్
డి.నెం.6-29-7, బ్రహ్మం గారి మఠం వీధి, లక్ష్మీపురం, గుంటూరు-522007

బంగారు నగల వేలము ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడం ఏమనగా ఈ దిగువ ఉదహరించిన వ్యక్తి మా బ్యాంకు నందు బంగారు నగలు తాకట్టు పెట్టి తీసుకున్న ఋణమును తిరిగి చెల్లించలేదు. సదరు వ్యక్తులకు అనేక పర్యాయములు నోటీసులు పంపియున్నాము. సదరు నోటీసులు పంపినప్పటికీ ఖాతరు చేయనందున / నోటీసు వారికి చేరక వాపసు వచ్చినందున / నగలు విడిపించుకోలేక పోయినందున వారి బకాయిలను రాబట్టుకొనుటకు బ్యాంకు నిబంధనలను అనుసరించి **తేది.31-05-2024 శుక్రవారం మ॥ 03.00 గం॥లకు** బ్యాంకు ఆవరణములో బహిరంగముగా వేలము వేయుటకు నిర్ణయించడమైనది. **షరతులు : 1)** నోటీసులు చేరనివారు ఇదే ఆఖరు నోటీసుగా భావించవలెను. **2)** ఈ ప్రకటన ఖర్చు ఇందులో ఉదహరించిన వారే భరించవలెను. **3)** ఎటువంటి కారణము తెలుపకనే వేలము నిలుపుదల చేయుటకు గాని పూర్తి /పాక్షికంగా రద్దు చేయుటకు బ్యాంకు వారికి పూర్తి అధికారం కలదు. **4)** వేలములో పాల్గొనువారు **రూ.15,000/-** ధరావత్తు చెల్లించవలెను. **5)** వేలము పొందినవారు వెంటనే పూర్తి సొమ్ము చెల్లించి నగలు స్వాధీనం చేసుకోవలెను. లేని యెడల ధరావత్తు సొమ్ము కోల్పోవుదురు. **6)** బిడ్ మొత్తంపై పన్నును చెల్లించాలి. 7) ఆన్‌లైన్ బిడ్డింగ్ కలదు.

ఖాతా నెం.	ఋణగ్రహీత పేరు మరియు చిరునామా	తూకం గ్రా॥ లో
1453953000014292	శ్రీమతి పసుపులేటి కల్పన, భర్త: పి శివరామకృష్ణ,	96.70
1453953000016897	ఇంటి నెం.5-90-29, 7వ లేన్, చంద్రమౌళి నగర్, గుంటూరు, ఆం.ప్ర-522 007	51.40

తేది.18-05-2024
సం/-బ్రాంచి మేనేజర్, లక్ష్మీపురం శాఖ

ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్
IDFC FIRST Bank
(గతంలో క్యాపిటల్ ఫస్ట్ లిమిటెడ్ మరియు ఐడిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్‌తో సమ్మిళితమైంది)
సిఐఎన్: L65110TN2014PLC097792
నమోదిత కార్యాలయం : కెఆర్‌ఎమ్ టవర్స్, 8వ అంతస్తు, హారింగ్టన్ రోడ్, చెట్పెట్, చెన్నై-600031.
టెలి: +91 44 4564 4000, ఫ్యాక్స్: +91 44 4564 4022.

అనుబంధం- IV (రూల్ 8(1)
స్వాధీనతా నోటీసు (స్థిరాస్తి కొరకు)

ఏదైతే, క్రింది సంతకందారు **ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్ (గతంలో క్యాపిటల్ ఫస్ట్ లిమిటెడ్ మరియు ఐడిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్‌తో సమ్మిళితమైంది)** యొక్క అధీకృత అధికారిగా, సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువుతూ సెక్షన్ 13(12) క్రింద సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్, 2002 క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించి, తేది: **30.09.2023** న డిమాండ్ నోటీసు జారీచేయడమైనది. పిలువబడిన రుణగ్రహీత, సహ-రుణగ్రహీతలు మరియు హామీదారులు **1. రాజా పెయింట్స్, 2. మురికిపూడి సుశీల, 3. జయరాజు మురికిపుడి** లను నోటీసులో పేర్కొన్న మొత్తాన్ని చెల్లించడానికి ఉన్న మొత్తం **రూ.66,78,388.93/-** (అరవై ఆరు లక్షల డెబ్బై ఎనిమిది వేల మూడు వందల ఎనభై ఎనిమిది రూపాయల తొంభై మూడు పైసలు మాత్రమే) 27.09.2023 నాటికి పేర్కొన్న నోటీసు రసీదు తేది నుండి 60 రోజుల్లోగా తిరిగి చెల్లించవలసిందిగా కోరబడినది.
రుణగ్రహీతలు మొత్తాలను తిరిగి చెల్లించుటలో విఫలం చెందియున్నందున, ఇందుమూలంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలకు ప్రకటన ఇవ్వడమేమనగా, దిగువసంతకందారు సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8తో చదువబడే చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (4) క్రింద అతనికి సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని ఇందు దిగువ వివరించిన ఆస్తిని **17 మే, 2024న లాంఛనప్రాయంగా స్వాధీనం** చేసుకున్నారు.
ప్రత్యేకించి రుణగ్రహీతలు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా హెచ్చరించడమేమనగా, ఆస్తితో లావాదేవీలు జరుపరాదని మరియు ఆస్తితో ఏవేని లావాదేవీలు జరిపేందుకు **ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్ (గతంలో క్యాపిటల్ ఫస్ట్ లిమిటెడ్ మరియు ఐడిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్ తో సమ్మిళితమైంది)** కు మొత్తం **రూ.66,78,388.93/-** (అరవై ఆరు లక్షల డెబ్బై ఎనిమిది వేల మూడు వందల ఎనభై ఎనిమిది రూపాయల తొంభై మూడు పైసలు మాత్రమే) మరియు దానిపై వడ్డీతో తిరిగి చెల్లించి జరుపవలెను.
రుణగ్రహీతలు సెక్యూర్డ్ అసెట్స్‌ను విడిపించుకొనుటకు అందుబాటులో గల సమయంకు సంబంధించి, చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (8) యొక్క నియమాలపై శ్రద్ధవహించవలసిందిగా కోరబడుచున్నది.

స్థిరాస్తుల వివరణ

ఆంధ్రప్రదేశ్-522509, గుంటూరు, అగత్తవరపాడు గ్రామం, ఆటోనగర్, ఫేస్ 4, బ్లాక్ నం.21, సర్వే నంబరు 185, మొత్తం ఆ ముక్క మరియు పార్శిల్ ప్లాట్ నం.20 కొలత 267.02 చ.మీ.లు. అనగా... 319.36 చ.గ.లు. మరియు హద్దులు : తూర్పు : 20'0" వెడల్పు రోడ్డు (6.40 మీ.లు.), పడమర : ప్లాట్ నం.లు. 18 మరియు 19 (22.55 మీ.లు.), ఉత్తరం : ప్లాట్ నం.21 (18.28 మీ.లు.) దక్షిణం : 40'0" వెడల్పు రోడ్డు (24.38 మీ.లు.)

తేది: 17 మే, 2024
ప్రదేశం: గుంటూరు
రుణ ఖాతా నం: 68766858

సం/- అధీకృత అధికారి
ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్
(గతంలో క్యాపిటల్ ఫస్ట్ లిమిటెడ్ మరియు ఐడిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్‌తో సమ్మిళితమైంది)

बैंक ऑफ़ बड़ौदा Bank of Baroda
బ్యాంక్ ఆఫ్ బరోడా
అమరావతి రోడ్డు బ్రాంచి
హిందూ కాలేజి ఫార్మసీ క్యాంపస్, అమరావతి రోడ్డు, గుంటూరు, ఎపి - 522002, ఇండియా

స్వాధీనత ప్రకటన (స్థిరాస్తి కొరకు)
సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8(1) ప్రకారం

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 ప్రకారము **బ్యాంక్ ఆఫ్ బరోడా, అమరావతి రోడ్డు బ్రాంచి** యొక్క అధీకృత అధికారి అయిన ఈ దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 నందలి సెక్షన్ 13(12)కు అనుబంధమైన రూలు 3 ప్రకారము సంక్రమించిన అధికారములతో **ఋణగ్రహీత : మెస్సర్స్ జ్యోతి శారీస్ & ఎంబ్రాయిడరీ వర్క్స్, ప్రొ॥ శ్రీమతి కావూరు జ్యోతి,** డి.నెం. 16-32-54, యం.ఎల్. నగర్, పాత గుంటూరు, గుంటూరు సిటీ, గుంటూరు, ఎపి - 522001. సహ ఋణగ్రహీత : శ్రీమతి కావూరు జ్యోతి (ప్రొ॥ మెస్సర్స్ జ్యోతి శారీస్ & ఎంబ్రాయిడరీ వర్క్స్), డి.నెం. 16-32-54, యం.ఎల్. నగర్, పాత గుంటూరు, గుంటూరు సిటీ, గుంటూరు, ఎపి - 522001. హామీదారులు : శ్రీమతి కావూరు సీతారావమ్మ, భర్త : కావూరి నరసింహారావు, డి.నెం. 16-32-54, యం.ఎల్. నగర్, పాత గుంటూరు, గుంటూరు సిటీ, గుంటూరు, ఎపి - 522001 వారు ది. 08-01-2024 నాటికి చెల్లించవలసిన బకాయి మొత్తం **రూ. 10,91,634.80/- (అక్షరాల పది లక్షల తొంభై ఒక్క వేయి ఆరు వందల ముప్పై నాలుగు రూపాయల ఎనభై పైసలు మాత్రమే)** + ది. 09-01-2024 నుండి వర్తించని వడ్డీ + ఇతర ఛార్జీలతో కలిపి నోటీసు తేది నుండి 60 రోజులలోగా చెల్లించవలసినదిగా తేది. **09-01-2024 న డిమాండ్ నోటీసు** జారీ చేయబడినది.

ఋణగ్రహీత / హామీదారు / తనఖాదారు బకాయి సొమ్మును తిగిరి చెల్లించుటలో విఫలమైనందున ఈ దిగువ సంతకం దారు సదరు చట్టములోని సెక్షన్ 13లోని సబ్ సెక్షన్ 13 (4) ప్రకారం సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్, 2002 లోని రూల్ 8 ప్రకారము **తేది. 18-05-2024**న దిగువ పేర్కొన్న ఆస్తిని స్వాధీనత తీసుకోవడమైనదని ప్రత్యేకముగా ఋణగ్రహీత / హామీదారు/ తనఖాదారు మరియు సాధారణ ప్రజానీకమునకు ఇందుమూలముగా తెలియజేయడమైనది.

ఈ ఆస్తి విషయమై ఎవరు ఎటువంటి లావాదేవీలు జరుపరాదని, ఎటువంటి లావాదేవీలైనా ది. 08-01-2024 నాటికి చెల్లించవలసిన బకాయి మొత్తం **రూ. 10,91,634.80/- (అక్షరాల పది లక్షల తొంభై ఒక్క వేయి ఆరు వందల ముప్పై నాలుగు రూపాయల ఎనభై పైసలు మాత్రమే)** + ది. 09-01-2024 నుండి వర్తించని వడ్డీ + ఇతర ఖర్చులు బ్యాంకు ఛార్జీలు బ్యాంక్ ఆఫ్ బరోడా, అమరావతి రోడ్డు బ్రాంచి వారి ఛార్జీలకు లోబడి వుండునని ఇందుమూలముగా ప్రత్యేకించి ఋణగ్రహీత / హామీదారు/ తనఖాదారు మరియు సాధారణ ప్రజానీకానికి హెచ్చరించడమైనది.

చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) నిబంధనల ప్రకారం ఋణగ్రహీత / తనఖాదారు తమ తనఖా ఆస్తులను విడిపించు కోవడానికి ఉన్న కాలవ్యవధిని వినియోగించడమునకై శ్రద్ధ వహించవలెను.

స్థిరాస్తి వివరములు

గుంటూరు జిల్లా, గుంటూరు మున్సిపల్ కార్పోరేషన్ ఏరియా, గుంటూరు సిటీ, పాత గుంటూరు, సుద్దపల్లి డొంక, 3వ లైన్, ముగ్గం నగర్, మున్సిపల్ పాత వార్డు నెం. 9, బ్లాక్ నెం. 11, టి.ఎస్.నెం. 776/1, గుంటూరు అర్బన్ ల్యాండ్ సీలింగ్ ఆఫీసర్ ప్రకారం టి.ఎస్.నెం. 776/1ఎఫ్ వద్ద 196 చ॥గ॥ల ఆస్తిలోని ఉత్తర భాగాన గల సగం స్థలము అనగా 98 చ॥గ॥ల స్థలము. **హద్దులు : తూర్పు :** వి. కోటేశ్వరరావు మరియు ఇతరులకు చెందిన ఆస్తి - 21.0 అ॥, **పడమర :** మున్సిపల్ రోడ్డు - 21.0 అ॥, **ఉత్తరం :** బత్తిన పూర్ణచంద్ర మరియు ఇతరులకు చెందిన ఇంటి గోడ - 42.0 అ॥, **దక్షిణం :** వి. నాగేశ్వరరావు మరియు ఇతరులకు చెందిన మిగిలిన ఆస్తి - 42.0 అ॥. పైన తెలిపిన సరిహద్దుల మధ్య 98 చ॥గ॥ లేదా 81.94 చ॥మీటర్ల విస్తీర్ణంలోని ఖాళీ స్థలము మాత్రమే అది కావూరు సీతారావమ్మ గారి పేరిట ఉన్నది.

తేది : 18-05-2024
ప్రదేశం : గుంటూరు

అధీకృత అధికారి
బ్యాంక్ ఆఫ్ బరోడా

ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్
IDFC FIRST Bank
(గతంలో క్యాపిటల్ ఫస్ట్ లిమిటెడ్ మరియు ఐడిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్‌తో సమ్మిళితమైంది)
సిఐఎన్: L65110TN2014PLC097792
నమోదిత కార్యాలయం : కెఆర్‌ఎమ్ టవర్స్, 8వ అంతస్తు, హారింగ్టన్ రోడ్, చెట్పెట్, చెన్నై-600031.
టెలి: +91 44 4564 4000, ఫ్యాక్స్: +91 44 4564 4022.

అనుబంధం- IV (రూల్ 8(1)
స్వాధీనతా నోటీసు (స్థిరాస్తి కొరకు)

ఏదైతే, క్రింది సంతకందారు **ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్ (గతంలో క్యాపిటల్ ఫస్ట్ లిమిటెడ్ మరియు ఐడిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్‌తో సమ్మిళితమైంది)** యొక్క అధీకృత అధికారిగా, సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువుతూ సెక్షన్ 13(12) క్రింద సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్, 2002 క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించి, తేది: **17.06.2023** న డిమాండ్ నోటీసు జారీచేయడమైనది. పిలువబడిన రుణగ్రహీత, సహ-రుణగ్రహీతలు మరియు హామీదారులు **1. తాటివలస తులసి, 2. తాటివలస రామారావు,** లను నోటీసులో పేర్కొన్న మొత్తాన్ని చెల్లించడానికి ఉన్న మొత్తం **రూ.9,76,624.02/-** (తొమ్మిది లక్షల డెబ్బై ఆరు వేల ఆరు వందల ఇరవై నాలుగు రూపాయల రెండు పైసలు మాత్రమే) 16.06.2023 నాటికి పేర్కొన్న నోటీసు రసీదు తేది నుండి 60 రోజుల్లోగా తిరిగి చెల్లించవలసిందిగా కోరబడినది.
రుణగ్రహీతలు మొత్తాలను తిరిగి చెల్లించుటలో విఫలం చెందియున్నందున, ఇందుమూలంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలకు ప్రకటన ఇవ్వడమేమనగా, దిగువసంతకందారు సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8తో చదువబడే చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (4) క్రింద అతనికి సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని ఇందు దిగువ వివరించిన ఆస్తిని **16 మే, 2024న లాంఛనప్రాయంగా స్వాధీనం** చేసుకున్నారు.
ప్రత్యేకించి రుణగ్రహీతలు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా హెచ్చరించడమేమనగా, ఆస్తితో లావాదేవీలు జరుపరాదని మరియు ఆస్తితో ఏవేని లావాదేవీలు జరిపేందుకు **ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్ (గతంలో క్యాపిటల్ ఫస్ట్ లిమిటెడ్ మరియు ఐడిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్ తో సమ్మిళితమైంది)** కు మొత్తం **రూ.9,76,624.02/-** (తొమ్మిది లక్షల డెబ్బై ఆరు వేల ఆరు వందల ఇరవై నాలుగు రూపాయల రెండు పైసలు మాత్రమే) 16.06.2023 నాటికి మరియు దానిపై వడ్డీతో తిరిగి చెల్లించి జరుపవలెను.
రుణగ్రహీతలు సెక్యూర్డ్ అసెట్స్‌ను విడిపించుకొనుటకు అందుబాటులో గల సమయంకు సంబంధించి, చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (8) యొక్క నియమాలపై శ్రద్ధవహించవలసిందిగా కోరబడుచున్నది.

స్థిరాస్తుల వివరణ

ఎపి, పిన్ : 521108, కృష్ణాజిల్లా యొక్క విజయవాడ (తూర్పు), గుణదల ఎస్ఆర్‌ఓ పరిధిలో విజయవాడ రూరల్ మండలం, ప్రసాదంపాడు గ్రామం మరియు గ్రామ పంచాయతీ ఏరియాలో ఉన్న మూల్యాంకనం నం.3510, డో.నం.13-161, బేరింగ్ ఆర్.ఎస్.నం.76/1, 76/2, స్థలం పై నిర్మించబడిన అవిభక్త వాటా విస్తీర్ణం 14.0 చ.గ.లు. లేదా 11.70 చ.మీ.లు. నిర్మించబడిన మొత్తం విస్తీర్ణం 280.4 చ.గ.లు. లేదా 234.5 చ.మీ.లు. "శ్రీ సాయి శ్రీనివాస రెసిడెన్సీ" యొక్క పేరు మరియు శైలి క్రింద నిర్మించబడిన అపార్టుమెంట్లలోని గ్రౌండ్ ఫ్లోర్‌లో మొత్తం ఆ ముక్క మరియు పార్శిల్ ఫ్లాట్ నం.జిఎఫ్-3 తో ప్లింత్ ఏరియా 465.0 చ.అ.లు. తో పాటు కామన్ మరియు బాల్కానీ ఏరియా మరియు స్టిల్ట్ ఫ్లోర్ లో 25 చ.అ.లు. టూ వీలర్ పార్కింగ్ తో అన్నీ ఇతర ఉమ్మడి సౌకర్యాలు అనగా నీరు, డ్రైనేజి, మెట్లు, మోటరు మొదలైనవి. ఉన్న హద్దులు : గ్రౌండ్ ఫ్లోర్‌లో ఫ్లాట్ జిఎఫ్ 3 సరిహద్దులు : తూర్పు : వసంత అప్పన్న ఆస్తి, పడమర : లిఫ్ట్, మెట్లు మరియు కామన్ కారిడార్, ఉత్తరం : చలసాని అశోక్ కుమార్ ఆస్తి, దక్షిణం : రెమినిశెట్టి మార్కండేయులు ఆస్తి. ఆ స్థలం అవిభక్త వాటా 14.0 చ.గ.లు. మొత్తం స్థలం 280.4 చ.గ.లు. కొరకు సరిహద్దులు : తూర్పు : వసంత అప్పన్న ఆస్తి-47.2 అ.లు., పడమర : 18.0 అ.లు వెడల్పు రోడ్డు-47.2 అ.లు., ఉత్తరం : చలసాని అశోక్ కుమార్ ఆస్తి-53.6 అ.లు., దక్షిణం : రెమినిశెట్టి మార్కండేయులు ఆస్తి-53.6 అ.లు.

తేది: 16 మే, 2024
ప్రదేశం: కృష్ణ
రుణ ఖాతా నం: 44731917.

సం/-అధీకృత అధికారి
ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్
(గతంలో క్యాపిటల్ ఫస్ట్ లిమిటెడ్ మరియు ఐడిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్‌తో సమ్మిళితమైంది)

పద్య వారసత్వం

నాయనా
నువ్వు వానాకాలం వాగు సాగినట్టు
పద్యం పాడుతూ ఉంటే
దాని మందలేంటో
సరిగా తెలియలేదు!
పద్యం అంటే
గట్టిగా రాగం తీయడమే అనుకున్నా

నీ గొంతులో
కూజాలోంచి జారుతున్న నీళ్ల
మెలికలు తిరుగుతున్నట్టు
పద్యం మెలికలు తిరుగుతుంటే
ఎచ్చులకారి తనం అనుకున్నా!

పద్యం అంటే జీవితమని
నీ పద్యాన్ని
అగ్నిలో తగలపెట్టే దాకా తెలియలేదు!

అమ్మని అడిగితే చెప్పింది
ఊరు ఊరు తిరిగి
వీధి బాగోతపు పద్యం పాడే వేళ
నువ్వు ఒక పూరిలో
మైరావణుడవని,
మరోచోట దక్షుడవని, ఇంకోచోట యక్షుడవని
జీవితాల జాడ తెలిపే ఎరుకుల సానివాని,
చెంచులక్ష్మి, చిత్రాంగదవని
మూడో జాములో ముక్కంటి శివుడవని,
విధి నాటకంలో విభుడవని ...

నువ్వెన్ని వేషాలు వేసినా
నాయన వేషం మాత్రం
బతుకాటలో బాకీ పడలేదని
ఊరంతా అంటుంటే వీధి నడి మధ్యలో
నీ విగ్రహమొకటి ప్రత్యక్షమైనట్టే ఉంది!

పద్యం అంటే ఏంటో
ఇప్పుడిప్పుడే తెలుస్తూ ఉంది
నాయనా నాయనా
నువ్విచ్చిన పద్యం
ఇప్పుడు సాహితీ లోకంలో
నన్నో జెండాలా ఎగరేస్తోంది
నీ పద్య వారసత్వం
సీతాకోకచిలుక కింద పడిన శబ్దాన్ని వినిపిస్తోంది
నీ పద్యముద్ర
నా హృదయాన్ని శుద్ధి చేస్తోంది
నీ పద్యమే కదా పొద్దుపొడుపు చుక్క!
మీ నాన్న, నీ కోసం
ఏమి వదిలి పెట్టి వెళ్లాడని ఎవరైనా అడిగితే
ఈ పద్యాన్ని సాక్ష్యంగా ఇస్తాను
ఈ పద్య వీలునామాను
వేయి గొంతులుగా
బహిరంగ ప్రకటన చేస్తాను.

– డాక్టర్ సుంకర గోపాల్, 94926 38547

దేశభక్తి

నీ దేశభక్తి అంటే
ఎందుకో నాకు మరణ భయం!
ఎర్రని నిలువబొట్టు పెట్టుకుని
ఎదురుపడే గ్రద్దచూపునకు
నా బొటనవేలు వేలి ముద్రను
నా గుప్పిలి కలుగులో దాచుకుంటాను

వాడి దేశభక్తి రోడ్ల మీద బస్సుల్ని రైళ్లను
తగలబెడుతుంటే
నిప్పుల్లో ఆహుతైపోతున్న దేశ పటం
తెల్లని చుట్టగడ్డలో చుట్టబడిన
పసిపిల్ల శవమై
నా గుండెలపై పొరాడినట్టుంటుంది

దేశమును ప్రేమించుమన్న
మంచియన్నది పెంచుమన్న
పెంపుడు చిలక పెరటి మాటలు
గుజరాత్‌లో బూబమ్మల్ని మసి బొగ్గులు చేసిన
ఆ కాళ రాత్రుల జ్ఞాపకం
దేశభక్తిని ఇంకా ప్రేరేపిస్తుంటే
ఎన్ని మణిపూర్లు పుట్టిస్తాయోనని
ప్రతిరాత్రి పులుగు కన్నుల
నిద్రలేమితో తెల్లవార్చుకుంటున్నాను!

ద్వేషం వాడి భాషగా
దేశభక్తిని చలామణిలో పెట్టి
ఓట్లపెట్టెను నింపుకునే
కంపు జుపీ ల మీద గెలుపు వాంతిని
చేసుకోడానికి
గంగ మీద వాలి బ్యాలెట్ ముఖంతో
కొంగ కన్నీళ్లిడుస్తున్నాడు..

ఇప్పుడు దేశమంతా దేశభక్తి
యమరంజుగా గుడ్డలిడిసిన సన్యాసులతో
బోగీలు నిండిపోయాయి
ఇన్ని అంగుళాల ఛాతి అని కొలిచే
టైలరింగు టేపు కాదు కదా దేశభక్తి అంటే!

ఎండిపోయిన వాగుల్లాంటి బురఖాల్లోకి
తమ కళ్లతో తొంగి చూసి
ఓటు నిర్ధారణ దేశభక్తి కావటం
విద్వేష నిఘంటుల నిర్వచనం!

పరాయి మతం మీద
మనది కాని కులం మీద
ఏ అర్ధరాత్రి వేళలోనో గొడ్డళ్లు బరిసెలెత్తి
చంపగలిగినంత మేర
ఇంట్లోకి వంట్లోకి
చొరబడటమే నేర్చుకున్న దేశభక్తి!
పక్క దేశంపై శత్రు మాటలతో విరుచుకుపడ్డం
క్రికెట్ గ్రౌండ్లో పొరుగు ఆటగాళ్ల మీద
ఖాళీ కోక్ బాటిళ్లు విసరటం
నీ దేశభక్తి కొలమానమై
మెత్తని మానంలోకి
ముడుసులా దిగబడుతుంటే
దేశమంతా రక్త స్రావం అవుతుంది!

దేశమంటే మనుషులని చాటింపు వేసి
దేశాన్ని బతికించాలంటే..
నీ విద్వేష భక్తిని చంపుకో...

– నేలపూరి రత్నాజీ,
89199 98753

అక్షరం

ప్రజాశక్తి

www.prajasakti.com

facebook/prajasakti, twitter/prajasakti

సాహిత్యం జీవిత ప్రతిబింబం.
ఏ కాలం నాటి సాహిత్యం ఆనాటి సామాజిక వ్యవస్థను ప్రతిబింబిస్తుంది.
– కాల్ రిడ్జ్

రేపటి కోసం గొంతెత్తిన అక్షరం

తరగతి గది స్వప్నం దీర్ఘ కవిత

తరగతి గది/ రాబోవు చరిత్రకు
ఇప్పటి బీజాక్షరం
తరగతి గది/ మానవమహా చైతన్య శిఖరం
తరగతిగది / ఆది మానవుని
జ్వలింపజేసిన అశౌర్య క్షేత్రం

విద్యావ్యవస్థ మీద ఇంత శాస్త్రీయమైన నమ్మకం ప్రకటించిన కవి బాల సుధాకర మౌళి. ఆయన పుట్టుకతో శ్రామికవర్గానికి, వృత్తితో అధ్యాపక వర్గానికి, భావజాలం రీత్యా ప్రగతిశీల వర్గానికి చెందిన కవి. "తరగతి గది స్వప్నం" అనే దీర్ఘ కవిత ఈ వాస్తవాన్ని రుజువు చేస్తోంది. మౌళి జీతమాత్రోపజీవి అయ్యుంటే ఈ కావ్యం రాసేవారు కాదు. ఆయనకు వృత్తి పట్ల నిబద్ధత ఉంది. విద్య ప్రాముఖ్యం ఆయనకు తెలుసు. సంఘ సంస్కరణోద్యమం మొదట కొన్ని విద్యా భారతదేశ పునర్నిర్మాణంలో నిర్వహిస్తున్న క్రియాశీల పాత్ర ఆయనకు తెలుసు. మహాత్మా పూలే, బి.ఆర్ అంబేద్కర్ వంటి సాంఘిక విప్లవకారులు విద్యను సామాజిక పరివర్తనకు ఆయుధంగా చేసుకొని నడిపిన ఉద్యమాల జ్ఞానం ఆయనకుంది. ఉద్యమం, విద్య ఈ రెండూ ప్రపంచాన్ని మారుస్తాయన్నది ఆయన అవగాహన. ఆ రెంటికీ 'తరగతి గది' కేంద్రస్థానం.

సుధాకర మౌళి తన్మయత్వంతో తరగతి గదిని వర్ణించారు. ఆయన తరగతి గది పట్ల కలలు కనడంలో దిట్ట.

"తరగతి గదిలో/ అక్షరం పురుడు పోసుకుంటుంది
అక్షరాన్ని తరగతి గది/ అమ్మై సాకుతుంది.
నాన్నై నడక నేర్పిస్తుంది"

కవి దృష్టిలో తరగతి గది గంటలు లెక్క బెట్టే యాంత్రిక స్థలం కాదు. దేశ పునర్నిర్మాణానికి అవసరమైన మేధాశక్తిని ఉత్పత్తి చేసే కార్మాగారం. తరగతి గది విద్యార్థులకు చైతన్యాన్ని కలిగించే స్థలం. మౌళి ఈ భావనను అనేక రూపాల్లో వ్యక్తం చేశారు.

"నేను కలల కార్మికుడిని "

అధ్యాపకుడు దేనిని గురించి కలలు కంటాడు. తన పాఠశాల గురించి, తన విద్యార్థుల గురించి. తరగతి గదిని గురించి కలలు కనడమంటే దేశాన్ని గురించి కలలు కనడమే. దేశపు పునర్నిర్మాణం గురించి కలలు కనడమే! తరగతి గది, అధ్యాపకుల తర్వాత విద్యా వ్యవస్థకు కేంద్ర బిందువు విద్యార్థులు. ఇప్పుడు విద్యార్థులు రెండు రకాలుగా ఉన్నారు. కొనగలిగిన శక్తి ఉండి ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలలో చదువు కొనేవారు. పేదరికం వల్ల ప్రభుత్వ పాఠశాలల్లో చదివేవారు. మౌళి ప్రభుత్వ పాఠశాల అధ్యాపకులుగా, పేద విద్యార్థులను గురించి మాట్లాడారు.

"ఉల్లికాడల కాళ్ళతో/ పగుళ్ళు దేలిన మడమలతో
జీవన విషాదంలోంచి/ బడికి వస్తున్న పిల్లలు"

అంటూ శ్రామిక వర్గం నుంచి పాఠశాలకు వచ్చే పేద విద్యార్థులను కవి ఆవేదనగా ఆనందంగా వర్ణించారు. ఆ వర్ణన ఆయన నిబద్ధతకు సంకేతం. అధ్యాపకుడు తన విద్యార్థులను ప్రేమించడం కన్నా మించిన కవిత్వం ఉండదు. బాల సుధాకర మౌళి విద్యార్థి ప్రేమైక జీవి.

అధ్యాపకులు వాచకాలను వాచకాలుగా బోధించి, పరీక్షలు రాయించి, మార్కులు తెప్పించే యాంత్రిక జీవి కారాదు. అంతకన్నా ఉన్నతమైన బాధ్యతను నిర్వహించాలి. తరగతి గదిని విద్యార్థుల వ్యక్తిత్వ వికాస కేంద్రంగా మార్చగల శిల్పి కావాలి. అసమ సమాజంలో అనేక రకాల విద్యార్థులు ఉంటారు. అనేక ఆర్థిక సాంఘిక వైరుధ్యాలలోంచి విద్యార్థులు వస్తారు. అధ్యాపకులు ఆ వైరుధ్యాల నుంచి విద్యార్థులకు బయటపడే శక్తినివ్వాలి. పేద పిల్లల పట్ల ప్రత్యేక మమకారం చూపాలి. వాచకాలతో పాటు, అనేక ఆర్థిక సాంఘిక రాజకీయాంశాలను సందర్భానుసారంగా బోధిస్తూ సామాజిక చైతన్యం కలిగించాలి.

"నేనూ, నా తరగతి గది
వెలివాడ పిల్లాడి ఆత్మ గౌరవ పతాకాన్ని" అని కవి తన నిబద్ధతను ప్రకటించుకున్నారు. వాచకాలతో పరిమితం కాకుండా వాచకేతర అంశాలను కూడా విద్యార్థులకు వాచకం ఆధారంగానే బోధించవచ్చు.

"జల్ జంగిల్ జమీన్ కోసం/ మరణాన్ని సైతం ముద్దాడే
వీరుల త్యాగం గురించి మాట్లాడతాను"

మైనారిటీలను గురించి, కాశ్మీరం గురించి ... ఇంకా అనేకం గురించి మాట్లాడతానని కవి ప్రకటించి తరగతి గది ఎంత విశాలంగా ఉండాలో చెప్పారు.

ఇటీవలి కాలంలో విద్యార్థుల మీద అనేక రకాల వత్తిళ్లు పడుతున్నాయి. అనేక ఆంక్షలు విధింపబడుతున్నాయి. స్వేచ్ఛగా హాయిగా చదువుకోవల్సిన పిల్లలు బందీలుగా బతకాల్సి వస్తున్నది. కవి ఆ వాస్తవాన్ని రికార్డు చేశారు.

"స్వేచ్ఛగా ఎగరాల్సిన అక్షరం/ సంకెళ్ళ బరువుతో
తూలిపోతుంది
అక్షరం జైలు శిక్ష అనుభవిస్తుంది"

"జైలుశిక్ష" అనే మాట అనేకార్థాలను ధ్వనిస్తున్నది. భారతీయ సామాజిక తత్వానికి విరుద్ధమైన ప్రపంచీకరణ భారతదేశాన్ని చుట్టుముట్టి విద్యావ్యవస్థను చిన్నాభిన్నం చేస్తోంది.

"మహా విషాదం
తరగతి గదిలోకి భూతం/ ప్రవేశించింది.
తెల్లని భూతం" అని కవి సంకేతాత్మకంగా చెప్పారు. "తెల్లని భూతం" కూడా అనేకార్థక పదమేననిపిస్తుంది. ఇన్నాళ్లూ విద్యారంగం నుంచి నిషేధింపబడిన పేద పిల్లలు ఇప్పుడు అవకాశం రాగానే చదువుకోవడానికి బాగా ఆసక్తి చూపుతున్నారు. పేద పిల్లల విద్యాదాహాన్ని మౌళి ఆర్ద్రంగా ఆవిష్కరించారు.

"అక్షరం కోసం/ ఆకలిని మర్చిపోతున్నారు.
అక్షరం కోసం/ కన్నీళ్లను
తుడిచేసుకుంటున్నారు"

అంతటి దాహంతో వచ్చిన పిల్లలు పాఠశాలల్లో సహజంగా పొందాల్సిన స్వేచ్ఛను పొందలేకపోతున్నారని, కవి తన ఆవేదనను తెరలు తెరలుగా అల్లారు.

"కాలం తరగతి గదుల్లో
కరిగిపోతోంది"

విద్యాసంస్థలు విద్యార్థుల్లో సహజంగా ఉండే సృజనాత్మకతను పెంపొందించుకోవడానికి దోహదం చేయాలి. అదనంగా కొత్త సృజనాత్మకతను నేర్పాలి. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి తలకిందులైపోయింది. విద్యాసంస్థల్లో ప్రవేశించిన విద్యార్థులు తమ సృజనాత్మకతనంతా కోల్పోయి యంత్రాలుగా మారిపోవాల్సి వస్తోంది. ఆ స్థితిలో అనేక దుష్పరిణామాలు సంభవిస్తున్నాయి. వర్తమాన విద్యావ్యవస్థ సారాన్ని కాచి, వడబోసి కవిత్వీకరించారు మౌళి.

"పిల్లలు రాత్రీపగలు/ యంత్రాల్లా పనిచేస్తున్నారు.
గాల్లో ఈలలు వేయలేని పిల్లలు
మట్టితో బొమ్మలు చేయలేని పిల్లలు
చదువుల జైళ్లలో బాల్యం బందీ అవుతున్న పిల్లలు
బాల్యంలోనే వృద్ధులవుతున్న పిల్లలు"

ఒత్తిడికి నిలబడలేని పిల్లలు ఆత్మహత్యలు చేసుకోవడం నిరంతరం చూస్తున్నాం. కవి దానిని 'మృత్యువు వాసన' అన్నారు. ఇంతటి అనారోగ్యకరమైన వ్యవస్థలో కూడా విద్యారంగ గుండెకాయలైన అధ్యాపకులు ఎంత సృజనాత్మకంగా, బాధ్యతాయుతంగా ఉండాలో మౌళి చెప్పారు. తొలి భాగంలోనూ, ఆఖరి భాగంలోనూ 'అతడు' అని చెబుతూ అధ్యాపకుడిని సూచించారు. ఎంతటి తలకిందుల వ్యవస్థలోనైనా అధ్యాపకులు విద్యార్థులను గొప్పవాళ్లుగా తీర్చిదిద్దవచ్చునన్న నమ్మకం కవికి ఉంది. "అతడు నల్లబల్ల మీద/ రేపటి ఉషోదయాన్ని చూస్తున్నాడు" అంటూ మొదలైన కావ్యం– "అతడు, అతని ముందు, అడుగులు వేస్తూ ఒక తరం" అని ముగుస్తుంది.

కవి ఒక ప్రణాళిక వేసుకుని ఈ కావ్యం రాశారు. చుట్టూ ఉన్న చీకటిని తిట్టుకుంటూ కూర్చోకుండా, తన చైతన్యం కొలది విద్యారంగాన్ని చైతన్యీకరించే సంకల్పం ఉండాలన్నది ఈ కావ్యం నేర్పిన పాఠం. విద్యను ప్రేమించే గురువు కవి అయితే కావ్యం ఎలా ఉంటుందో 'తరగతి స్వప్నం' కావ్యం అలా ఉంది. విద్యారంగం మీద చాలా కవితలు, కథలు, నవలలు, వచ్చాయి. ఈ కావ్యం ఇటీవలే వచ్చింది.

అన్ని సామాజిక రంగాలూ చెడిపోయినా, చెడిపోకుండా ఉండాల్సినది విద్యారంగం. అది కూడా చెడు మార్గం పట్టిందంటే ఇక రక్షించే వాళ్లుండరు. అలాంటి విద్యారంగంలోకి కూడా అనారోగ్యం ప్రవేశించిందే అన్న ఆవేదన కవికి ఉంది. ఆ ఆవేదన నుంచే ఈ కావ్యం పుట్టింది. ప్రపంచీకరణ ప్రవేశం తర్వాత కార్పొరేట్ విద్యాసంస్థల చేతుల్లోకి విద్యావ్యవస్థ వెళ్లిపోయి, విద్యార్థుల మేధస్సుతో వాళ్లు వ్యాపారం చేయడం ప్రారంభించారు. విద్యార్థుల సహజ శక్తులను ధ్వంసం చేసి కృత్రిమ తెలివిని, యాంత్రిక తెలివిని ఎక్కించి చంపుతున్న దుర్మార్గం మీద కవికి ఆగ్రహం ఉంది.

"వరుసలు వరుసలుగా.. అంగడి సరుకుల్లా పిల్లలు
పిల్లల కలలు అమ్మకానికి తూగే సరుకుల్లా
బాల్యం చితికిపోతున్న పిల్లలు"
ఇదీ కవి ఆవేదన. ఆగ్రహం.

"నేను తరగతి గదిలోంచి విస్ఫోటించే కవిని" అని ప్రకటించుకోవడంతో ఆ కవి ఆగ్రహం వినిపిస్తుంది.

'చెమట కారుతున్న' పిల్లల మాస్టారుగా సుధాకర మౌళి ఆధునిక తెలుగు కవిత్వంలో ఇదివరకే నలుగుతున్న విద్యావ్యవస్థను మరింత సృజనాత్మకంగా కవిత్వీకరించారు. ఆయన పదజాలం పాఠశాలలను కదిలిస్తుంది. మాటల కూర్పు పాఠశాలలను ఆకర్షిస్తుంది. మామూలు మాటలను, అందరికీ తెలిసిన మాటలను తన హృదయ నైపుణ్యంతో కవి పాఠకుల్ని కవిత్వంలో భాగస్వాముల్ని చేసుకుంటారు. ఒక భావాన్ని చెప్పడం కోసం అనేక పదాలు ఉపయోగించడం మనకు తిక్కన కాలం నుంచి ఉంది. ఆధునిక కాలంలో ముఖ్యంగా వచన కవుల్లో ఈ లక్షణం కనిపిస్తుంది. బాల సుధాకరమౌళిలో ఈ లక్షణం ఉంది. పునరుక్తి కోసం పునరుక్తి పనికిరాదు. కవి భావం పాఠశాలలో నాటుకోవడానికి అదొక సాధనంగా ఉపయోగపడినప్పుడే కవిత రాణిస్తుంది. మౌళి పద ప్రయోగం అర్థవంతంగా ఉంటుంది.

"అతడు వాక్యం విల్లులో నుంచి అక్షరాన్ని
బాణంలా వదులుతాడు
రాలిన ఆకులతో రగడ పుట్టిస్తాడు
కారు చీకటి నల్ల బల్లల మీద
రేపటి హృదయాన్ని దర్శిస్తున్నాడు"

– రాచపాళెం చంద్రశేఖర రెడ్డి

యథార్థ వాదం

ముఖ కవళికలకు, హావభావాలకు
రంగేసుకోవచ్చు
నలుపును తెలుపు చేసి
నిజ వాక్కులను మోహపరచి,
పొలిమేరలు దాటించొచ్చు!

ఊచలకు చిక్కకుండా–
అనృతాలకు కాశీ మజిలీ కథలల్లి,
విస్మయ పరచి
మీడియా భుజాన ఊరేగవచ్చు
గెలుపు వోటును కొల్లగొట్టనూ వచ్చు
అరచేతుల కంటిన రక్తం చుక్కలను
గంగోదకంతో ప్రక్షాళన చేసుకోవచ్చు
న్యాయస్థానం గడపకు నామాలు దిద్ది–

నరావతారంలోనూ నభోంతరాల్లో
వెలుగు వెలగొచ్చు
కాక రాజేసిన జన మనమున దూరి–
జరిగిన దోషం, మిగిలిన నష్టం
గండశిలలా పాతుకుపోయి వుంటుందిలే
మనసులో సాక్షిగా ...
ఎప్పటికైనా తలొంచక తప్పదు
అజేయమైన, కనపడని మనస్సాక్షి ముందు!

– దాసరాజు రామారావు

గెలవాలంటే ...

నిజమే! పంక్చర్ల వాహనంపై
పరిగెత్తుతూ
యుద్ధం గెలవాలంటే సొంతం చతికిల
పడతాం
ఇప్పటికి అది తప్పని సరైనా
రేపటికి గెలుపు గుర్రమేదో
గుర్తించాలిగా
అడుగు పరుగు కావాలంటే దారిదేగా
...

పంక్చర్ల వాస్తవికతలో నడవాల్సిందే
ఆ నడక నవలోకపు సాధకుల
శోధనకూ దిగాలి
పురిటినెప్పులు పడకుండా కొత్త శిశువు
పుట్టదు
పంక్చర్లు .. కొత్త శిశువు .. సాధకుడు
నవలోక స్వప్నం కదలికల గమనమేగా
...

ప్రతి వ్యక్తీ చరిత్రలో ఒక పోగే
కొందరే చరిత్ర మలుపు దారులు
చూస్తారు
నా కర్రల బతుకు నన్ను కుదేసినా
నా మిత్రులు కొత్త చరిత్ర
శోధకులవ్వాలనీ
రేపటి తరానికి మలుపు
దివిటీలవ్వాలన్నదే ఆశ
ఇది కమ్యూనిస్టుగా నా మెలుకువ
స్వప్నం!

– ఉన్నం వెంకటేశ్వర్లు

9న కథా సదస్సు దరఖాస్తులకు ఆహ్వానం

తూర్పు గోదావరి జిల్లా రచయితల సంఘం (కాకినాడ) జూన్ 9వ తేదీన నిర్వహించే ఒకరోజు కథా సదస్సులో పాల్గొనడానికి వర్ధమాన తెలుగు కథకుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నది. రిజిస్ట్రేషన్ చేసుకున్న అభ్యర్థులు మే 22 తారీఖు లోపల 10 పేజీలకు మించని కొత్త, అముద్రిత కథను పంపాలి. సదస్సు వివరాల కోసం జి.వి.కె.వర్మ, 9866145951 నంబర్‌లో సంప్రదించొచ్చు. సదస్సులో తల్లావజ్జల పతంజలి శాస్త్రి, వాసిరెడ్డి నవీన్, అట్టాడ అప్పల నాయుడు, ఆలూరి విజయ లక్ష్మి, మహమ్మద్ ఖదీర్ బాబు, పెద్దింటి అశోక్ కుమార్, దాట్ల దేవదానం రాజు, శిఖామణి, వేంపల్లి షరీఫ్, జాన్సన్ చోరగుడి, జి.వెంకట కృష్ణల ప్రసంగాలు ఉంటాయి.

– దాట్ల దేవదానం రాజు, సదస్సు సంచాలకులు

1న శీలావీ పుస్తకావిష్కరణ, అవార్డుల ప్రదానం

ప్రముఖ చిత్రకారుడు, కవి శీలా వీర్రాజు ద్వితీయ వర్ధంతి సందర్భంగా జూన్ 1వ తేదీ సాయంత్రం 5.30 గంటలకు హైదరాబాద్‌లోని రవీంద్ర భారతి మినీ హాల్లో 'శీలావీ శిల్పరేఖలు' (లేపాక్షి, అజంతా, ఎల్లోరా, కోణార్క్, రామప్ప) పుస్తకావిష్కరణ జరుగుతుంది. అలాగే, శీలా వీర్రాజు కవిత్వ పురస్కారం పుప్పాల శ్రీరామ్ (దీర్ఘకవిత 1818)కి, శీలావీ చిత్రకళా పురస్కారం అన్వర్ కు అందజేస్తాము. పురస్కార గ్రహీతలకు రూ.15 వేల నగదు, జ్ఞాపిక అందజేయబడతాయి. కె.శివారెడ్డి, డా.ఎన్.గోపి, వాడ్రేవు చినవీరభద్రుడు, నాళేశ్వరం శంకరం పాల్గొంటారు.

– శీలా సుభద్రాదేవి

'కరోనా' సాహిత్యం వివరాలు పంపండి

'తెలుగు సాహిత్యంలో కరోనా కల్లోలం' అనే అంశంపై కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వశాఖ వారి నుంచి నేను సీనియర్ ఫెలోషిప్‌కు ఎన్నికై పరిశోధన చేస్తున్నాను. ఈ అంశంపై ఇప్పటికే కొన్ని పుస్తకాలను సేకరించాను. ఇంకా నాకు తెలియని అనేక రచనలు ఉండొచ్చు. కనుక కరోనా అంశంగా వివిధ పత్రికల్లో మీరు రాసిన, చదివిన, మీ దృష్టికి వచ్చిన కథ/ కవిత/ నవల/ వ్యాసం, ప్రత్యేక సంపుటాలు, సంకలనాలు తదితర వివరాలను 92474 75975 వాట్సాప్ నెంబరుకు తెలియచేయాల్సిందిగా కోరుతున్నాను.

– చలపాక ప్రకాష్, విజయవాడ

భుజంగరావుకు పల్లా జాతీయ కవితా పురస్కారం -2024

పల్లా జాతీయ కవితా పురస్కారం –2024 ఈ ఏడాది శ్రీకాకుళం జిల్లా బడగాం గ్రామానికి చెందిన కంచరాన భుజంగరావు రచించిన కవితా సంపుటి 'నీటిగింజల పంట'కు లభించింది. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు తెలుగేతర ప్రాంతాలకు చెందిన తెలుగు కవులు కూడా ఈ పురస్కారానికి పోటీ పడ్డారని, గట్టిపోటీ మధ్య న్యాయ నిర్ణేతలు 'నీటిగింజల పంట'ను విజేతగా ఎంపిక చేశారని యువసాహితి వ్యవస్థాపక అధ్యక్షుడు డా.పల్లా కృష్ణ ప్రకటించారు. జూన్ మొదటి వారంలో ప్రొద్దుటూరులో బహుమతి సత్కారం ఉంటుందని తెలిపారు.

కన్నవాళ్ల విలువను చాటే 'ఇంద్రప్రస్థం'

"నాన్న ఉన్న ఇల్లు దానికదే ఒక ఇంద్రప్రస్థం" అన్న మాటతో ఇంద్రప్రస్థం నాటకం ముగుస్తుంది. అభినయ ఆర్ట్స్ గుంటూరు వారు దీన్ని నాటకంగానూ, నాటికగానూ కూడా ప్రదర్శిస్తున్నారు.

నాన్నలో... అమ్మలోని లాలిత్యం మార్దవం కాకుండా కాఠిన్యమే కనబడుతుంది ఎక్కువసార్లు. అందుకే చాలామంది నాన్నను అపార్థం చేసుకుని దూరంగా ఉంటారు, ఉంచుతారు. నిజానికి 'అమ్మ ఒక వంతు నేల అయితే, నాన్న మూడొంతుల సముద్రం' అని తల్లి తన కొడుకుతో అంటుంది ఈ నాటికలో. అటు తల్లిదండ్రులు ప్రేమ, ఆదరణలతో సంతానం భవిష్యత్తు గురించి ఆలోచిస్తారు. నాన్న తన ప్రాణం మాత్రమే తన వద్ద ఉంచుకొని మిగతావన్నీ సంతాన పోషణ, సంరక్షణకే వినియోగిస్తాడు. కొన్ని అరుదైన సందర్భాల్లో ప్రాణత్యాగం చేయడానికి కూడా వెనుకంజ వేయడు. జేబులోని ప్రతి రూపాయినీ ముందుగా కొడుకు అవసరాలకే వెచ్చిస్తాడు.

ఇంద్రప్రస్థం నాటిక/ నాటకంలో భార్యాభర్తలు సర్వేశ్వర రావు, సౌభాగ్యవతి, వారి కొడుకు సందీప్, ఆ కొడుకును ప్రేమించిన యువతి సౌందర్య, ఆమె తండ్రి సుభద్రయ్య పాత్రలు. ఒక సస్పెన్స్ థ్రిల్లర్ని మించిన కథాగమనంతో సాగే సాంఘిక నాటకం ఇది. సీనియర్ రచయిత, పలుసార్లు తన రచనలకు బహుమతులు పొందిన స్నిగ్ధ (గోపి సత్యప్రకాష్) ఈ నాటక రచయిత. ఆకాశమంత నాన్న ప్రేమను ప్రేక్షకుల హృదయాలకు అత్యంత సమీపంగా తీసుకొచ్చిన రచన ఇంద్రప్రస్థం.

నాన్నను సాధారణంగా చాలామంది అపార్థమే చేసుకుంటారు. కారణం వారి వారి వయసుకు తగ్గట్టుగా పెరుగుతుండే వారి ఆర్థిక అవసరాలు. ఈ తరం ఆడపిల్లల అవసరాలు మగ పిల్లలతో సమానంగా పెరిగినా, నాన్న హృదయాన్ని అర్థం చేసుకొని వ్యవహరిస్తుండడం వల్ల ఆ ఇద్దరి మధ్య అంతగా సంఘర్షణాయుత వాతావరణం కనబడదు. ఈ నాటకంలో... ప్రేమలో పడ్డ యువతి తన ప్రేమను కాదన్నందుకు ఆవేశంలో తండ్రిని అపార్థం చేసుకుని, ఇంటి నుంచి పారిపోదామన్న ప్రేమికుడితో చేయి కలుపుతుంది. రైలెక్కి పారిపోవడానికి సిద్ధంగా ఉన్న ఆ జంటకు ... ఏ ఆధారమూ లేకుండా ఇంటి నుంచి పారిపోతే ఎదురయ్యే పరిస్థితుల గురించి తండ్రి సర్వేశ్వరరావు ప్రస్తావించగా, ఆ ప్రయత్నం విరమించుకుంటారు. ఇక్కడ నుంచే నాటకం అనేక ఆసక్తికర మలుపులు తిరుగుతుంది.

ఆర్థిక స్థిరత్వం సాధించకుండా ఇంటి నుంచి దొంగిలించిన నగదు, ఒంటి మీద బంగారాన్ని నమ్ముకుని ఎగిరిపోవాలనుకుంటే, ఆపై అనుక్షణం ఎదురయ్యే ఆర్థిక అవసరాలు వారి ప్రేమకు– కనీస అవసరాలకు మధ్య ఘర్షణ నిత్యం కఠిన పరీక్షకు గురిచేస్తాయి అన్న నగ్న సత్యాన్ని ప్రతి సన్నివేశంలో ప్రేక్షకుల కళ్ళ ముందు దృశ్యమానం చేశారు. ఒక సంవత్సర కాలం ఆ ప్రేమికులిద్దరూ తన ఇంట్లోనే వేర్వేరు గదుల్లో ఉంటూ వారి భోజనం, నిత్య అవసరాలు వారే సమకూర్చుకోవాలని, లేదా అందుకు డబ్బు చెల్లిస్తుండాలన్న షరతుతో పాటు మరికొన్ని షరతులు పెట్టటం కొడుకు సందీప్‌కు మింగుడు పడదు. మరోపక్క సౌందర్య తన ప్రేమకు అంగీకారం తెలపలేదన్న తండ్రి పట్ల పెంచుకున్న ద్వేష భావం తొలగిపోయేలా చేస్తాడు సర్వేశ్వర రావు.

ఒక ఫ్లాష్ బ్యాక్ సంఘటన ద్వారా సర్వేశ్వరరావు దంపతులు – తమ కూతురు జీవితంలో జరిగిన విషాద ప్రేమ కథను చెప్పడం ద్వారా సౌందర్యలో మార్పు వస్తుంది. తను ప్రేమించిన సందీప్ ఎంత స్వార్థంగా ఆలోచించిందీ ఆమెకు అర్థం కావడం మొదలవుతుంది. తన అభిప్రాయం తెలుసుకోకుండా సందీప్ తన మెడలో తాళి కట్టడం, అత్తమామలు కోడలిని హింసిస్తున్నారన్న నెపంతో గృహహింస చట్టం కింద అరెస్టు చేయించి జైలు పాలు చేయిస్తామనడంతో ఆమెకు అతడి తత్వం అర్థమవుతుంది. తాము దుడుకుదనంతో వ్యవహరించి, ఇరువైపులా తల్లిదండ్రుల మనసులను ఎంతగా హింసపెట్టిందీ గ్రహిస్తుంది. అత్తమామలకు కన్నబిడ్డగా మారిపోతుంది. సందీప్ వైఖరిలో కూడా మార్పు వస్తుంది. ఆవేశమే తప్ప ఆలోచన లేని తానెంత అమానవీయంగా, ప్రేమమూర్తులు అయిన తమ కన్న తల్లితండ్రులను క్షోభ పెట్టిందీ గ్రహించి, వాళ్ళ కాళ్లపై పడి క్షమాపణలు కోరుకోవడంతో కథ సుఖాంతం అవుతుంది.

ఈ నాటక కథాకథనం నిండా సూటిగా గుండెలను తాకే సంభాషణలు ప్రేక్షకుల్ని ఆసాంతం ఉద్విగ్నభరితంగా పట్టి ఉంచుతాయి. రంగస్థలం యొక్క పూర్తి శక్తి సామర్థ్యాలను వినియోగించుకుంటూ రచయిత ఎంచుకున్న మార్గం ప్రతి మలుపులోనూ ప్రేక్షకుడి హృదయాన్ని గెలుచుకుంటుంది. వైవిధ్యవంతమైన నాటికలను తెలుగు ప్రేక్షకులకు అందించిన ఎన్ రవీందర్ రెడ్డి ఒక సాంఘిక ఇతివృత్తాన్ని ప్రేక్షకులు దృష్టి మరల్చుకోనీకుండా నిర్వహించిన తీరు ప్రశంసనీయం. కుటుంబ జీవితంలో రక్తసంబంధాలు, సంస్కారం, ప్రవర్తన, నడవడిక, యవ్వన ఉద్రేకాలు అనే ఫ్రేమ్‌లో, పరిమిత వస్తువే అయినా దాన్ని బిగువైన కథాగమనంతో బంధించి నడపడం అభినందనీయం. విషయ వస్తువులో బలం ఉంటే, చెప్పే తీరు కన్విన్సింగా, రియలిస్టిక్‌గా ఉంటే ఆ నాటకానికి ప్రేక్షక ఆదరణ ఎంతగా లభిస్తుందో చెప్పడానికి 'ఇంద్రప్రస్థం' రంగస్థల ప్రదర్శన ఒక చక్కని ఉదాహరణ.

– మల్లేశ్వరరావు ఆకుల
79818 72655

రాహుల్, అఖిలేష్ సభకు పోటెత్తిన జనం

తొక్కిసలాట భయంతో ప్రసంగించకుండానే వెనుదిరిగిన నేతలు

లక్నో : కాంగ్రెస్ నాయకులు రాహుల్‌గాంధీ, సమాజ్ వాదీ పార్టీ అధ్యక్షులు అఖిలేష్ యాదవ్ సంయుక్తంగా పాల్గొంటున్న బహిరంగ సభకు జనం పోటెత్తారు. భద్రతా సిబ్బంది ఏర్పాటు చేసిన బ్యారికేడ్లు విరుచుకుంటూ నాయకులను చూసేందుకు అభిమానంతో ఎగబడ్డారు. భారీగా హాజరైన జనాన్ని చూసిన ఇద్దరూ నాయకులు ముందుగా సంతోషించినా.. తొక్కిసలాట జరుగుతుందనే భయంతో సభలో ఎక్కువ సేపు ఉండకుండా, ప్రసంగించకుండానే వెనుదిరిగారు. ఈ సంఘటన ఉత్తరప్రదేశ్‌లోని ప్రయగ్‌రాజ్ జిల్లాలో ఫుల్పార్ పట్టణంలో జరిగింది. రాహుల్, అఖిలేష్ వేదిక వద్దకు చేరుకోగానే కాంగ్రెస్, ఎస్‌పి మద్దతుదారులు తమ నాయకులను చూడ్డానికి ఎగబడ్డారు. నిర్వాహకులు ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా జనం వెనక్కితగ్గలేదు. దీంతో రాహుల్, అఖిలేష్ కొద్దిసమయం ఒకరితో ఒకరు చర్చించుకుని వేదిక నుంచి వెళ్లిపోయారు. నాయకులు ఇద్దరికీ భద్రతా సిబ్బంది వలయంగా ఏర్పడి వారిని సభ నుంచి బయటకు పంపించారు.

ఫుల్పార్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేస్తున్న ఎస్‌పి అభ్యర్థి అమర్‌నాథ్‌కు మద్దతుగా ఈ సభ జరగాల్సి ఉంది. రాహుల్-అఖిలేష్ యాదవ్ సభకు వచ్చిన భారీ జనాన్ని చూసి బిజెపిలో ఆందోళన మొదలైందని కాంగ్రెస్, ఎస్‌పి నాయకులు వ్యాఖ్యానించారు. ఇండియా వేదికకు ప్రజల్లో ఉన్న ఆదరణకు ఇది నిదర్శనమని అన్నారు.

నేడు ఐదో దశ పోలింగ్

- 8 రాష్ట్రాల్లో 49 లోక్‌సభ స్థానాలు
- 8.95 కోట్ల ఓటర్లు..

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఐదో దశ పోలింగ్‌కు సర్వసిద్ధమైంది. దేశవ్యాప్తంగా ఎనిమిది రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో 49 లోక్‌సభ స్థానాలకు సోమవారం పోలింగ్ జరగనుంది. ఒడిశాలో 35 అసెంబ్లీ స్థానాలకు కూడా పోలింగ్ జరగనుంది. ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరగనుంది. ఈ దశలో మొత్తం 8.35 కోట్ల ఓటర్లు తమ ఓటు హక్కును ఉపయోగించుకోనున్నారు. 94,732 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు కేంద్ర ఎన్నికల సంఘం తెలిపింది. 49 లోక్‌సభ స్థానాల్లో 39 జనరల్, 3 ఎస్‌టి, 7 ఎస్‌సి స్థానాలున్నాయి. ఒడిశాలోని 35 అసెంబ్లీ స్థానాల్లో 21 జనరల్, 8 ఎస్‌టి, 6 ఎస్‌సి స్థానాలున్నాయి. 10 రాష్ట్రాల్లో 1,717 అభ్యర్థులు లోక్‌సభకు పోటీ చేస్తున్నారు. దేశ వ్యాప్తంగా 8.95 కోట్ల మంది ఓటర్లుండగా, 4.69 కోట్ల మంది పురుషులు, 4.26 కోట్ల మహిళలు, 5,409 మంది ట్రాన్స్ జెండర్లు ఉన్నారు. 7.81 లక్షల మంది 85 ఏళ్లు పైబడిన వారు, 24,792 మంది వందేళ్ల పైబడిన వారున్నారు. 7.03 లక్షల మంది వికలాంగ ఓటర్లున్నారు. 94,732 పోలింగ్ కేంద్రాలు వుండగా, వాటిలో 9.47 లక్షల పోలింగ్ అధికారులు బాధ్యతలు నిర్వహించనున్నారు. దేశ వ్యాప్తంగా 153 మంది పరిశీలకులున్నారు. 2 వేల మంది ఫ్లయింగ్ స్క్వాడ్స్, 2,105 మంది స్టాటిక్ సర్వేలెన్స్ టీమ్స్, 881 వీడియో సర్వేలెన్స్ టీమ్స్, 502 వీడియో వ్యూవింగ్ టీమ్స్ ఎన్నికల పనుల్లో ఉన్నాయి.

మధ్యప్రదేశ్‌లో ఘోరం

- దళిత దంపతులపై దాష్టీకం
- స్తంభానికి కట్టేసి కొట్టి, చెప్పుల దండలతో ఊరేగింపు

అశోక్‌నగర్ : వృద్ధులైన దళిత దంపతులపై కొందరు వ్యక్తులు దాష్టీకానికి పాల్పడ్డారు. స్తంభానికి కట్టేసి కొట్టడంతోపాటు చెప్పుల దండలు వేసి ఊరేగించిన ఘటన మధ్యప్రదేశ్‌లోని అశోక్‌నగర్‌లో చోటుచేసుకుంది. ముంగవోలి పోలీస్ స్టేషన్ ఇన్‌ఛార్జి గబ్బర్‌సింగ్ గుర్జార్ ఆదివారం తెలిపిన వివరాల ప్రకారం కిలోరా గ్రామానికి చెందిన వృద్ధ దంపతుల కొడుకు నిందితులలోని ఓ వ్యక్తి భార్యపై ఈవ్ టీజింగ్‌కు పాల్పడ్డాడు. ఈ ఘటన జరిగిన తరువాత ఆ కుటుంబం గ్రామం నుంచి వెళ్లిపోయింది. దళిత దంపతులిద్దరూ గ్రామానికి ఇటీవల వచ్చారు. ఈ విషయం తెలిసిన నిందితులు శుక్రవారం ఒక్కసారిగా వారిపై దాడికి పాల్పడ్డారు. 65 ఏళ్ల వృద్ధుడు, 60 ఏళ్ల మహిళ అన్న కనికరం కూడా లేకుండా వారిద్దరినీ స్తంభానికి కట్టేసి కొట్టారు. ఆ తరువాత చెప్పుల దండలు వేసి ఊరేగించారు. బాధిత మహిళ ఫిర్యాదు మేరకు 10 మంది నిందితులపై శనివారం ఎస్‌సి, ఎస్‌టి అత్యాచారాల నిరోధక చట్టంలోని సెక్షన్ల ప్రకారం కేసు నమోదు చేసినట్లు గబ్బర్‌సింగ్ తెలిపారు. నిందితులు పరారీలో ఉన్నారని, వారి కోసం గాలింపు చర్యలు చేపట్టామని చెప్పారు.

కేజ్రీవాల్ నివాసం నుంచి సిసిటివి ఫుటేజ్ స్వాధీనం

న్యూఢిల్లీ : స్వాతిమాలివాల్‌పై దాడి కేసు విచారణలో భాగంగా ఢిల్లీ సిఎం కేజ్రీవాల్ నివాసం నుంచి సిసిటివి ఫుటేజ్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సిసిటివి కెమెరాల యొక్క డివిఆర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు ఆదివారం తెలిపారు. ఈ నెల 13న సిఎం నివాసంలో వేచిచూస్తున్న సమయంలో కేజ్రీవాల్ వ్యక్తిగత కార్యదర్శి భిభవ్‌కుమార్ తనపై దాడి చేశాడని ఆప్ రాజ్యసభ ఎంపి స్వాతి మాలివాల్ ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే.

ఆఫ్ఘన్‌లో ఆకస్మిక వరదలు

- 68 మంది మృతి

కాబూల్ : భారీ వర్షాల కారణంగా ఆఫ్ఘనిస్థాన్‌లో సంభవించిన తాజా ఆకస్మిక వరదల్లో 68 మంది మృతి చెందారు. ఈ విషయాన్ని తాలిబాన్ ప్రతినిధి ఆదివారం వెల్లడించారు. ఫర్యాబ్ ప్రావిన్స్‌లోని మూడు జిల్లాల్లో శనివారం రాత్రి ఆకస్మిక వరదలు సంభవించి 18 మంది వరకూ మరణించారని, అనేక ఇళ్లు, వ్యవసాయ భూములు ధ్వంసమయ్యాయని అధికారులు తెలిపారు. ఇవి ప్రాథమిక గణాంకాలే అని అధికారులు చెప్పారు. అలాగే ఘోర్ ప్రావిన్స్‌లో 50 మంది మరణించారు. ఆఫ్ఘనిస్థాన్‌లో గతవారం భారీ వర్షాల కారణంగా 300 మందికి పైగా మరణించారు. ఏప్రిల్ నెలలో 70 మంది మరణించారు.

జీ హుజూర్...!

- కీలక అంశాలపై ప్రశ్నలే లేవు
- అబద్ధం చెప్పినా 'ఐతే ఓకే'
- అసత్యాలు, ప్రత్యారోపణలతో సరి
- ఎదురు దాడితో తప్పించుకునే ప్రయత్నం
- ఇదీ మోడీ ఇంటర్వ్యూల తీరు

న్యూఢిల్లీ : ప్రధాని నరేంద్ర మోడీ మార్చి 31 నుండి ఈ నెల 14 వరకూ వివిధ పత్రికలు, న్యూస్ ఛానల్స్‌కు 41 ఇంటర్వ్యూలు ఇచ్చారు. ఈ ఇంటర్వ్యూల్లో ఆయనకు ఎదురైన క్లిష్టతరమైన ప్రశ్నలు చాలా తక్కువ. న్యూస్ 18కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయనకు ఓ క్లిష్టమైన ప్రశ్న ఎదురైంది. రాజస్థాన్‌లోని బన్స్వారాలో జరిగిన ర్యాలీలో ముస్లిములకు వ్యతిరేకంగా మోడీ చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన ప్రశ్న అది. 'అధిక సంతానం' అనే మాట తాను కేవలం ముస్లిములను ఉద్దేశించి మాత్రమే చెప్పలేదని ప్రధాని బదులిచ్చారు. 'అన్ని పేద కుటుంబాలలోనూ సంతానం ఎక్కువగానే ఉంటుంది. వారు తమ పిల్లలను విద్యావంతులను చేయలేరు. పేదరికం ఎక్కడ ఉంటుందో అధిక సంతానం అక్కడ కన్పిస్తుంది' అని సెలవిచ్చారు. తాను హిందువులు లేక ముస్లింలు అని చెప్పలేదని బుకాయించారు. చొరబాటుదారులంటే ఎవరని ఇంటర్వ్యూ చేసిన వ్యక్తి అడిగే సాహసం చేయలేదు. మోడీ చెప్పనూ లేదు.

ఈ అంశాలపై ప్రశ్నలేవి?

పాత్రికేయులతో ముచ్చటించేటప్పుడు మోడీ ఎక్కువగా తన 'మూడో పదవీకాలం' గురించే కాకుండా 2047 నాటికి భారత్ విజన్‌పై కూడా మాట్లాడారు. పది సంవత్సరాల పాలనలో మీ ట్రాక్ రికార్డు ఏమిటని ఒక్క పాత్రికేయుడు కూడా ప్రశ్నించలేదు. ప్రధాని 41 ఇంటర్వ్యూలు ఇచ్చినప్పటికీ కోవిడ్‌ను ఎదుర్కోవడంలో మోడీ అసమర్థ నిర్వాకాన్ని గురించి అడిగిన వారు లేరు. దేశంలో ముస్లిములపై జరుగుతున్న హింసను కూడా వారు ప్రస్తావించలేదు. 'అస్సాం ట్రిబ్యూన్' పత్రిక ఇంటర్వ్యూలో మాత్రం మణిపూర్ హింసపై ప్రశ్నించారు.

స్థానిక సమస్యల పైనా అంతే

తంతి టీవీ, ఎఎన్‌ఐ, రాజస్థాన్ పత్రిక, దివ్య భాస్కర్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఎన్నికల బాండ్ల వివాదంపై మోడీని ప్రశ్నించారు. ఇక జెడిఎస్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ అత్యాచాల వీడియో వెలుగులోకి వచ్చిన తర్వాత మోడీ 29 ఇంటర్వ్యూలు ఇచ్చారు. ప్రజ్వల్ వ్యవహారంపై కేవలం మూడు ఇంటర్వ్యూల్లో మాత్రమే (టైమ్స్ నౌ ఛానల్, హిందీ

పత్రిక హిందుస్థాన్, ఆంగ్ల పత్రిక హిందుస్థాన్ టైమ్స్) ప్రశ్నించారు. ప్రాంతీయ మీడియా సంస్థలు తమ రాష్ట్రాలకు సంబంధించిన అంశాలను లేవనెత్తడంలో విఫలమయ్యాయి. ఉత్తరాఖండ్‌కు చెందిన స్థానిక హిందీ పత్రికలు అమర్ ఉజాలా, హిందుస్థాన్ వివాదాస్పద అగ్నిపథ్‌పై ఎలాంటి ప్రశ్నలు అడగలేదు. ఈ రాష్ట్రం నుండి పెద్ద ఎత్తున యువత సైన్యంలో చేరుతుంది. అసోం, బెంగాల్ రాష్ట్రాల్లో సిఎఎ కీలకమైన ఎన్నికల అంశంగా మారింది. గుజరాత్‌కు చెందిన ఆరు వార్తా సంస్థలు మోడీని ఇంటర్వ్యూ చేశాయి. రాష్ట్ర బిజెపిలో నెలకొన్న విభేదాలపై ఒక్కరు కూడా ఆయన్ని ప్రశ్నలు అడగలేదు.

తప్పుని చెబితే ఎదురు దాడే

ఇంటర్వ్యూల్లో మోడీ తప్పుడు వాదనలు వినిపించినా, తప్పుడు సమాచారం ఇచ్చినా పాత్రికేయులు వాటిని ఎలాంటి పరిశీలన చేయకుండా గుడ్డిగా క్యారీ చేశారు. ప్రజ్వల్ ఉదంతాన్ని ప్రస్తావిస్తే అలాంటి వాటిని తాను సహించబోనని చెబుతూనే కాంగ్రెస్ పార్టీ గతంలో ప్రజ్వల్ రేవణ్ణ పార్టీతో సంబంధాలు పెట్టుకున్నదని సమస్యను పక్కదారి పట్టించే యత్నం చేశారు. జెడిఎస్‌తో పొత్తు విషయంలో బిజెపి నేతలు చేస్తున్న హెచ్చరికలను కూడా ఎవరూ ప్రస్తావించలేదు.

అబద్ధాలు... అభాండాలు

మత ప్రాతిపదికన విద్యాసంస్థలు, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించడం ప్రమాదకరం కాదా? అని ఓ పాత్రికేయుడు ప్రశ్నిస్తే ఈ అంశం కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ఉన్నదని అబద్ధం చెప్పారు. రాజ్యాంగాన్ని మార్చడానికి బిజెపి 400కు పైగా స్థానాలు కోరుకుంటోందని ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణను టివి9 నెట్‌వర్క్ పాత్రికేయులు ప్రస్తావించినప్పుడు మోడీ సుదీర్ఘమైన సమాధానం ఇస్తూ రాజ్యాంగాన్ని కాంగ్రెస్ పార్టీ అనేక సందర్భాల్లో నీరుకార్చిందని ఆరోపించారు. అత్యధిక మెజారిటీ ఇస్తే రాజ్యాంగాన్ని మారుస్తామని నలుగురు బిజెపి నాయకులు బాహాటంగా చెప్పడాన్ని ఎవరూ గుర్తు చేయలేదు. ఎన్నికల బాండ్లపై కేవలం నాలుగు ఇంటర్వ్యూల్లో మాత్రమే మోడీని ప్రశ్నించగా, ఆయన ఆ పథకాన్ని సమర్థించారు. ఎన్నికల బాండ్ల పథకం ద్వారా కార్పొరేట్ సంస్థలు, బిజెపి మధ్య చోటుచేసుకున్న క్విడ్‌ప్రోకో సంబంధాలపై మోడీని ఎవరూ ఏమీ అడగలేదు.

అది ప్రజల నినాదమేనట

మోడీ ఇంటర్వ్యూల్లో తరచూ వినిపించిన మరో పదం '400 ప్లస్'. బిజెపి కార్యకర్తలకు ఆత్మసంతృప్తి కలిగించేందుకే మోడీ ఈ నినాదాన్ని ఎత్తుకున్నారన్న విమర్శలు వచ్చాయి. అయితే అలాంటిదేమీ లేదని ప్రధాని చెప్పుకొచ్చారు. ఎన్డీయేకు ఇప్పటికే 400కు పైగా స్థానాలు ఉన్నాయని అంటూ '2019లో ఎన్డీయే సుమారు 359 స్థానాలు గెలుచుకుంది. ఆంధ్రప్రదేశ్, ఒడిషా రాష్ట్రాలకు చెందిన రాజకీయ పార్టీలు మా వైపే ఉన్నాయి. అంటే మరో 35 స్థానాలు కలిశాయి. ఈశాన్య ప్రాంతం ఎంపీలు కూడా మా పక్షానే ఉన్నారు' అని వివరించారు.

దక్షిణాదిపై ఫోకస్

మోడీ తన ఇంటర్వ్యూల్లో దక్షిణాది మీడియా సంస్థలకు ప్రాధాన్యత ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, కేరళ, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన ఏడు సంస్థలకు ఆయన ఇంటర్వ్యూలు ఇచ్చారు. గుజరాత్ తర్వాత ఆయన ఎక్కువగా దృష్టి సారించింది దక్షిణాది పైనే.

ఇస్కాన్, రామకృష్ణ మిషన్‌పై మమతా అసత్య ప్రచారం : మోడీ

కోల్‌కతా: ముస్లింలు, చొరబాటు దారులను రక్షించడానికే ఇస్కాన్, రామకృష్ణ మిషన్, భారత్ సేవాశ్రమ్ వంటి సంస్థలపై పశ్చిమ బెంగాల్ సిఎం మమతా బెనర్జీ అసత్య ప్రచారం చేస్తున్నారని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆరోపించారు. ఆదివారం పశ్చిమ మిడ్నాపూర్ జిల్లా ఖరగ్‌పూర్ సభలో ఆయన మాట్లాడుతూ బెంగాల్ సంస్కృతిని, వారసత్వాన్ని టిఎంసి అవమానిస్తోందని విమర్శించారు. ముస్లిం ఓట్ల కోసం మాత్రమే వారు ఈవిధంగా మాట్లాడుతున్నారని ఆరోపించారు. చొరబాటుదారులతో బెంగాల్‌కు భారీ ముప్పు పొంచి ఉందని అన్నారు. 'చొరబాట్లు జనాభాలో సమతుల్యతను దెబ్బతీస్తున్నాయి. అనేక ప్రాంతాల్లో హిందువులు మైనార్టీలుగా మారారు. ఎస్‌టి, ఎస్‌సి భూములను చొరబాటుదారులు కబ్జా చేస్తున్నారు. మన సోదరీమణులు, కుమార్తెల భద్రత ప్రమాదంలో పడింది' అని మోడీ చెప్పారు. కాగా, శనివారం మోడీ హుగ్లీ జిల్లాలో ప్రచారంలో పాల్గొన్నారు.

రోజుకో అబద్ధం.. గంటకో విద్వేష బీజం..

- ప్రధాని మోడీపై స్టాలిన్ ఆగ్రహం

చెన్నై : రాష్ట్రాల మధ్య ఘర్షణలు రేపేందుకు ప్రధాని నరేంద్ర మోడీ చౌకబారు ఎత్తుగడలు అవలంబిస్తున్నారని తమిళనాడు ముఖ్యమంత్రి, డిఎంకె అధ్యక్షుడు ఎంకె స్టాలిన్ విమర్శించారు. ఎన్నికల సందర్భంగా మత విద్వేషాలను రెచ్చగొట్టేలా మోడీ ప్రచారం చేస్తున్నారని, అయితే అది బిజెపికి ఏమీ ఉపయోగపడదని అన్నారు. 'ప్రధాని బాధ్యతారాహిత్యమైన ప్రసంగాలు చేస్తున్నారు. వాటిని అడ్డుకోవడంలో ఎన్నికల కమిషన్ విఫలమవుతోంది. వీటన్నింటినీ దేశ పౌరులందరూ దిగ్భ్రాంతితో, నిస్పృహతో చూస్తున్నారు' అని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

మోడీ ఊహాజనిత కథలు, పుట్టెడు అబద్ధాలు వల్లె వేస్తున్నారని స్టాలిన్ ఎద్దేవా చేశారు. ఉత్తరప్రదేశ్ ప్రజలను ఉద్దేశించి దక్షిణాది ప్రజలు అమర్యాదకరంగా మాట్లాడుతున్నారంటూ మోడీ చేసిన ఆరోపణను ఆయన తోసిపుచ్చారు. ప్రధాని పదవి హుందాతనాన్ని మోడీ మరచిపోయారని, ప్రతి రోజూ ఒక కొత్త అబద్ధం చెబుతున్నారని, గంట గంటకూ విద్వేషపు విత్తనాలు నాటుతున్నారని విమర్శించారు. వెనుకబడిన తరగతులు, అణగారిన వర్గాలు, షెడ్యూల్డ్ కులాల రిజర్వేషన్లపై అమలులో ఉన్న 50% పరిమితిని ఎత్తివేయాలని తమిళనాడు, సామాజిక న్యాయం కోసం పనిచేసే రాజకీయ పార్టీలు డిమాండ్ చేశాయని గుర్తు చేశారు. ఈ డిమాండ్‌ను ఇప్పుడు జాతీయ స్థాయిలో లేవనెత్తుతున్నామని, దీనికి

కాంగ్రెస్, ఇండియా బ్లాక్ మద్దతు ఇచ్చాయని చెప్పారు. 'ఉత్తరప్రదేశ్ ప్రజలకు ప్రయోజనకరంగా ఉండే ఈ విషయంపై ప్రధాని ఎప్పుడైనా మాట్లాడారా? ఏదైనా గ్యారంటీ ఇచ్చారా?. లేదు. కానీ ఆయన విద్వేషాలను త్వరగా వ్యాప్తి చేయడంలో నిమగ్నమయ్యారు' అని స్టాలిన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నకిలీ వార్తలను బిజెపి సమర్థిస్తోందని, ప్రోత్సహిస్తోందని ఆరోపిస్తూ యూట్యూబర్ మనీష్ కశ్యప్ ఉదంతాన్ని ప్రస్తావించారు. మోడీ విద్వేష ప్రచారం విఫలమైందని, తన పది సంవత్సరాల పాలన గురించి ఆయనకు చెప్పుకునేందుకు ఏమీ లేదని అన్నారు. ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల్లో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రధాని నీరుకారిస్తే పేదలకు శత్రువుగా మారిపోతారని చెప్పారు. తమిళనాడులో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించేందుకు ఉద్దేశించిన పథకం కారణంగా మెట్రో రైళ్లలో ప్రయాణికుల సంఖ్య తగ్గిందంటూ ప్రధాని చేసిన వ్యాఖ్యను స్టాలిన్ ప్రస్తావిస్తూ ఈ పథకం ప్రతిరోజూ లక్షలాది మంది ప్రజలకు ఉపయోగపడుతోందని తెలిపారు. మోడీ ప్రసంగాలు వింటే వాటిలో కిలో గ్రామ్ నిజానికి ఎంత ఖరీదో అన్న ఆశ్చర్యం కలుగుతుందని స్టాలిన్ వ్యాఖ్యానించారు.

సెంట్రల్ గాజాపై దాడిలో 20 మంది మృతి

గాజాసిటీ: నెతన్యాహు తన సొంత వార్ క్యాబినెట్ నుండి విమర్శలను ఎదుర్కొంటున్నారు. ఆయన . ప్రధాన రాజకీయ ప్రత్యర్థి బెన్నీ గాంట్జ్, యుద్ధానంతర గాజాపై అంతర్జాతీయ పరిపాలనతో కూడిన ప్రణాళికను జూన్ 8 నాటికల్లా రూపొందించకపోతే ప్రభుత్వం నుంచి వైదొలగుతానని హెచ్చరించారు.. మరో వైపు సెంట్రల్ గాజాపై ఇజ్రాయిల్ దాడులు ఆదివారం కూడా కొనసాగాయి. ఈ దాడుల్లో గడచిన 24 గంటల్లో 20 మంది దాకా చనిపోయారు. వీరిలో మహిళలు , పిల్లలే ఎక్కువగా ఉన్నారు.

నెతన్యాహుకు బెన్నీ గాంట్జ్ ఇచ్చిన అల్టిమేటంతో నెతన్యాహు ఇరకాటంలో పడ్డారు. . గాంట్జ్ మద్దతు ఉపసంహరణ వల్ల ఆయన నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వానికి ప్రస్తుతానికి ఢోకా ఉండకపోవచ్చు.కానీ, దీని పర్యవసానాలు మున్ముందు చాలా తీవ్రంగా ఉండే అవకాశముందని పరిశీలకులు పేర్కొంటున్నారు. ఇప్పుడే గనుక ఎన్నికలు జరిగితే నెతన్యాహుకు గాంట్జ్ చేతిలో ఓటమి ఖాయమని పలు ఒపీనియన్ పోల్స్ చెబుతున్నాయి. అప్పుడు అవినీతి కేసుల్లో నెతన్యాహు జీవితాంతం జైలు ఊచలు లెక్కబెట్టుకోవాల్సిన పరిస్థితి వస్తుందని పరిశీలకులు చెబుతున్నారు. తాజా పరిస్థితిపై .. అమెరికా జాతీయ భద్రతా సలహాదారు జేక్ సులివాన్ ఇజ్రాయెల్ అగ్ర నాయకుల నుంచి ఎప్పటికప్పుడు అడిగి వివరాలు తెలుసుకుంటున్నారు. గత ఏడు మాసాల్లో భారీగా బాంబు దాడికి గురైన ఉత్తర గాజాలోని కొన్ని ప్రాంతాలను హమాస్ తిరిగి తన అధీనంలోకి తెచ్చుకుంది. .1948 అరబ్-ఇజ్రాయెల్ యుద్ధం తరువాత సెంట్రల్ గాజాలో నెలకొల్పిన శరణార్థి శిబిరం నుసిరత్‌పై జరిగిన వైమానిక దాడిలో ఎనిమిది మంది మహిళలు, నలుగురు పిల్లలతో సహా 20 మంది చనిపోయారు. జబాలియా శరణార్థి శిబిరం, ఆ చుట్టుపక్కల నివాస ప్రాంతాలపై ఇజ్రాయిల్ సైన్యం పెద్దయెత్తున విరుచుకుపడుతోందని, పరిస్థితి అత్యంత క్లిష్టంగా ఉందని జబాలియాకు చెందిన 48 ఏళ్ల అబ్దెల్-కరీమ్ రద్వాన్ పేర్కొన్నారు. జబాలియా శిబిరంపై ఇజ్రాయెల్ దాడులు ప్రారంభించినప్పటి ఇప్పటివరకు 150 మందికిపైగా మృతదేహాలను భవన శిథిలాల మధ్య నుంచి వెలికి తీసినట్లు సివిల్ డిఫెన్స్ ప్రతినిధి మహమూద్ బస్సల్ చెప్పారు. ఇంకోవైపు గాజాకు సంఘీభావంగా ప్రపంచ వ్యాపితంగా ప్రదర్శనలు జరుగుతున్నాయి.

ఉత్తర గాజాలోని జబాలియా శరణార్థి శిబిరంపై ఇజ్రాయెల్ దాడికి పాల్పడడంతో ఆ ప్రాంతంలో దట్టమైన పొగలు పైకి లేచిన దృశ్యం

సింగపూర్‌లో కోవిడ్ కేసులు రెట్టింపు

సింగపూర్ సిటీ : వారం రోజుల వ్యవధిలోనే సింగపూర్‌లో కోవిడ్ కేసులు రెట్టింపు కావడం ఆందోళన కలిగిస్తోంది. ఈ నెల 5 నాటికి 13,700గా ఉన్న కేసుల సంఖ్య ఈ నెల 11 నాటికి 25,900కు చేరుకున్నాయి. రోజుకు ఆసుపత్రిలో చేరే వారి సంఖ్య 181 నుంచి 250కు చేరుకుంది. అయితే ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (ఐసియు)లో చేరే కేసులు సంఖ్య తక్కువగానే ఉండటం కొంచెం ఉపశమనం కలిగిస్తుంది. కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ఆసుపత్రుల సామర్థ్యాన్ని, ప్రజా ఆసుపత్రుల సంఖ్య పెంచడానికి సింగపూర్ ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. అత్యవసరం కాని సర్జరీలను తగ్గించాలని ఆసుపత్రులకు సూచించింది. ప్రభావం తక్కువగా ఉన్న రోగులను హోమ్ కేర్‌కు లేదా పరివర్తన సంరక్షణ సౌకర్యాల కేంద్రాలకు తరలించాలని సూచించింది. వ్యాక్సినేషన్‌ను పున:ప్రారంభించాలని కూడా ప్రభుత్వం యోచిస్తుంది. ముఖ్యంగా 60 ఏళ్లు దాటిన వారు, దీర్ఘకాలిక రోగులకు ఒకవేళ వారు గత 12 నెలల్లో వ్యాక్సిన్ తీసుకోకపోతే వారికి వ్యాక్సిన్ వేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. బహిరంగ ప్రదేశాల్లో మాస్కులను ధరించాలని ప్రజలకు సింగపూర్ ఆరోగ్య మంత్రి ఓనగ్ యే కుంగ్ విజ్ఞప్తి చేశారు.

UNIMONI FINANCIAL SERVICES LIMITED
RO: N.G. 12 & 13 Ground Floor, North Block, Manipal Centre, Dickenson Road, Bangalore - 560 042. CIN No.U85110KA1995PLC018175

బహిరంగ ప్రకటన

తాకట్టు పెట్టిన బంగారు ఆభరణాల వేలం UNI MONI FINANCIAL SERVICES LIMITED ద్వారా 23.05.2024 ఉదయం 10.00 గంటలకు దిగువ ఇవ్వబడిన సంబంధిత కేంద్రాలలో నిర్వహించబడుతుందని ప్రజలకు తెలియజేస్తున్నాం. వేలం వేయబోయే బంగారు ఆభరణాలు బకాయిలు చెల్లించడంలో విఫలమైన మా వివిధ కస్టమర్ల రుణఖాతాలకు చెందినవి., ఈ రుణ గ్రహీతలకు మా వేలం నోటీసులు సక్రమంగా జారీ చేయబడ్డాయి. మా వివిధ కస్టమర్లు గడువు వ మగిసిన ఋణం తిరిగి చెల్లించనందున వేలం వేయడం జరుగుతుంది. ఈ క్రింద వేలం వేయబడే బంగారు ఆభరణం బ్రాంపేరుతో పేర్కొన్నాం.

Auction Centre Address & Loan Nos: KHAMMAM (KHM - D No 8-3-215, First Floor beside Indus Ind Bank, Wyra Roakhammam, Khammam - 507001, Contact no : 9959617256) 2057684, 2027068, 2027138, 2060224, 2060510, 2060783, 2042907, 2061742, 2024083, 2060925, 2043319, 2060045, 2062347, 2069292, 2061455, 2010258, 2028930, 2029641, 2030307, 2045668, 2046233, 2046555, 2047393, 2048074, 2048346, 2063273, 2063342, 2063464, 2064432, 2064870, 2034742, 2058759, 2033744, 2077049, 2068853, 2083866, 2033467, 2023142, 2049411, 2066252, 2071993, 2081311.

(Reserves the right to alter the number of accounts to be auctioned &/ postpone / cancel the auction without any prior notice.)

भारतीय सेना / INDIAN ARMY
पशु चिकित्सा कोर में अल्प सेवा कमीशन
రీమౌంట్ వెటర్నరీ కార్ప్స్‌లో షార్ట్ సర్వీస్ కమిషన్

भारतीय सेना के पशु चिकित्सा कोर में अल्प सेवा कमीशन हेतु पुरुष/महिला पशु चिकित्सा स्नातकों से संदर्भित नोटिफिकेशन दिनांक 25 अप्रैल 2024 को समाचार पत्र में प्रकाशित किया गया था। अब आवेदन पत्र प्राप्त होने की अंतिम तिथि 20 मई 2024 से बढ़ाकर 03 जून 2024 तक कर दी गई है। विस्तृत नोटिफिकेशन वेबसाईट www.joinindianarmy.nic.in पर उपलब्ध है। यदि कोई पूछताछ करनी हो तो, महानिदेशालय पशु चिकित्सा सेवाएं, क्वार्टर मास्टर जनरल शाखा, एकीकृत मुख्यालय, रक्षा मंत्रालय (थल सेना), पश्चिमी खण्ड-3, आर के पुरम, नई दिल्ली-110066 से लिखित अथवा ई-मेल आई डीः persvet-1779@nic.in में संपर्क किया जा सकता है।

25 ఏప్రిల్ 2024నాటి దినపత్రికల్లో ప్రచురించబడిన ఇండియన్ ఆర్మీ యొక్క **రీమౌంట్ వెటర్నరీ కార్ప్స్** లో షార్ట్ సర్వీస్ కమిషన్ కొరకు వెటర్నరీ పట్టభద్రులైన పురుషులు/స్త్రీలు కొరకు ప్రకటనను దయచేసి చూడండి.

దరఖాస్తు దాఖలుచేయుటకు చివరి తేది **20 మే 2024 నుండి 03 జూన్ 2024.**

नोट :-
1. सेना में भर्ती पूर्णतया पारदर्शी और मुफ्त है। दलालों से सावधान रहें।
2. विस्तृत नोटिफिकेशन और जानकारी के लिए, कृपया www.joinindianarmy.nic.in पर जाएं।

గమనిక: 1.ఆర్మీలో నియామకాలు పూర్తిగా పారదర్శకంగా ఉంటుంది. అవినీతి ఉండదు.
2. ప్రకటన వివరణ కొరకు, దయచేసి దర్శించండి: www.joinindianarmy.nic.in.

CBC 10601/11/0019/2425

టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్
సంప్రదించాల్సిన చిరునామా: 11వ అంతస్తు, టవర్ ఎ, పెనిన్సుల బిజినెస్ పార్కు, గణపత్రావ్ కదం మార్గ్, లోవర్ ప్యారెల్, ముంబయి 400013 సంప్రదించాల్సిన నెం.(022) 61827414, (002) 61827375.

స్వాధీనతా నోటీసు (స్థిరాస్తి కొరకు)
(సెక్యూరిటీ ఇంట్రెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్, 2002 యొక్క రూల్ 8(1) ప్రకారం)

ఏదైతే, దిగువసంతకందారు **టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్** యొక్క అధీకృత అధికారిగా, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని, క్రింద పేర్కొన్న తేదీన డిమాండ్ నోటీసు జారీచేసి, రుణగ్రహీతలను సదరు నోటీసు తేది నుండి 60 రోజుల్లోగా నోటీసులో పేర్కొనబడిన మొత్తాలను తిరిగి చెల్లించవలసిందిగా కోరడమైనది. రుణగ్రహీత, మొత్తాలను తిరిగి చెల్లించుటలో విఫలమైనందున, ప్రత్యేకించి రుణగ్రహీతను మరియు సాధారణ ప్రజలకు ప్రకటన ఇవ్వడమేమనగా, దిగువసంతకందారు సదరు రూల్స్ యొక్క రూల్ 8తో చదువుతూ పేర్కొన్న చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద అతనికి సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ దిగువ వివరించిన ఆస్తిని స్వాధీనం చేసుకోవడమైనది.
ప్రత్యేకించి రుణగ్రహీత, మరియు సాధారణ ప్రజలను హెచ్చరించడమేమనగా, ఆస్తితో లావాదేవీలు జరుపరాదని మరియు ఆస్తితో ఏవేని లావాదేవీలు జరుపుట అనునది, **టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్** వారికి దిగువ పేర్కొన్న మొత్తాలను మరియు డిమాండ్ నోటీసు తేది నుండి దానిపై వడ్డీ మరియు ఫైనల్ వడ్డీ, చార్జీలు, ఖర్చులు మొ॥వాటిని చెల్లించుటకు లోబడి ఉంటుంది.
రుణగ్రహీత జాగ్రత్త వహించవల్సింది ఏమనగా సెక్యూర్డ్ అసెట్స్‌ను విడిపించుకొనుటకు మీకు లభించిన సమయం మేరకు చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) నిబంధనలను అహ్వానించడమైనది.

లోన్ ఎకౌంట్ నం.	ఆబ్లిగర్స్/చట్టబద్ధ వారసులు/ చట్టబద్ధ ప్రతినిధుల పేరు	మొత్తం మరియు డిమాండ్ నోటీసు తేది	భౌతిక స్వాధీనతా తేది
10292671 & 10333437	శ్రీ.ఎస్.శ్రీనివాస్ నోరి (రుణగ్రహీత) మరియు శ్రీమతి. రాంబిల్లి నాగ పల్లవి (సహ-రుణగ్రహీత)	03-06-2023 నాటికి రూ॥42,66,668/- (నలభై రెండు లక్షల అరవై ఆరు వేల ఆరు వందల అరవై ఎనిమిది రూపాయలు మాత్రమే)	16th May, 2024

స్థిరాస్తి షెడ్యూల్: ఆంధ్రప్రదేశ్, పిన్‌కోడ్-520010, కృష్ణాజిల్లా, పటమట సబ్ రిజిస్ట్రీ, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా, విజయవాడ, పటమట (అశోక్ నగర్, మేరీ స్టెల్లా కాలేజి ఎదురు రోడ్డు) వద్ద శ్రీ.నోరి సత్య శ్రీనివాస్ పేరు మీద ఉన్న వైడ్ రిజిస్టర్డ్ సేల్ డీడ్ నం.3172/2014, పాత మూల్యాంకనం నం.34644, కొత్త మూల్యాంకనం నం.263666, బేరింగ్ డో.నం.603019, ఫ్లాట్ మూల్యాంకనం నం.605734, "యజ్ఞవాక్య నివాస్ మరియు మాధవ్ ఎన్‌క్లేవ్"లోని మూడవ అంతస్తులో మొత్తం ఆ ముక్క మరియు పార్సిల్ ఫ్లాట్ నం.టిఎస్-1 తో ప్లింత్ ఏరియా 721 చ.అ.లు., 100 చ.అ.లు. కామన్ ఏరియా మరియు 125 చ.అ.లు. కార్ పార్కింగ్ తో కలిపి ఆర్.ఎస్.నం.8లో ఉమ్మడి విస్తీర్ణం 46.58 చ.గ.లు. బయట మొత్తం విస్తీర్ణం 400.7 చ.గ.లు. మరియు క్రింది విధమైన హద్దులు :**స్థలం సరిహద్దులు :** తూర్పు : సుజనమ్మ ఆస్తి 114.0 లిం.లు., దక్షిణం : ఇతరుల ఆస్తి 73.0 లిం.లు., పడమర : గోగినేని ఉమా మహేశ్వరరావు ఆస్తి 113.0 లిం.లు., ఉత్తరం : మున్సిపల్ కార్పొరేషన్ రోడ్డు 73.0 లిం.లు., **ఫ్లాట్ సరిహద్దులు :** తూర్పు : ఓపెన్ టు స్కై, దక్షిణం : కామన్ కారిడార్, కామన్ మెట్లకేస్, కామన్ లిఫ్ట్, పడమర : ఓపెన్ టు స్కై, ఉత్తరం : ఓపెన్ టు స్కై.

లోన్ ఎకౌంట్ నం.	ఆబ్లిగర్స్/చట్టబద్ధ వారసులు/ చట్టబద్ధ ప్రతినిధుల పేరు	మొత్తం మరియు డిమాండ్ నోటీసు తేది	భౌతిక స్వాధీనతా తేది
9870408	శ్రీ.వెంకటేశ్వరరావు మొంద్రు (రుణగ్రహీత) మరియు మొంద్రు వెంకటేశ్వరరావు కాంట్రాక్ట్స్, శ్రీమతి. మొంద్రు సునీత (సహ రుణగ్రహీత)	05.02.2024 నాటికి మొత్తం రూ.13,39,605/- (పదమూడు లక్షల ముప్పై తొమ్మిది వేల ఆరు వందల ఐదు రూపాయలు మాత్రమే)	17th May, 2024

స్థిరాస్తి షెడ్యూల్ : కృష్ణాజిల్లా, గుడివాడ సబ్ రిజిస్ట్రీ, గుడివాడ మండలం మరియు గుడివాడ మున్సిపల్ ఏరియా, నాగవరప్పాడు గ్రామం వద్ద శ్రీమతి. మొంద్రు సునీత పేరు మీద ఉన్న వైడ్ రిజిస్టర్డ్ సేల్ డీడ్ నం.896/2017 ఆర్.ఎస్.నం.193/2లో మొత్తం ఆ ముక్క మరియు పార్సిల్ సైట్ విస్తీర్ణం 145.2 చ.గ.లు. మరియు క్రింది విధమైన **హద్దులు :** తూర్పు : గంట నిర్మల కుమారికి చెందిన సైట్ 42.6 చ.అ.లు., దక్షిణం : అరికిపాటి ఏసమ్మకి చెందిన సైట్ మరియు ఇల్లు 29.6 చ.అ.లు., పడమర : మున్సిపల్ రోడ్డు 45.0 చ.అ.లు., ఉత్తరం : మలిరెడ్డి విజయ రామిరెడ్డి మరియు నాయుడుకు చెందిన సైట్ 30.0 చ.అ.లు. ఈ సరిహద్దుల ఖాళీ సైట్ విస్తీర్ణం 145.2 చ.గ.లు., 121.40 చ.మీ.లు.

ప్రదేశం: విజయవాడ
తేది: 20.05.2024
సం/- అధీకృత అధికారి
టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ తరపున

बैंक ऑफ़ बड़ौदा Bank of Baroda
బ్యాంక్ ఆఫ్ బరోడా
అమరావతి రోడ్డు బ్రాంచి
హిందూ కాలేజి ఫార్మసీ క్యాంపస్, అమరావతి రోడ్డు, గుంటూరు, ఎపి - 522002, ఇండియా

స్వాధీనత ప్రకటన (స్థిరాస్తి కొరకు)
సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8(1) ప్రకారం

[illegible]

స్థిరాస్తి వివరములు

[illegible]

తేది : 18-05-2024
ప్రదేశం : అమరావతి రోడ్డు, గుంటూరు
అధీకృత అధికారి
బ్యాంక్ ఆఫ్ బరోడా

జీవన సౌరభం

కాలాన్ని ఎలా గడపాలో కాదు.. ఎలా ఉపయోగించుకోవాలో తెలిసినవారు అన్ని పనుల్లో ప్రావీణ్యత సాధిస్తారు.

ప్రైవసీ

మల్లారెడ్డి, భాస్కర్‌రావు ఇద్దరూ స్నేహితులు. వారి పిల్లలు కూడా ఒకరికొకరుగా ఉంటారు. అయితే పిల్లల పెంపకం విషయంలో మల్లారెడ్డి కాస్త కటువుగా ప్రవర్తిస్తాడు. కొడుకు విహాన్ ఏ పనిచేసినా తనకు చెప్పాల్సిందేనని ఆంక్షలు పెట్టాడు. భాస్కర్ రావు మాత్రం అలా కాదు. తన కొడుకు కియాన్ష్ విషయంలో చాలా జాగ్రత్తగా నడుచుకుంటాడు. మంచి, చెడుల గురించి వివరంగా చెబుతాడు. ఎప్పుడైనా తప్పు చేసినా గట్టిగా మందలించి, మళ్లీ ఆ తప్పు చేయకుండా ఉండాలని చెబుతాడు. మల్లారెడ్డి మాత్రం విహాన్ ఏ చిన్న తప్పు చేసినా చింత బరికెతో వాతలు తేలేలా కొడతాడు. ఆ దెబ్బలకు తాళలేక విహాన్ మొండిగా తయారయ్యాడు. నాన్నకు తెలిస్తే కొడతాడని భయపడి, అబద్దాలు చెప్పడం కూడా నేర్చుకున్నాడు. కొడుకు తన దగ్గర భయపడుతుంటే మల్లారెడ్డి లోలోన తెగ సంతోషపడేవాడు. పిల్లవాడ్ని క్రమశిక్షణలో పెంచుతున్నానని సంబరపడేవాడు.

ఒక రోజు కియాన్ష్, విహాన్‌ని సినిమాకి వెళదామని అడిగాడు. 'అమ్మో ఇంకేమైనా ఉందా? మా నాన్న అసలు ఒప్పుకోడు. ఇంటికి కాస్త ఆలస్యంగా వస్తేనే అదేపనిగా కొడతాడు. ఇక సినిమాకి అంటే అసలు పంపించడు' అని చెప్పాడు. 'అవునా! మా అమ్మా, నాన్న మా ఇంట్లో అలా ప్రవర్తించరు. మాతో చాలా స్నేహంగా ఉంటారు. మాకు తెలియని విషయాలు ఎన్నో చెబుతారు' అని కియాన్ష్ చెప్పాడు. స్నేహితులిద్దరి మాటలను పక్కనే గదిలో ఉన్న భాస్కరరావు విన్నాడు. తన స్నేహితుడు మల్లారెడ్డిలో ఎలాగైనా మార్పు తేవాలని అనుకున్నాడు.

ఒక రోజు రాత్రి భోజనలయ్యాక మల్లారెడ్డిని కలిసి అలా సరదాగా బయటికి వెళదామని తీసుకెళ్లాడు. పిచ్చాపాటి మాట్లాడుతూ పిల్లల పెంపకంలో జాగ్రత్తల గురించి వివరించాడు. 'ఎదిగే పిల్లలకు కొన్ని ఇష్టాలు, కోరికలు ఉంటాయి. ప్రతి చిన్న విషయంలో మనం అడ్డుకట్ట వేయకూడదు. వయసుకు వచ్చే పిల్లల విషయంలో తల్లిదండ్రులుగా కొన్ని కటువైన నిరయ్ణాలు తీసుకోవచ్చు. కాని ఆ నిర్ణయాలు వారి ఇష్టాలను, కోరికలను, హరించకూడదు. అలాగే 'ఎక్కడో ఏదో జరిగిందని మన పిల్లలను మనమే నమ్మకపోతే ఎలా? ప్రతిదానికి ఒక హద్దు ఉంటుంది. ఆ హద్దు దాటి ప్రవర్తిస్తే మన పిల్లలే మనకు శత్రువులుగా మారుతారు. యవ్వనంలోకి అడుగు పెట్టే పిల్లలకు, మంచి-చెడుల గురించి వివరించాలే కాని ప్రతిదాంట్లో వేలు దూర్చడం మంచి పద్ధతి కాదు. ఆ వయసులో వారికి అనేక విషయాలు అర్థంకాక మెదడు గందరగోళంగా ఉంటుంది. ఆ సమయంలో వాళ్లకు ఆసరాగా, అండగా ఉండాలే కాని భయపెట్టకూడదు. పక్షి రెక్కలను కట్టేస్తే ఎలా ఎగురుతుంది? ఎగరడం ఎలా నేర్చు కుంటుంది? పిల్లలను ఎగరనివ్వాలి, ఎగిరే స్వేచ్ఛనివ్వాలి. వారి ప్రైవసీని భంగం కలిగించకూడదు. అవసరమైన మోతాదులో స్వేచ్ఛ, ప్రైవసీ పిల్లలకు తప్పకుండా ఇవ్వాల్సిందేనని స్నేహితునికి అర్థమయ్యేలా చెప్పాడు. ఆ రోజు నుండి మల్లారెడ్డి తన ప్రవర్తనను మార్చుకున్నాడు. పిల్లలతో సరదాగా గడుపుతున్నాడు.

– తక్కెడశిల.జానీ, 77595 11956.

స్నేహం

నాకు ఇష్టమైనది స్నేహం
విడదీయలేని బంధం స్నేహం
స్నేహాన్ని విడదీయడం కష్టం
స్నేహాన్ని చేర్చుకోవడం సుఖం

సంవత్సరాలు పైగా ఉండేది స్నేహం
గొడవలు పెంచి శత్రుత్వాన్ని పెంచేది ద్వేషం
స్నేహితుల రోజు జరుపుకుంటాం ఇష్టంగా
మిత్రులతో గడుపుతాం హాయిగా

ఇష్టాన్ని పెంచేది మిత్రుత్వం
ద్వేషాన్ని పెంచేది శత్రుత్వం
రమనీయమైనది స్నేహం
ముచ్చటగా కనిపించే బంధం స్నేహం

జీవితంలో ముఖ్యమైన బంధం స్నేహం
ఎన్నడూ మరవని జ్ఞాపకం స్నేహం

- షేక్ గౌస్ బాషా, 7వ తరగతి, అరవింద మోడల్ స్కూల్, మంగళగిరి.

ఎం.సాయికీర్తి, 7వ తరగతి, ఏ.పీ మోడల్‌స్కూల్, తిమ్మాపురం, నంధ్యాల జిల్లా.

సారుగు అశ్విత, 8వ తరగతి, జక్కాపూర్, సిద్దిపేట జిల్లా.

గమనిక

వేసవి సెలవుల్లో పిల్లలకు తోడుగా ప్రతిరోజూ 'వేసవి విడిది' ముస్తాబై వస్తోంది. విద్యార్థినీ విద్యార్థుల రచనలను ఆహ్వానిస్తోంది. కథలు, కవితలు, బొమ్మలు, సెలవుల్లో మీ అనుభవాలు, ప్రయాణ విశేషాలు, ఇతరత్రా కబుర్లు మెయిల్‌కి లేదా

వాట్సాప్ నెం : 8332925496కి పంపండి.

మెయిల్ ఐడీ : chinnaarips@gmail.com

– ఎడిటర్

ఇంటింటా ఆవకాయ...

ఆవకాయకూ, తెలుగు వారికీ అవినాభావ సంబంధం. ఇంట్లో కూర ఉన్నా, లేకున్నా ఆవకాయ ఉంటే చాలు, నాలుగు అన్నం ముద్దలు కమ్మగా గొంతు దిగిపోతాయి. ఎన్ని తరాలు మారినా, ఎన్ని దేశాలు దాటినా ఎర్రెర్రని ఆవకాయ ఇంటా, వెంటా ఉంచుకోవడం తెలుగోళ్లకు ఓ గుర్తింపు చిహ్నం. చాలా ఇళ్లల్లో ఈ పాటికే పచ్చి మామిడికాయలను కట్‌చేసి పచ్చళ్లు పట్టేశారు. ఆఖర్లో వస్తున్న కొన్ని రకాల మామిళ్లతో ఇప్పుడు పచ్చళ్లకు సిద్ధం అవుతున్న వారూ ఉన్నారు.

ఎర్రెర్రని ఆవకాయ పచ్చడిని చూస్తే చాలు నోట్లో నోరూరుతుంది. ఆవకాయ కూడా అనేక రకాలు, అనేక రుచులు. తీపి ఆవకాయ, తురుము ఆవకాయ, అల్లం ఆవకాయ, మెంతి ఆవకాయ, మాగాయ, నువ్వావకాయ, పెసరావకాయ ... ఇలా ఎన్నో రకాలు ఉన్నాయి. మామిడి సీజన్ మొదలైన దగ్గర నుంచి తాత్కాలిక అవసరాలకోసం వారం, పదిరోజుల పాటు నిల్వ ఉండే పచ్చళ్లు పడతారు. ఏడాది పాటు ఉండే రకాలూ సిద్ధం చేసుకుంటారు. ఆవకాయ మన దగ్గరే ఫేమస్ అయినప్పటికీ, ఇది తెలుగిళ్లకే పరిమితం కాదు. ఇతర రాష్ట్రాల్లోనూ మామిడి పచ్చళ్ల పెడతారు.

ఏటేటా వేసవి సీజన్‌లో పట్టే పచ్చళ్లు వచ్చే సీజన్ వరకూ ఉంటాయి. తెలుగు లోగిళ్లలో ఆవకాయ ప్రత్యేకతే వేరు. పచ్చడి ప్రియులు ఎంతగానో ఎదురుచూసే పచ్చి మామిడికాయలు నెలరోజుల క్రితం నుంచి మార్కెట్లలో విరివిరిగా లభిస్తున్నాయి. అప్పటినుంచి పచ్చళ్లు పట్టడం మొదలైంది. ఇప్పుడు పట్టే ఈ పచ్చళ్లు ఏడాదంతా నిల్వ ఉంచుకుంటారు. అన్ని స్థాయిల కుటుంబాల్లోనూ పచ్చడి తయారీ అంటే ఒక ప్రత్యేకమైన ప్రేమ వ్యక్తమవుతూ ఉంటుంది.



వేడివేడి అన్నంలో ఆవకాయ కలుపుకుని తింటుంటే భలే రుచిగా ఉంటుంది. అమ్మను, ఆవకాయను మరువలేమని తెలుగు నానుడి. గతంలో ఒక్కొక్క కుటుంబం 200 నుంచి 400 కాయల వరకు పచ్చళ్లు పట్టేవారు. రాను రాను చిన్న కుటుంబాలు పెరగడంతో 100 నుంచి 50 కాయలకే వరిమితమవుతున్నారు. అందుబాట్లో లేని ధరలు కూడా ఇందుకు ఒక కారణంగా ఉంది.

రైతులు బహిరంగ మార్కెట్లో అమ్మడానికి ధరలు లేకపోయినా విడిగా పచ్చళ్లకు అమ్మే చిరు వ్యాపారులు డజను చిన్న రసాలు రూ.175 నుంచి రూ.250 వరకు చెబుతున్నారు. సాధారణంగా ఆవకాయను చిన్న రసాలతో పడుతుంటారు. ఇవి మిగిలిన కాయల కన్నా అద్భుతమైన రుచిని అందిస్తాయి. వీటి తరువాత తెల్ల గులాబీ రెండో స్థానాన్ని, జలాలు మూడు, నీలాలు నాల్గో స్థానాన్ని ఆక్రమిస్తాయి. అయితే ఈ నాలుగు రకాల కాయలు దిగుబడి 80 శాతం పడిపోయింది. ఆ మేరకు ఈ ఏడాది పచ్చళ్లు పట్టటం కూడా తగ్గి ఉంటుందని భావిస్తున్నారు.

పెరిగిన ధరలు

ఆవకాయ దాని రూపాన్ని సంతరించుకోవాలంటే ఒక మామిడి ముక్కలే సరిపోవు. అందుకు దినుసులు తోడైతేనే ఘుమఘుమలాడే రుచికరమైన ఆవకాయ తయారవుతుంది. ఆవకాయకు అవసరమైన ఆవాలు కిలో రూ.200, మెంతులు రూ.150, వెల్లుల్లి రూ.210, నూనె రూ.170, ఎండుమిర్చి బళ్లారి రూ.200, మామూలు మిర్చి రూ.170 ధరలు పలుకుతున్నాయి. పెరిగిన ధరల ప్రకారం ఓ ఇంటికి అవసరమైన ఆవకాయ పట్టాలంటే రూ.3,000 నుంచి రూ.3,500 వరకు ఖర్చు పెట్టాల్సి వస్తోంది. గతంతో పోల్చుకుంటే ఈసారి ఆవకాయకు ఖర్చు రెట్టింపు అవుతుందని గృహిణులు వాపోతున్నారు.

తయారీ పద్ధతి ఇలా ...

మామిడికాయలను తడిబట్టతో తుడిచి, ముక్కలు చేసి అందులో జీడి తీసేయాలి. ఒక గిన్నెలో కారంపొడి, ఉప్పు, జీలకర్ర, మెంతిపిండి, పసుపు వేసి ఉండలు లేకుండా బాగా కలియబెట్టాలి. మరో గిన్నెలో నువ్వుల నూనె వేడిచేయాలి. ఈ నూనె బాగా కాగిన తర్వాత ఆవాలు, జీలకర్ర కూడా వేసి పోపు పెట్టాలి. గిన్నెను పొయ్యి మీద నుంచి దింపేయాలి. నూనె చల్లారనివ్వాలి. నూనె కాస్త చల్లారి గోరువెచ్చగా ఉన్నప్పుడు అల్లం, వెల్లుల్లి ముద్దవేసి బాగా కలియబెట్టాలి. దీనివల్ల అందులోని తడిపోయి కమ్మగా ఉంటుంది. పూర్తిగా చల్లారాక కలిపి ఉంచుకున్న పొడుల మిశ్రమాన్ని వేసి మొత్తం కలపాలి. తర్వాత మామిడి ముక్కలు వేసి మొత్తం ముక్కలకు పట్టేట్టుగా కలపాలి. మొత్తం కలిపి శుభ్రమైన, తడిలేని జాడీలో ఆవకాయ వేసి జాగ్రత్తగా మూతపెట్టి ఉంచాలి. మూడు రోజుల తర్వాత మరోసారి కలియబెట్టాలి. అంతే! నూరించే కమ్మని ఆవకాయ తినడానికి తయారవుతుంది.

మరోసారి పోలీసుల అదుపులో ఉయ్యూరు లోకేష్

- శాటిలైట్ ఫోన్ స్వాధీనం

ప్రజాశక్తి - గన్నవరం

గన్నవరం విమానాశ్రయంలో ఉయ్యూరు లోకేష్ బాబును మరోసారి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈనెల 17వ తేదీ అర్ధరాత్రి సిఎం జగన్ లండన్ వెళ్లేందుకు విమానాశ్రయానికి వస్తున్న సమయంలో ఆయనకు దగ్గరగా అనుమానాస్పదంగా తిరగడంతో పోలీసులు తనిఖీ చేశారు. టికెట్ లేకపోవడం, సరైన సమాధానం చెప్పకపోవడంతో పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. అనంతరం 41ఏ నోటీసు ఇచ్చి శనివారం ఆయనను పంపేశారు. తిరిగి ఆదివారం మరోసారి ఢిల్లీ వెళ్లేందుకు ఆయన గన్నవరం విమానాశ్రయానికి వచ్చారు. విమానాశ్రయ అధికారుల తనిఖీల్లో లోకేష్ నుంచి శాటిలైట్ ఫోన్ బయటపడింది. దీంతో అధికారులు గన్నవరం పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకుని విచారించారు. కేంద్ర ప్రభుత్వ అనుమతి లేకుండా శాటిలైట్ ఫోన్ వినియోగిస్తున్నట్లు గుర్తించారు. శాటిలైట్ ఫోన్ ఇక్కడ వినియోగించకూడదన్న విషయం తనకు తెలియదని లోకేష్ సమాధానం చెప్పినట్లు తెలిసింది. ఆ ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆయన నుంచి అఫిడవిట్ తీసుకుని పంపేశారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం వెంకటాయపాలెం గ్రామానికి చెందిన లోకేష్.. గతంలో అమెరికాలో డాక్టర్‌గా పనిచేసి రిటైరయ్యారు.

సిఎం కాన్వాయ్‌ను అడ్డుకునేందుకు లోకేష్ ప్లాన్ : గన్నవరం సిఐ ప్రసాద్

విమానాశ్రయంలో శుక్రవారం అర్ధరాత్రి సిఎం కాన్వాయిని అడ్డుకోవాలనే ఉద్దేశంతో కొందరు వ్యక్తులు సిద్ధపడుతున్నట్టుగా తెలిసి లోకేష్‌ను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు గన్నవరం సిఐ ప్రసాద్ తెలిపారు.

సిఎం రాక సమయంలో గన్నవరం విమానాశ్రయంలో చోటుచేసుకున్న ఘటనపై శనివారం ఆయన వెల్లడించిన వివరాల ప్రకారం... గన్నవరం పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు విమానాశ్రయం వద్ద వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా, విమానాశ్రయంలో సుమారుగా 60-65 ఏళ్ల వయస్సు కలిగిన వ్యక్తి అనుమానాస్పదంగా తిరుగుతుండడం గమనించారు. ఆ వ్యక్తి వివరాలు అడగ్గా.. ఆయన సరైన సమాధానం చెప్పలేదు.

సిఎం రాకకు ఏదైనా ఆటంకం కలుగుతుందేమోనని ముందస్తు చర్యలో భాగంగా ఆ వ్యక్తిని గన్నవరం పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చి విచారించారు. ఆయన వద్ద అందుబాటులో ఉన్న గుర్తింపు కార్డులను పరిశీలించారు. ఆ వ్యక్తి పేరు ఉయ్యూరు లోకేష్ బాబు అని, ప్రస్తుతం గుంటూరులో నివాసం ఉంటున్నారని, అమెరికా పౌరసత్వం ఉందని గుర్తించారు. తాను డాక్టర్‌గా పనిచేస్తున్నట్లు లోకేష్ వెల్లడించాడు. ఆయన మొబైల్ ఫోన్ పరిశీలించగా వివిధ వాట్సప్ గ్రూపుల్లో 'సిఎం కాన్వాయ్‌ని అడ్డుకోవడానికి అందరూ రావాలి' అని పిలుపునిచ్చిన సమాచారం ఉండడాన్ని గమనించారు. ఈ సమాచారాన్ని వివిధ వాట్సప్ గ్రూపుల్లో పెట్టినట్లు గుర్తించి కేసు నమోదు చేశారు. అయితే పోలీసులు తన పట్ల దురుసుగా ప్రవర్తించినట్లు, కొట్టినట్లు వివిధ మాధ్యమాల్లో లోకేష్ పోస్టులు పెడుతున్నారని, ఇది వాస్తవం కాదని సిఐ వివరణ ఇచ్చారు.

దళిత యువకుడిపై ముగ్గురు దాడి

ప్రజాశక్తి - కామవరపుకోట (ఏలూరు జిల్లా)

మూత్ర విసర్జన చేశారనే నెపంతో దళిత యువకుడిపై అగ్రకులానికి చెందిన ముగ్గురు వ్యక్తులు దాడికి పాల్పడ్డారు. ఈ సంఘటన ఏలూరు జిల్లా కామవరపుకోట మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటుపల్లి పంచాయతీ పరిధిలోని కంఠమనేనివారిగూడేనికి చెందిన దళిత యువకుడు గెడ్డం రవితేజ శనివారం రాత్రి తన స్నేహితులతో కలిసి హెచ్‌పిసిఎల్ భవనం సమీపంలో రోడ్డు పక్కన మూత్ర విసర్జన చేస్తుండగా అక్కడ మద్యం సేవిస్తున్న అదే గ్రామానికి చెందిన గద్దె సుభాష్, జలపర్తి రాహుల్, కొమ్మిన రత్నాజీ ఇక్కడ ఎందుకు మూత్ర విసర్జన చేస్తున్నావంటూ కులం పేరుతో దూషిస్తూ దాడి చేశారు. స్థానికులు ఘటనా స్థలానికి చేరుకునే సరికి దాడికి పాల్పడిన వారు అక్కడి నుంచి పరారయ్యారు. గాయపడిన రవితేజను చింతలపూడి ప్రభుత్వ ఆస్పత్రికి స్థానికులు తరలించారు. బాధితుడు గెడ్డం రవితేజ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. దళిత యువకుడిపై దాడి చేసిన వారిపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కెవిపిఎస్ ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్ డిమాండ్ చేశారు. రవితేజకు మెరుగైన వైద్యం అందించాలని, బాధిత కుటుంబానికి రక్షణ కల్పించాలని కోరారు. దళిత యువకుడిపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనారిటీ హక్కుల సాధన సమితి నాయకులు టివిఎస్.రాజు డిమాండ్ చేశారు.

వివక్షతోనే ఎన్నికల బదిలీలు

- మాజీ ఐఎఎస్ విజయ్‌కుమార్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉన్నతాధికారుల బదిలీలు చాలా వరకు వివక్షతో కూడుకున్నాయని మాజీ ఐఎఎస్, లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జిఎస్ఆర్‌కెఆర్ విజయ్‌కుమార్ విమర్శించారు. రూల్ ఆఫ్ లా అందరికీ ఒకే విధంగా ఉండాలి. అందులో వివక్ష చూపించడం తగదని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎక్కడ, ఎప్పుడు ఎలాంటి సంఘటన జరిగినా దానికి ఎస్‌సి, ఎస్‌టి అధికారులే చర్యలకు గురవుతున్నారని, ఇప్పుడు కూడా ఆ తరగతులకు చెందిన అధికారులే గురయ్యారని అన్నారు. ఎన్నికలకు ముందు ముగ్గురు కలెక్టర్లను ఎందుకు మార్చారో, కారణాలేంటో ఎవరికీ తెలియదని అన్నారు. పల్నాడు జిల్లా కలెక్టరు శివశంకర్‌ను మార్చటానికి గల కారణమేమిటో ఎవరూ చెప్పడం లేదని, కాబట్టి వివక్షే దీనికి కారణంగా భావించాల్సి ఉంటుందని తెలిపారు. ఎన్నికల కమిషన్ మార్చిలో నలుగురు కలెక్టర్లను మారిస్తే అందులో ముగ్గురు ఎస్‌సి, ఎస్‌టి వారేనని పేర్కొన్నారు. పల్నాడు కలెక్టరుగా శివశంకర్‌ను తిరిగి కొనసాగించాలని, లేదంటే అతను చేసిన తప్పులను చూపించాలని డిమాండ్ చేశారు. తిరుపతిలో కారు తగలబెడితే ఎలాంటి చర్యలు లేవని లా అండ్ ఆర్డర్ పరిస్థితులను సాకుగా చూపించి ఎస్‌సి, ఎస్‌టి అధికారులపై చర్యలు తీసుకోవడమేంటని ప్రశ్నించారు. గతంలో కూడా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఇచ్చిన నివేదిక ఆధారంగా కృష్ణా జిల్లా కలెక్టర్‌గా పనిచేస్తున్న రాజబాబును, లక్ష్మీశా, శివశంకర్‌ను బదిలీ చేశారని అన్నారు. దీనిని తాము వ్యతిరేకిస్తున్నామన్నారు. వీరి బదిలీలను తక్షణమే నిలిపేసి వారిని యథా స్థానాల్లో కొనసాగించాలని, లేదంటే ఈ అంశంపై తాము పోరాటం చేస్తామని హెచ్చరించారు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

ప్రజాశక్తి- తిరుమల

తిరుమలలో గత మూడు రోజులుగా యాత్రికుల రద్దీ కొనసాగుతోంది. వేసవి సెలవులతో పాటు వారాంతపు రద్దీతో దేశం నలుమూలల నుంచి వచ్చిన యాత్రికులతో తిరుమల పోటెత్తింది. విద్యార్థులకు దాదాపు అన్ని పరీక్షలు పూర్తయినందున అధిక సంఖ్యలో తరలివస్తున్నారు. ఔటర్ రింగ్ రోడ్డులోని ఆక్టోపస్ వద్ద నుంచి క్యూలైన్లలో యాత్రికులు బారులు తీరారు. ఆదివారం సాయంత్రం ఐదు గంటల నివేదిక ప్రకారం ఆక్టోపస్ సర్కిల్‌లో లైన్‌లోకి ప్రవేశించిన యాత్రికులకు శ్రీవారి దర్శనం దాదాపు 24 గంటల సమయం పడుతోంది. టిటిడి ఇఒ ఏవి ధర్మారెడ్డి ఆదేశాల మేరకు యాత్రికుల సౌకర్యాలు, క్యూలైన్లను నిరంతరాయంగా అధికారులు పర్యవేక్షిస్తున్నారు. మాతశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనం, తిరుమలలోని అన్నప్రసాద కౌంటర్లు, నారాయణగిరి ఉద్యానవనాలలో పాటు యాత్రికుల రద్దీ అధికంగా ఉండే ప్రాంతాలలో ఆహారం, పాలు, తాగునీరు అందించేందుకు టిటిడి విస్తృత ఏర్పాట్లు చేసింది.

సూపర్ సన్‌రైజర్స్

- పంజాబ్ కింగ్స్‌పై అదిరే విజయం
- ఛేదనలో అభిషేక్, క్లాసెన్, నితీశ్ జోరు
- హైదరాబాద్‌కు రెండో స్థానం

హైదరాబాద్ : పంజాబ్ కింగ్స్‌పై సన్‌రైజర్స్ హైదరాబాద్ 4 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. 215 పరుగుల లక్ష్యాన్ని 19.1 ఓవర్లలోనే ఊదేసిన సన్‌రైజర్స్ హైదరాబాద్ పాయింట్ల పట్టికలో రెండో స్థానంలో నిలిచేందుకు తన చేతుల్లో ఉన్న పని చేసేసింది. భారీ ఛేదనలో ట్రావిశ్ హెడ్ (0) నిరాశపరిచినా.. అభిషేక్ శర్మ (66, 28 బంతుల్లో 5 ఫోర్లు, 6 సిక్స్‌లు), హెన్రిచ్ క్లాసెన్ (42, 26 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), నితీశ్ కుమార్ రెడ్డి (37, 25 బంతుల్లో 1 ఫోర్, 3 సిక్స్‌లు), రాహుల్ త్రిపాఠి (33, 18 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) కదం తొక్కటంతో సన్‌రైజర్స్ హైదరాబాద్ అలవోక విజయం సాధించింది. పంజాబ్ కింగ్స్ ఏ దశలోనూ సన్‌రైజర్స్‌ను ఇరకాటంలో పడేయలేకపోయింది. అంతకుముందు తొలుత బ్యాటింగ్ చేసిన పంజాబ్ కింగ్స్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 214 పరుగులు చేసింది. ఓపెనర్ ప్రభుసిమ్రన్ సింగ్ (71, 45 బంతుల్లో 7 ఫోర్లు, 4 సిక్స్‌లు), రోసో (49, 24 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్స్‌లు), అథ్వర (46, 27 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించారు. పంజాబ్ కింగ్స్ 14 మ్యాచుల్లో తొమ్మిదో పరాజయంతో సీజన్‌ను ముగించగా.. సన్‌రైజర్స్ హైదరాబాద్ గ్రూప్ దశలో 14 మ్యాచుల్లో ఎనిమిదో విజయంతో పాయింట్ల పట్టికలో టాప్-2 నిలిచేందుకు ఎదురుచూస్తుంది!. ఛేదనలో ధనాధన్ అర్థ సెంచరీ సాధించిన సన్‌రైజర్స్ ఓపెనర్ అభిషేక్ శర్మ 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు.

అభిషేక్ శర్మ (66 పరుగులు, 28 బంతుల్లో 5 ఫోర్లు, 6 సిక్స్‌లు)

ఆదివారం గౌహతిలో జరగాల్సిన రాజస్థాన్ రాయల్స్, కోల్‌కత్తా నైట్ రైడర్స్ మధ్య మ్యాచ్ ఒక్క బంతి కూడా పడకుండానే రద్దయింది. ఇరు జట్లకు చెరో ఒక్క పాయింట్ లభించింది. దీంతో అన్ని మ్యాచ్‌లు పూర్తయ్యేసరికి కోల్‌కత్తా 20 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. హైదరాబాద్, రాజస్థాన్ జట్లు 17 పాయింట్లతో సమానం ఉన్నా, రన్‌రేట్ ఆధారంగా హైదరబాద్ రెండోస్థానం లభించింది. రాజస్థాన్ మూడో స్థానం, బెంగళూరు నాలుగో స్థానంలోనూ నిలిచాయి. ఈ నెల 21న జరిగే మొదటి క్వాలిఫయర్ మ్యాచ్‌లో కోలకత్తా, హైదరాబాద్ జట్లు తలపడతాయి. ఇందులో గెలిచిన జట్టు నేరుగా ఫైనల్‌కు చేరుకుంటుంది. ఈ నెల 22న రాజస్థాన్, బెంగళూరు జట్ల మధ్య ఎల్మినేటర్ మ్యాచ్ జరగనుంది.

215 ఊదేశారు : ప్లే ఆఫ్స్ ముంగిట సన్‌రైజర్స్ హైదరాబాద్ భారీ లక్ష్యాన్ని ఊదేసింది. ప్రమాదకర ఓపెనర్ ట్రావిశ్ హెడ్ (0) తొలి బంతికే నిష్క్రమించినా.. సన్‌రైజర్స్ దూకుడు తగ్గలేదు. మరో ఓపెనర్ అభిషేక్ శర్మ (66)తో కలిసి రాహుల్ త్రిపాఠి (33) పవర్‌ప్లేలో దంచికొట్టాడు. నాలుగు ఫోర్లు, రెండు సిక్సర్లతో త్రిపాఠి పవర్‌ప్లేలో చెలరేగాడు. నెమ్మదిగా మొదలెట్టిన అభిషేక్ శర్మ.. పంజాబ్ కింగ్స్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. ఐదు ఫోర్లు, నాలుగు సిక్సర్లతో 21 బంతుల్లోనే అర్థ సెంచరీ బాదిన అభిషేక్ శర్మ ఛేదనను లాంఛనం చేశాడు. రాహుల్ త్రిపాఠి, అభిషేక్ శర్మ నిష్క్రమించినా.. నితీశ్ కుమార్ రెడ్డి (37), హెన్రిచ్ క్లాసెన్ (42) అదరగొట్టారు. క్లాసెన్ తనదైన శైలిలో మూడు ఫోర్లు, రెండు సిక్సర్లతో విశ్వరూపం చూపించగా.. నితీశ్ కుమార్ రెడ్డి కీలక ఇన్నింగ్స్ ఆడాడు. మూడు సిక్సర్లు, ఓ ఫోర్‌తో ఆకట్టుకున్నాడు. ఆఖరు ఓవర్లో 4 పరుగులు అవసరం కాగా.. అబ్దుల్ సమద్ (11 నాటౌట్), సన్వీర్ సింగ్ (6 నాటౌట్) తొలి బంతికే లాంఛనం ముగించారు. పంజాబ్ కింగ్స్ బౌలర్లలో అర్షదీప్ సింగ్ (2/37), హర్షల్ పటేల్ (2/49) రెండేసి వికెట్లతో రాణించారు.

ఛాంపియన్స్ సాత్విక్ జోడీ

- ఫైనల్లో చైనా జోడీపై విజయం
- థాయ్‌లాండ్ ఓపెన్ సూపర్ 500

బ్యాంకాక్ (థాయ్‌లాండ్) : ఇటీవల వరుస టోర్నమెంట్లలో అంచనాలు అందుకోవటంలో నిరాశపరిచిన భారత బ్యాడ్మింటన్ డబుల్స్ స్టార్స్ సాత్విక్‌సాయిరాజ్ రాంకిరెడ్డి, చిరాగ్ శెట్టి.. థాయ్‌లాండ్ ఓపెన్‌లో మెప్పించారు. టాప్ సీడ్‌గా బరిలోకి దిగిన భారత షట్లర్లు పురుషుల డబుల్స్ విభాగంలో చాంపియన్స్‌గా నిలిచారు. ఆదివారం జరిగిన టైటిల్ పోరులో అన్‌సీడెడ్ చైనా షట్లర్లు చెన్ బో యాంగ్, లి యులపై 21-15, 21-15తో వరుస గేముల్లో మెరుపు విజయం సాధించారు. 46 నిమిషాల్లో ముగిసిన టైటిల్ పోరులో చైనా షట్లర్లను చిత్తు చేశారు. తొలి గేమ్‌లో సాత్విక్, చిరాగ్‌లకు చైనా షట్లర్లు గట్టి పోటీ ఇచ్చారు. కానీ అది ప్రథమార్థం వరకే పరిమితం అయ్యింది. 7-10తో వెనుకంజ వేసిన మనోళ్లు విరామ సమయానికి 10-11తో నిలిచారు. ద్వితీయార్థంలో సాత్విక్ సక్సెస్‌ఫుల్ రివ్యూతో 12-11తో ముందంజ వేసి అక్కడ్నుంచి వెనక్కి తగ్గలేదు. వరుస పాయింట్లతో 21-15తో తొలి గేమ్‌ను సొంతం చేసుకున్నారు. ఇక రెండో గేమ్‌లో సాత్విక్, చిరాగ్‌లు టాప్ క్లాస్ గేమ్ చూపించారు. విరామ సమయానికి ఐదు పాయింట్ల ఆధిక్యం సాధించారు. వరుస గేముల్లో ఫైనల్లో విజయం సాధించిన వరల్డ్ నం.3 జోడీ థాయ్‌లాండ్ ఓపెన్ విజేతగా అవతరించింది. మహిళల సింగిల్స్‌లో సుపనిద (థాయ్‌లాండ్), మెన్స్ సింగిల్స్‌లో లీ జి జియ (మలేషియా) విజేతలుగా నిలిచారు.

2019లో తొలిసారి థాయ్‌లాండ్ ఓపెన్ విజయం సాధించిన సాత్విక్, చిరాగ్ జోడీ.. తొలి బిడబ్ల్యూఎఫ్ సూపర్ 500 టైటిల్ సొంతం చేసుకున్నారు. ఐదేండ్ల కిందట థాయ్‌లాండ్ ఓపెన్ విజయం సాత్విక్, చిరాగ్ జోడీకి కలిసొచ్చింది. ఆ తర్వాత వరుసగా అద్వితీయ విజయాలతో వరల్డ్ నం.1గా ఎదిగారు. ఇప్పుడు 2024 పారిస్ ఒలింపిక్స్ ముంగిట థాయ్‌లాండ్ ఓపెన్‌లో చాంపియన్స్‌గా నిలిచిన సాత్విక్, చిరాగ్‌లు ఇదీ రాబోయే వరుస విజయ జైత్రయాత్రకు సంకేతంగా భావిస్తున్నట్టు సాత్విక్, చిరాగ్‌లు విజయానంతరం తెలిపారు. 'థాయ్‌లాండ్ ఓపెన్ విజయం మాకు ప్రత్యేకం. ఇక్కడే మేము తొలి సూపర్ 500 టైటిల్ సాధించాం. ఆ తర్వాత వరుసగా టైటిళ్లు గెల్చుకున్నాం. ఇప్పుడూ అదే పునరావృతం అవుతుందని ఆశిస్తున్నాం' అని సాత్విక్ అన్నాడు. థాయ్‌లాండ్ ఓపెన్ విజయంతో సాత్విక్ జోడీ 9200 ర్యాంకింగ్స్ పాయింట్లతో పాటు సుమారు రూ.27.63 లక్షల నగదు బహుమతి సైతం అందుకున్నారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68